భారతి

జూన్ 1973

వ్యవస్థాపకులు:

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒకరూపాయి

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938–1972)

★

జూన్ 1973

సంపుటము : 50 : సంచిక : 6 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జూన్ 1973



శ్రీ శివలెంక శంభుప్రసాద్

జననం **26-1-1911**

శివసాయుజ్యం **8-6-1972**

"అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతం గమయ"

చీకటి వెలిగించిన వార్త

శ్రీ మాదిరాజు రంగారావు

రోడ్డుపై
ఏదో మునిగిపోతున్నట్టు
ఉరికే పిల్లడికన్నా
ఇంట్లో ఊహ చేసే
తల్లికి పట్టుకుంది భయం.
ఏ క్షణం జరుగుతోందో నని
అతనికీ చెప్పరాని అపాయం.

గర్జిస్తూ
పైకి దూకనున్న సింహం వలె
ఒక పట్టాన వీడదు సంశయం.

కాలం కదలుతోంది
దున్నపోతు బండివలె,
విసిగినా అలసినా ఏమైనా
తప్పదు దారిని ప్రయాణం.

ఉరలి పడింది పగలు,
కిటికీ నుండి చూస్తే
పూచిన మోదుగ వలె — ఉంది
భయానికి ప్రతీకగా.

రాత్రి వెలిగింది,
ఉలికి పాటుతో
గదిలో బల్బు ముఖంతో
చీకటి కెదురు ప్రశ్నవలె — ఉంది
ధైర్యానికి చిహ్నంగా.

ఉదయం ఎదురైంది
రక్తారుణ మందారం వలె,
హృదయం స్పందించింది
ఝరులతో వర్షా సరసి వలె.

రోడ్డుపైకి
ఉరికిన పిల్లడికన్నా
ఇంట్లో వేచి ఉన్న
తల్లికి ఎంత ఆరాటమో?
అతడు కన్నుల్లోకి దూకే
ఆ క్షణం రావాలని త్వరగా
ఆనందపు ముద్దగా
నవనీత సుకుమారంగా.

నిదురలేని కన్నుల్లో
జ్వలించిన దీపాలు
కొడిగట్టినవి రూపాలు!

తెరచి ఉన్న కన్నుల్లో
కుంటువడిన వెలుగులు
నడవలేని బొమ్మలు!

పిటిచుట్టూ నీడలు
భయపు పొరలు!
ప్రేమలో, ఆశలో
వేలాడుతూ జీరాడుతూ!

పొడుకాలం వచ్చింది అంటూ
అడుగుపెట్టారు ఇరుగూ పొరుగూ.

మరునాడు పత్రికల్లో వార్త
పోలీసు కాల్పుల్లో
'ఆ' బాలుని మృతి.

తిక్కన పదప్రయోగకోశము

శ్రీ నిడుదవోలు వెంకటరావు

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారు సమగ్రాంధ్ర నిఘంటు నిర్మాణానికి, పదకోశములు ప్రకటించుచున్న సంగతి యావదాంధ్రలోక మెఱిగినదే. ఈ పదకోశాలు రెండు విధాలు.

1. భాషాసాహిత్య పదకోశాలు.
2. మాండలికవృత్తి పదకోశాలు.

ప్రస్తుత సమీక్షా గ్రంథము తిక్కన పదప్రయోగకోశము భాషాసాహిత్య పదకోశాలకు సంబంధించినది. ఇది మొదటి సంపుటము — అచ్చులు మాత్రము గలవు. ఈ ప్రణాళికలో నిదివఱకు, నీ క్రింది కోశములు వెలువడినవి.

1. నన్నయ పదకోశము.
2. నన్నెచోడ పదప్రయోగ సూచిక[1]
3. శ్రీనాథ పదకోశము.

పై కోశములలో మూడు కోశముల నిదివఱకే భారతి ముఖమున సమీక్షించు నవకాశము గలిగినది.

1. నన్నెచోడ పదప్రయోగ సూచిక.
భారతి 1963. జనవరి—70–78 పుటలు.

2. మాండలికవృత్తి పదకోశము.
భారతి ఏప్రియలు 1970. 22–32 పుటలు.

3. మాండలిక పదకోశము.
భారతి మార్చి— 1971. 34–50 పుటలు.

ఈ ప్రణాళికలో తిక్కన పదప్రయోగ కోశమును సమీక్షించుటకు నా కవకాశము నొసగిన భారతి పత్రికా సంపాదకులకు ప్రథమముగా నా కృతజ్ఞత లర్పించుచున్నాను.

పీఠికలు

ఈ పదకోశములలో, మాండలికవృత్తి పదకోశమునకు నాంధ్రాంగ్లభాషలలో పీఠిక యున్నది గాని సాహిత్య పదకోశములకు లేవు. మాండలిక పదకోశములకంటె భాషా సాహిత్య పదకోశములకు పీఠిక లత్యంతావశ్యకములు. పీఠికలులేని హేతువున నీ పదకోశములు శిరస్సులేని మొండెమువలె నుండి భాషా పరిశ్రమ చేయువారి కేమాత్రము ప్రయోజనకారులు కాకున్నవి. ఈ పీఠికావశ్యకత నితఃపూర్వమే అకాడెమీవారి దృష్టికి తేబడినది[2]. కాని వారు దీనిని గమనించినట్లు లేదు.

వాస్తవముగా మహాకవుల పదకోశములకు విమర్శనాత్మకమగు పీఠికలు తప్పనిసరిగా నుండవలెను. ప్రస్తుత కోశమున, సంపాదకులలో నొకరైన డాక్టరు భద్రిరాజు కృష్ణమూర్తిగారు 'గ్రంథపరిచయం' అను పేర ఆఱుపుటలలో అమూల్య విషయములను దెలిపినందులకు వారి నత్యంతము నభినందించవలసియున్నది.

పదసేకరణ-ప్రయోజనములు

ఈ పదకోశములు— సమగ్రాంధ్ర నిఘంటు నిర్మాణమే ప్రధానముగా సమకూర్చబడుచున్నను, నీ సమగ్రాంధ్ర నిఘంటువు ఆధునిక భాషాశాస్త్ర పద్ధతుల ప్రకారము నిర్మింపబడునని, ఈ కోశముల

1. ఇది సాహిత్య అకాడమీవారు పెట్టిన పేరు. 'పదప్రయోగకోశము' అని అందు లేదు.

2. నన్నయపదప్రయోగ కోశము — సమీక్ష భారతి. ఏప్రియలు 1962.

పదసేకరణ విధానము తెలుపుచున్నది. సాహిత్య అకాడమీ వారి ప్రణాళిక భాషాశాస్త్ర పద్ధతులపైననే అని నిర్దిష్టమైనచో అది ఇదివఱకు మనకు సంప్రదాయ సిద్ధముగా వచ్చుచున్న నిఘంటు రచనా ప్రణాళికకు విరుద్ధముగా నుండును. ఆధునిక భాషాశాస్త్రము లక్షణము మాత్రమే. దానికి లక్ష్యము లేదు. తెలుగు భాషా నిఘంటువుల తత్త్వము వేఱు. అసలు తెలుగు భాష లక్ష్యమునుండి లక్షణము వేర్పడిన భాష[3]—అది కావ్యభాషకే నియతము—వ్యవహారికభాషకు గాదు — భాషా శాస్త్రము వ్యావహారిక భాషకు సంబంధించినది. గ్రాంథిక భాషా తత్త్వము, వాని పుట్టుపూర్వోత్తరము తెఱుంగుటకు మాత్రము భాషాశాస్త్రము తోడ్పడును. ప్రవాహరూపమైన భాషలో వ్యవహారమున మార్పులు సంభవించుట స్వాభావికము. కవులును లోకమున సిద్ధమైన పదములనే వాడుక చేయుదురు. కవులు సంస్కార మున్నవారు గావున వారు ఆయా లోకవ్యవహార సిద్ధపదముల తత్త్వము నెఱిగి వానిని ఉచ్చారణాది భేదములవలన—మాఱురూపము నందిన పదములను సుష్ఠు రూపములతో కావ్యములలో ప్రయోగింతురు. భాషా లక్షణములను, సజీవముగా నిల్పువారు కవులే గావున—తెలుగునకు, కవిప్రయోగ భాషయే లక్ష్యమైనది. ఆ లక్ష్యమునుండియే వ్యాకరణ చ్ఛందో గ్రంథములు వెలసినవి.

ఈ సందర్భమున తెలుగునకు గల నింకొక విశిష్టలక్షణము చెప్పవలసియున్నది. తెనుగుభాష—తెలుగు వ్యాకరణము—తెలుగు ఛందస్సు అవినాభావ సంబంధము గలవి—దీనిని వేఱొకచో విపులముగా దెలిపితిని.[4]

పై యంశములవలన — ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతములను సమన్వయము చేయుటకుముందు, తెలుగున గల కవి ప్రయుక్తభాషా పదముల సేకరణము ప్రధానముగా జరుగవలసియున్నది. తెలుగు భాషలో నింతకుముందు వెలువడిన—బ్రౌను, శబ్దరత్నాకరము, సూర్యరాయాంధ్ర నిఘంటువులలో, విధిగా కవి ప్రయోగము లీయబడియున్నవి. అయితే ఇంకను వేలకొలది పదములు ముద్రితాముద్రిత గ్రంథములనుండి సేకరించి మన నిఘంటువు సమగ్రము చేయవలసి యున్నది.[5]

పదకోశములు—తత్సమములు

ఇంతవఱకు ప్రకటించిన భాషా సాహిత్య పదకోశములను పరిశీలించిన అకాడమీ వారేర్పఱిచిన పదసేకరణ విధాన మెంతమాత్రము సరియైనదికాదు. ఈ కోశములం దన్నింటను తత్సమ క్రియారూపము లున్నవి గాని తత్సమ పదములు లేనేలేవు.

తత్సమ పదములు తెలుగు భాషలో సగమునకు హెచ్చుగా గలవు. కావ్యములలోనేకాక నిత్యవ్యవహారమునను తత్సమములున్నవి. తత్సమములు లేనిదే కావ్యభాషయే తెనుగున రూపొందదప్పుడు—అవి నిఘంటువులలో ప్రధాన స్థానమాక్రమించినప్పుడు వానిని పరిహరించిన—అకాడమీ కోశములు సమగ్రాంధ్ర నిఘంటు నిర్మాణమున కెట్లు తోడ్పడునో దురూహ్యముగా నున్నది.

ఈ నాటి నిఘంటువులలో పెద్దదియగు సూర్యరాయాంధ్ర నిఘంటువున[6] తత్సమ పదములకు ప్రయోగములు లేవు. అనగా తత్సమ పదములు తెలుగు కావ్యములనుండి ప్రయోగ సహితముగా చూపబడలేదు. ఇందువలన నన్నయభట్టు ప్రయోగించిన తత్సమ పదముల కర్థములుకూడ నందు లభింపవు. ఈ లోప

---

3. తెలుగు వ్యాకరణ చ్ఛందో లక్షణ గ్రంథముల నవలోడనము ఛేసిన నీ విషయము స్పష్టము.

4. నన్నయ యతిప్రాసలు—అక్షరార్చన—డాక్టరు పాటిబండ మాధవశర్మగారి షష్ఠిపూర్తి సంచిక.

5. ఇట్టి దృష్టితో శబ్దరత్నాకరమును సంపూర్ణముగా సంస్కరించి యిప్పటికి 35,000 (ముప్పయిఅయిదువేల) పదములను సిద్ధము చేసినాను.

6. ఈ సమీక్షలో సూర్యరాయాంధ్ర నిఘంటువునకు సూ. ని. అని సాంకేతికము.

మును గమనించి నేను శబ్దరత్నాకరము నూతన ముద్రణమున తెలుగు కవిప్రయుక్తములైన తత్సమముల కన్నింటికి ప్రయోగము లిచ్చితిని. ఈ పద్ధతికి భాషా విమర్శకులు నన్నభినందించినారు.[7]

తత్సమములు లేనందువల్ల, అకాడమీ కోశములు పరిమిత ప్రయోజనము కలవియైనవని సారాంశము.

పదకోశము — కవులు

ఇంతవఱకు అకాడమీవారు—నన్నయ, నన్నెచోడుడు, శ్రీనాథుడు—తిక్కన- అను కవుల గ్రంథములకే పదకోశములు తయారుచేయించినారు కాని, ఏ కవుల గ్రంథములనుండి మొదట పదకోశములు నిర్మింపవలెను అన్న విషయము వారు చర్చించి, ముందు నిర్ణయించుకొన్నట్లు కానరాదు. కాలక్రమమును బట్టిగాని, కావ్యసాహితీ పరిణామక్రమమును బట్టిగాని— ఇది జరుగలేదు—కోశప్రణాళికా సంపాదకుల యభిప్రాయానుసారము కోశములు వెలువడినవి. అందువలన ఎటి యవ్యవస్థ గలిగినదో చూడుడు.

శివకవులు

పూర్వ కవులలో హెచ్చుగా, తెలుగు పదములను వాడినకవి పాల్కురికి సోమనాథుడు. సంపాదకులు నన్నెచోడ కవిని గ్రహించిరి గాని, శివకవులలో ప్రసిద్ధుడగు—సోమనాథుని నెత్తుకొనలేదు.[8] శివకవులు, నన్నయ తిక్కనాది కవులకున్న విలక్షణమైన భాషా సంప్రదాయములు పాటించినవారని వారు తమిళ కన్నడ పదములను ప్రయోగించుటచేతను, విలక్షణ పదప్రయోగముచేతను — వారి భాషా సంప్రదాయము, శివకవి సంప్రదాయము లేక దేశి సంప్రదాయముగా పరిణమించినదని —భాషా చరిత్రకారులందఱు నెఱుగుదురు. ఆధునిక భాషాశాస్త్ర పద్ధతుల నన్వయించుటకు—శివకవుల కృతు లెంతగానో తోడ్పడును. అయినను భాషాశాస్త్రాధ్యయనమునను ముఖ్యమగు 'శివకవి పదప్రయోగ కోశము'ను గూర్చి ఇంతవఱకు—ఆలోచనయే లేదు— పోనిండు.

ఎఱ్ఱన పదప్రయోగకోశము

శివకవులను విస్మరించినను అకాడమీవారు భారత కవిత్రయములో నొకడైన 'ఎఱ్ఱన'ను విస్మరించుట వింతగనున్నది. మన భాషా సాహిత్యములకు కవిత్రయ సంప్రదాయమే ప్రాతిపదిక గదా? సంపాదక వర్గమువారు బహుశః—ఎఱ్ఱన అరణ్య పర్వశేష మొక్కటియే మనస్సులో నుంచుకొని ఎఱ్ఱనను మాని యుందురు. కాని అతని హరివంశమున అయిదువేల గద్యపద్యము లున్నవని వారెఱుగరు. ఎఱ్ఱన నృసింహ పురాణము చిన్నదియైన, గ్రహింపదగిన పదవిశేషములు గలవు.

భాస్కర రామాయణ, భాగవతములు

భిన్నకర్తృకమైన భాస్కరరామాయణము శ్రీనాథునికి ముందుకృతి— 6086 గద్యపద్యములు గలది. ఇక శ్రీనాథునికి సమకాలికముగ వెలసినది. పోతన భాగవతము—ఇందులో 9000 గద్య పద్యము లున్నవి. మఱి యీ రెండిండిటికి పదప్రయోగ కోశములు వలదా? భారత భాగవత రామాయణములను సంప్రదాయము మనకున్నదే. దీనినైనను పాటింపలేదు. ఇందువలన ఏయే కవుల కావ్యములకు పద ప్రయోగ కోశములుండవలెను అనునది ఒక నిర్దిష్ట ప్రణాళిక మూలమున నిశ్చితమైనదికాదని గ్రహింపవలెను.

పదప్రయోగకోశ ముద్రణ విధానము

ఈ పదకోశముల ముద్రణ విధానమునుకూడ మొదట నిర్ణయించుకొనినట్లు కానిపించదు. ఇవి పదకోశములు కాబట్టి యిందు పదము లకారాది

---

7. శబ్దరత్నాకరానుబంధము — 1958, 1969.

8. ఒకవారు, సాహిత్య అకాడమీ వార్షికోత్సవ సందర్భమున నేను, శివకవుల కృతులకు పదకోశములను సిద్ధము చేయవలసినదిగా తీర్మానము ప్రతిపాదించితిని— కాని దాని నెవ్వరును బలపఱచలేదు!

నుండక తప్పదు. ఇంక పదముల ఆరోపములకు నిచ్చు టలో నొక్క క్రమ విధానము పాటింపక పోవుటవలన గ్రంథములు విపరీతముగా పెరిగిపోయినవి.

దీనికి హేతువులు

1. త్రికము (అ, ఈ, ఏ) మీది వ్యాకరణ కార్యరూపములు చూపుట.

ఇవి అచ్చులైన యడాగమముగాను, హల్లులైన ద్విత్వములుగాను నుండును. అ+ఎడ=అయ్యెడ — ఆయెడ—అ+కడ, ఆకడ, అక్కడ.

ఇది సంధి సూత్రము—ఈ వ్యాకరణ కార్యము వలన—అసలు శబ్ద స్వరూపము మారలేదు. అట్టి సందర్భమున—దీనిని కవి యెన్నిసారులు వాడినాడు అని కనుగొనుట ఎందులకు?

ఇంకొకటి—ఈ హల్లులతో కూడిన త్రికముల శబ్దము లన్నియు త్రికములు లేకుండ, ఆయా హల్లులతో రానే వచ్చుచున్నవి. అనగా, హల్లులైన ఆరోపములు రెండు పర్యాయములు కోశములో వచ్చుచున్న వన్నమాట—పదకోశములలో నిట్టి పునరుక్తి కాస్కారము లేదు.

పదము నిచ్చిన ఆరోపము దీర్ఘముగా నుండుట—'అని' యను మాట నిచ్చినప్పుడు—ఒక పంక్తి వాడుట.

ప్రతి పదమునకు వ్యాకరణముల మూలమున నేర్పడిన కార్యముల రూపము లన్నియు నిచ్చుట.

ఉదా. ద్రుతము. ౯—అరసున్న—ం—బిందువు. ను. సత్వమున్=సంశ్లేషము—రూపములను పొందును. ఈ కోశములలో నీ రూపము లన్నియు చూపబడినవి. వీనిలో బిందురూపము 'అగుటకుం'—అని చూపుట తెనుగు భాషా సంప్రదాయ విరుద్ధము—తెనుగున పదాంతమున బిందువు నిలువదు.

పై కారణములవలన—నీ పదకోశము లెట్లు తమ ప్రయోజనములు సాధింపలేకపోయినవో తిక్కన పదప్రయోగకోశమును బటి నిరూపించుచున్నాను.

తిక్కన పదప్రయోగకోశము

ఇది తక్కిన పదప్రయోగ కోశములరీతిగా ముద్రితమైనది. పుటలు 1114 పుటకు రెండు వైపుల ఆరోపములు ఆకరములు నీయబడియున్నవి.

ఈ గ్రంథమునకు ముందు మాటలో కోశ నిర్మాణంలో పాటించిన 16 నియమాలు వివరింప బడినవి. కాని యీ నియమాలు సరిగా పాటించినట్లు లేదు.

(1) 10. పలుకు వెలుఁగు, మడువు మొ. వి ఒకప్పుడు క్రియలుగాను ఒకప్పుడు తద్ధర్మ విశేషణాలుగాను ఒకప్పుడు కృదంతాలుగాను వాడ బడుతుంటాయి. ప్రయోగాన్నిబట్టి ఆరోపం ప్రక్కన (క్రి) (వి ణ) 'కృ' అనే గుర్తులతో ఈ భేదం సూచించాలి.

'అని' అన్న ఆరోపాల క్రింద యిచ్చిన వానిలో 'అని' యుద్ధము అన్న విశేష్యరూపమున్నది. కాని యీ సంపుటములో అది సూచితము కాలేదు.

పుట. 278. అని. అని నివాతకవచులను దానవుల నాతఁడు...ఉక్కుమడచె—వి. రా. 4—210.

ఈ ఆరోపమున—'అని' క్రియకాదు. అని అనగా యుద్ధమున — నివాతకవచులను జయించెను అని అర్థము.

అదే పుట. 'మహోత్సుఁ డొక్కరుండని వను గాచె వి. 5—284.

ఇది ఉత్తరుని వాక్యము—ఇచట—అని యనగా యుద్ధము సూచన లేదు.

ఈ పుటలో పై రెండు చోట్లనే కాదు. 48 ఆరోపములలో 'అని' అనగా యుద్ధమనియే అర్థము. కాని ఏ సూచన లేదు—

పుట 690. ఉనికి ఇది ఉనుచు ధాతువు కృదంతము. కాని యీ ఆరోపములలోనిది సూచితము

---

9. ఆరోపములు Entries ఆకరములు—References.

కాలేదు. పుట 850. ఎఱుక. ఇది ఎఱుఁగు ధాతువు కృదంత రూపము కాని యీ ఆరోపములలో నిది సూచితము కాలేదు. ఈ సంపుటమున నెచ్చటను నట్టి సూచనలు లేవు—ఈ నియమము పాటింప బడలేదు.

ఆరోపాలు — పరిమితి

ఇట్టి పదకోశాల్లో ఆరోపాలు సాధారణంగా రెండుమూడు పదాలకు మించకూడదు. సంపాదకు లీ విషయమై 'ఆరోప ప్రయోజనం స్పష్టమయ్యేట్టు సంగ్రహంగాను, అర్థవంతంగాను ఉండేట్టు చూచి ప్రయోగం కాపీ చెయ్యాలి' అని నిర్దేశించారు. కాని యీ నియమం పాటించినట్లు కానరాదు. చూడండి కొన్ని ఆరోపాలు.

అ ఆ

అంకిలి దేఱని డెందంబు కొందలంబు తోడి
అంచ తండంబు నడ బెడంగు.
అంపతాకు బలిత పుట డలున
అందఱు డెందంబుల యుమ్మలికంబులు.
అందలి యిందలి విలుకాండ్రకు—
అంప పొదిలోని బరిగోల యట్టులు—
అక్కొలువ తేకువ వారల లోనికి
ఆతని యరదంబు గుఱ్ఱంబులన్
ఆను పచ్చవిలుతు ననుఁగు టంప పొదిలోని బరిగోల
ఆణి గలుగు ముత్తియముల మ్రుగ్గ

ఇ ఈ

ఇంచువిల్తుని యల రమ్ముల బారికిన్
ఇందలి యందలి చేయం గల
ఇట్టుల మైన వెఱఁగు పాటున
ఇనుమడించు నెత్తురు మడువులన్
ఇరువది నాలుగువేలు మున్నూట యిరువండ్రు
ఇరువది మెఱుంగు వాలమ్ములు
ఇరువ దేను వెడఁద వాఁడి తూపుల
ఇరువ దొక్క తరము వారిన్
ఈతనితోడి కయ్యమునకు
ఈవినఁ జవిగాని పలుకులకు

ఉ ఊ

ఉండునట్టి యా మిక్కిలి నోము
ఉండునట్టి యొక్క తెఱువు
ఉన్న గద్దియ సగంబువన్
ఉన్న పనస పంటి చందంబునన్
ఉన్నయట్టి యుల్లంబులన్
ఉన్న వెలివాండ్రుర పల్లియ
ఉఱుకుతిండి కాఁడును బోలెన్
ఉవ్విళు లూరెడు నెమ్మనంబులు

ఎ ఏ

ఎంత బెట్టిదంబులైన యిడుములు
ఎక్కఁదగునట్టి యరదంబులు
ఎక్కించుకొనిన వాని మీఁదం
ఎక్కియున్న తమ యన్న వలను
ఎట్టి యెఱుక గల వారలున్
ఎట్టి యడి యాలంబులు
ఎత్తి చనుచుండియు మన్
ఎదిరి తేరి నొగయున్
ఎదురీఁదిన చాడ్పునన్
ఎదురుచూచు చున్నవాఁడు
ఎదురుచూచు చున్నంతన్
ఎదుళ్ల చూచుచున్నవారము
ఎనిమిది యడుగుల కోలఁదిని
ఎనుబదివేలు నాఱు.నూఱు
ఎరవళుల ప్రోవు కొండలన్
ఏఱఁగెడు కొదమ తుమ్మెదల పదువుల పగిది—
ఎఱుగంగ వలయు వాని—
ఎఱుఁగఁ జెప్ప వలవదు.
ఎఱుఁగకుండునట్టి తెఱంగు
ఎఱుఁగని యట్టివారలు
ఎఱుఁగని యట్లు గాఁగన్
ఎఱుఁగని యదియ పోలెన్
ఎఱుఁగని వారల పోలెన్
ఎట్టినైన కన్నుంగవతోడి నవ్వు
ఎట్టినైన క్రీగంటి చూడ్కి

ఎల దీగ కొనల వంకలు—
ఎలమావి జొంపంబుల చందంబు
ఎలయుఁ దేఁటుల మొత్తములు
ఎల వెడలిన యెలుంగులన్
ఎలుగించు గండు గోయిలల సొంపు
ఎవ్వని కడిమి సొంపునన్
ఎవ్వ రెవ్వరి పిండంబులు
ఎసగిన నడమామిడి చెలువున్
ఏడ్పుఁ గ్రందు టెలుంగులు
ఏడ్పు బెరయు నెలుంగుతోన్
ఏ తేర వలయు తడవు
ఏడు వెలిఁగిన తెలుఁగుగా
ఏనిక దోయియుం బోలెన్
ఏనుంగు పీనుంగు కడవ
ఏనుంగు పేరి నెపంబుగాన్
ఏనుంగుల గుబ్బంబుల పీనుంగుల మీఁద
ఏనుంగు దోయియుం బోలెన్
ఏను మెఱుఁగుఁ దూపులు
ఏ పొలమున నేవియు
ఏమి పనిచేయు వారొక్కొ
ఏమి యడి యాలంబుల తోన్
ఏఱు పఱుప రాక యుండ—
ఏసిన బెడిదపుటేటుల యలంత

ఐ

ఐన తెలుఁగు మాటలు
ఐన నీ యక్కటి కంపుఁ జూపు
ఐన ముయ్యంచుల తుంగల మోఁదులాట
ఐన మెఱుంగు చాడ్పునన్

ఒ

ఒంటి మెలంగు వెంగలిన్
ఒండరదము మీఁదికిం
ఒండొరుల యెడల కెలఁకుల బల్ నరములు
ఒండొరువుల లేఁ జెమటలన్
ఒందిన క్రొత్త సొంపునన్
ఒందిన నయ్యిరువుర కునుం
ఒందు నెఱ విదితమ్ములన్
ఒందు మొగిళుల గమియ
ఒక చాలు వారి బలు తీర్పున
ఒక దొడ్డ నారసంబు
ఒక సన్నపు టీకన
ఒక్క కత్తివాతి యమ్మున
ఒక్క చిఱుత యాఁ బెయ్య
ఒక్క దొడ్డ నారసంబున
ఒక్క పఱుపు గల పొద యూ అమి
ఒక్క పసిండి కత్తళంబు నందు
ఒక్క పొల్లపగతు చేతన్
ఒక్క ప్రక్క క్రిందునన్
ఒత్తెడు కెంపు సొంపుతో
ఒదవిన పవడంపుఁ బోడ
ఒదవెడు చిఱునవ్వు తోడన్
ఇంకనూ కలవు. కొన్ని మాత్రమే చూపితిని.

పై వన్నియు పదములు కావు పదబంధములు—తెనుగున సమాసరచన యుండదు గావున—తిక్కన-విశేషణ విశేష్యములను, క్రియాజన్య విశేషణముల నుప యోగించి — అర్థస్ఫురణ, రసస్ఫూర్తి కలిగించి, తత్సమ సమాసభూయిష్ఠమగు కావ్యములతో, సంస్కృతము విశేషముగా నుపయోగింపకయే సమాన ప్రతిపత్తి గడించి నాడు. పై ఆరోపము లన్నియు—ఆయా ఆరోపముల మొదటి పదముల క్రింద నుండ వలెను. ఇంతకు, నింతంత ఆరోపము లిచ్చుటవలన సాధించిన ప్రయోజనమంతగా గానరాదు, గ్రంథము పెరుగుదల తప్ప.

ఆ క ర ము లు

ప్రతి ఆరోపమునకు, ఎంతో శ్రద్ధతో, ఆకర ముల నిచ్చినారు. కాని—అని, అగు, అరదము మొద లగువానికి పుటలకొద్దీ ఆకరము లిచ్చినందువలన కూడ నీ గ్రంథ ప్రయోజనము కొంత పడ్డది—విభక్తి, రూపములు, క్రియా రూపములును—కూడ పూర్తిగా చూపినారు. ఇది భాషాశాస్త్ర సంప్రదాయాను

సారము జరిగినది. నిఘంటువులలో పదములు యథా మాత్రుకముగా చూపబడి—వివరణలో వ్యాకరణాది కార్యములవలన నేర్పడిన— రూపముల ప్రయోగము తీయబడును. కావున ననవసర గ్రంథవిస్తర ముండుట కవకాశము లేదు.

పైని వివరించిన అనవసర గ్రంథ బాహుళ్యమొక్క తిక్కన పదకోశముననే కాదు—సాహిత్య అకాడమీవా రింతకుముందు ప్రకటించిన నన్నయ, నన్నిచోడ శ్రీనాథ పదప్రయోగ కోశములకు వర్తించును.

ఈ పదకోశముల ఆరోపముల నిచ్చు విషయమున నీ క్రింది సూచనలను చేయుచున్నాను.

(1) త్రికములవిూది పదములను వేఱుగా చూపకుండుట.

(2) ఏ పదమునకైనను, ఆరోపము—రెండు మూడు పదములలో మాత్రమే నుండుట.

(3) రూప భేదమున్న వాని నా పదము క్రిందనే చూపుట.

(4) క్రియా రూపములను సంగ్రహించుట.

(5) హెచ్చుగా ఆరోపము లున్నప్పుడు — మొదట—ఆరోప మిచ్చి తరువాత – అకరములను మాత్రమే యిచ్చుట—ఉదాహరణము.

అతడు— వి. 1–75, 6–77, 8–100, వి. 1-185, 2—274, 4—116, 4-262, 5–102, 5-231, 5-309, ఉ. 1-108, 1-182, 1—211, ఉ. 2—7, 2—117, 2-168, 2-320, ఉ. 3-149, ఉ. 4—89.

అని. వి. 1—10, 1—44, 1—48, 1-62, 1-83. వి. 2-6, 2-14, 2-15, 2—20, 2—28, 2-44, 2—48, 2-69, 2-72, 2-77.

ఇట్లు—క—3-127, 3-245, 3-382, శ. 1—85, 1—225, 1-365, శ. 2-48, 2—121, 2—231, 2-328, 2. 377.

పై విధముగా నీ కోశము ముద్రితమైన ప్రస్తుత గ్రంథము 1119 పుటలలో సగము మాత్రమే—ఆక్రమించును. ఒకే సంపుటములో తిక్కన పదకోశము తయారగుటకు నవకాశము లభించును.

వైదిక నిఘంటువగు నిరుక్తమునకు పైరీతిని సంఖ్యా పద్ధతియే యనుసరణీయమైనది. ఈ సంఖ్యా వివరణమే యున్న తిక్కన భాషను గూర్చి సమగ్రముగా చర్చించుటకు తగిన యవకాశము గలుగును —తిక్కనకే కాదు. తక్కిన కవుల గ్రంథములకు పై ముద్రణ మవలంబించిన భాషా శాస్త్రాధ్యయనమున కత్యంతము తోడ్పడును.

ఆరోపములు—విమర్శ

ఈ కోశమున ఆరోపములనెంతో జాగరూకతతో సమకూర్చినారనుటలో నెంతమాత్రమును సందేహము లేదు. అయినను కొన్ని లోపములను చూపుట సమీక్షాకారుని కర్తవ్యము.

పుట 459. ఆఁబెయ్య' అయ్యేడకు నొక్క యాఁబెయ్య యుఱికి క. 2–90.

ఇదియే. ఒక్క క్రింద నిచ్చిన ఆరోపములో నిట్లున్నది.

ఒక్క చిఱుత యాఁబెయ్య యుఱికి
క 2-90.

ఆఁ బెయ్య క్రింద యిచ్చిన ఆరోపములో 'చిఱుత' లేదు. ఇక 'అయ్యేడకు'లో (పుట 395) క. 2— 90 యీ ఆరోపములో చిఱుత యీయ బడలేదు.

అన్నిపట్టుల నొక్క చిఱుత యాఁబెయ్య— అని యుండవలెను—

పుట 625. ఇవులకున్, ఇవులన్—ఉన్నవిగాని 'ఇవుల' ఆరోపము లేదు.

ఆ. వె. ఇవుల మూఁటికవల నవల యమ్మూటికి
నివల దేజరిల్లు దివిజ నగము
భీ. 1.21.

'ఆవల' ఆరోపములోనిది యిూయబడినది.
చూ. పుట 441.

పుట. 798 ఎత్తువచ్చు—లేదు.

విచార వివేకంబులనా కెత్తునత్తురే—
ఉ. 2-265.

అర్థమున కెత్తువచ్చు నయ్యధ్వరములు.
అ. 2.143.

పు. 914. ఏనిలో.

ఎట్టకేనిలోని, ఏని ఆరోపములు

వి 2.112. ఆ. 173 చూపబడలేదు.

పుట. 907. ఏతు. సంక్షోభింపఁగా
నేతుఁ గట్టలుకన్ వి. 2—281.

ఇచట క్రియ 'ఏతు' కాదు. అట్టి క్రియా రూపమే లేదు. ఉన్నది. 'నేతు' అను క్రియ. ఇది 'నేర్తు' అను దాని రూపాంతరము కాబట్టి పద చ్ఛేదము సరికాదు. ఇది నకారాది. 'ఏతు' అను క్రియకు ప్రయోగములు లేవు.

'సేతున్' అను క్రియనే తిక్కన యుపయోగించినట్లు పద్యము తెల్పు చున్నది. నాట్యమండప ములో ద్రౌపదితో భీముడు చెప్పుమాటలు.

మ. ....నిన్నరసి నీ చందంబు గాకున్నినా
కులతం బొందెకు నవ్వు మండపము
సంక్షోభింపఁగా నేతుఁగ
ట్టలుకన్ బెబ్బులి గ్రోలవేసినటు లు
గ్రాకార మేపారఁగన్—

'కీచకుడు—నీవు కాకపోయినపు డాకులత జెందును. ఆ సమయమున నేను నాట్యమండపాన్ని కదల్చి, కలతపడునట్లు చేయనేర్తును; చేయగలను' అని భీముని వాక్యము.

చేయనేర్తున్ 'అన్నదానివలె' ఆడనేర్తున్ అన్న క్రియను 'నేర్తున్—నేతున్' అని తిక్కనయే వేఱొకచో ప్రయోగించియున్నాడు.

క. ద్యూత క్రీడకు కొండొక నేతున్
1–196.

అప్పకవి రేఫ సంశ్లిష్ట లోప ప్రాస కింద దీని నుదాహరించి నాడు. (2—243) ఇందువలన తిక్కన యుపయోగించినది. 'సేతున్ కాని ఏతున్' కాదు.

అర్ధానుస్వారము

పుట 110 అఁట—అట—ఈ ఆరోపము లలో తొమ్మిదింటిలో 'అఁట' అని అరసున్నలున్నవి. ఇది 'అంట' అను శబ్దమునకు రూపాంతరము—కాని 'పొదవితఁట 'వెఱచునఁట' అను వానియందు అనగా వృత్తాంతాదికములుతెలుపునపు డుపయోగించు పదము—'అఁట'యందు అరసున్న లేదు నన్నయ భాషలోనిట్టి రూపమే లేదు. అన్ని చోట్లను అట్టె. అటె అను రూపములే కనబడు చున్నది. శివకవుల కృతులలో అట్టె—అటె' రూపములే గలవు అఁట అను అర్ధానుస్వార ఘటిత రూపము లేదు. దీనినిబట్టి అరసున్నగల 'అఁట' శబ్దము ప్రాచీనముగాదు.

'అఁటకు' పూర్వరూపమైన అంట — శ్రీనాథుని కాలమునుండి ప్రయుక్తమైనది.

ధాతవఁట నీవు మేము సంధాతలమఁట
గారవపుఁ బెండ్లి కూతురు గౌరియంట
హర. 4—65.

ఇందువలన-అఁట' అను రూపము తిక్కనలో లేదు. అట, అను నిర్బిందు రూపము మాత్రమే గలదు

ఇట్టిదే 'ఇఁక' అనునది. పుట 542 లో ఇఁక క్రింద పది ఆరోపము లున్నవి. అన్నింటి యందర సున్న లున్నవి. కాని ఇఁకలో అరసున్న లేదు. ఇంక—అను దాని రూపాంతరము (ఇంక—ఇంగ ఇన్గ - ఇగ)—ఇగకాని, ఇఁకకాదు—

ద్వి. సంసారివేఁటికి సరిచేసికొంటి
విగ మెడ దునిమెద విదియేమి పుట్టె
జగములలో రిత్తనఁ వచ్చె నీకు
బసవ పురాణము. 5. ఆ 90 పంక్తి.

పుట. 450 ఆఁక. అందఱు వింజంబాఁ
కిడిన కరణిన్ ఉ. 3 255.

అజ్ఞాశబ్ద భవము—ఆఁక—కావున—ఆఁకలో అరసున్న యున్నది. ఈ పద్యమున—'వింజమాఁ కిడిన కరణి' అనగా 'వింధ్యపర్వతమున కాజ్ఞపెట్టి నట్టుగా నున్నది' అని యర్థము చేసికొని, భారత పరిష్కర్తలిందు అరసున్నయుంచినారు[10] — కాని వారొక విషయ మిా సందర్భమున గమనింపలేదు— పద్యమిది.

క. ఆ కొలువువారు గర మచ
లాకృతి నొక పలుకు లేక యందఱు వింజం
బాఁకిడిన కరణి నవశము
దా కారిత చిత్తవృత్తులై యుండంగన్

ఇందు మూడు పాదములలో నిర్బిందుక ప్రాస మును ఒక్కపాదములో— సబిందుక ప్రాసము గలదు. ఇది తిక్కన కవితా సరణికి విరుద్ధము. తిక్కన యెక్కడను సబిందుక నిర్బిందుక 'ప్రాస' (ఖండా ఖండప్రాస మని—అప్పకవి) ఉపయోగింపలేదు. తిక్కనయే గాదు, భారత కవిత్రయము వారెవ్వరును ఖండా ఖండ ప్రాస నుపయోగింప లేదు—అప్పకవీయము మూలమున, భారతకవిత్రయమున, ఖండాఖండ ప్రాసగలదను నపోహ దేశమందు వ్యాప్తమై, ఛందో విమర్శకుల నపమార్గమున పట్టించినది.

తిక్కన భారత కవులను, నన్నయ, ఎఱ్ఱనలను విడిచి, తిక్కనలో—ఖండాఖండ ప్రాసము గలదని—అప్ప కవి నిరూపించిన వానిని, చూపి, అట్టిది తిక్కనలో లేదని ఖండించు చున్నాను.

ఖండాఖండ ప్రాసములు

(1) విరాటపర్వమునందు:

క. నా కొలఁతఁ దీర్చి వచ్చితి
నీ కొలఁతయ యింక సూతునిం దెగఁజూడన్
లోకము వంచింపగ నగు
చీఁకటి రే యొదవె నేమి సేయుదొ
చెపుమా. 2—271.

చీఁకటిలో అరసున్న యున్నదని అప్పకవి దీనిని ఖండాఖండ ప్రాసకు లక్ష్యముగా నిచ్చినాడు. కాని చీకటిలో అరసున్న లేదు— చూడు క్రింది ప్రయోగములు—

క. లోకాలోకము లోఁగల
చీకటి..........
ఆకాశమడరి......మగి
హాకాళియు బోలె—కు. సం. 2—64
(కుమార సంభవము)

ఉ. మిా కృపఁగోరి భూరుహ
జీకొని కావు
జీకటి రాత్రి......భ
ల్లూక పరీత...........

ద. శ. 9—4
దశకుమార చరిత్ర.

పై ప్రయోగము లలో—చీకటి అర్ధానుస్వారము లేని సంస్కృత శబ్దములతో ప్రాసలో నున్నది. ఈ రెండు నిర్బిందుక ప్రయోగములును, తిక్కనకు పూర్వములే ప్రాసలో సార్థబిందు, నిర్బిందు శబ్ద నిర్ధారణకు నన్నెచోడ, కేతన కవులు ప్రామాణికులు. వారికృతులలో చీకటిలో అరసున్న లేదు. తిక్కనయే, మఱి యెచ్చటను ప్రాస సాంకర్యము చేయనే లేదు.

కాన తిక్కన విరాటపర్వము నందున్న

క. లోకము వంచింపను దగు
చీకటి రే యొదవె యేమి చేసెదొ చెపుమా.

అన్న పద్యమున ఖండాఖండ ప్రాస లేదని నిశ్చితము.

తిక్కన యింతకుముందు నిర్వచనోత్తర రామా యణమున—నీ చీకటి శబ్దమును నిర్బిందుకము గానే ప్రయోగించినాడు.

క. చీకటి గలిసిన విబుధా
నీ కరబోడి చన నైన నీరద హృదయ

10. 'సంశోధిత మహాభారత ముద్రణము — ఉద్యోగపర్వము పుట 535 లో నీ 'ఆఁక' శబ్దమర సున్నతో నున్నదిగాని సరికాదు.

వ్యాకులత మునింగి, భయో
ద్రేకము వడి.........6—107.11

(2) మూాకలు విరియించి, వీఁక నాచార్యాది
యోధుల నెల్లను నొక్క దెసను.
ద్రో. 2.136.

మూఁక శబ్దము సార్ధానుస్వారము—మూఁక శబ్దమునకు నన్నయ ప్రయోగమే కలదు.

క. వీఁక బఱతెంచి... .....
దాఁకిన.........శరహతి న
మ్మూంకలు విరియఁ గ
డాఁ కరమున— ఆది. 8—20.

ఇంకను భాస్కర రామాయణ భోజరాజీయ ప్రయోగములు గలవు. మూఁక శబ్దము సార్ధానుస్వారము గాన—అప్పకవి లక్ష్యము సరికాదు. తిక్కన 'మూఁక' శబ్దము సార్ధానుస్వారముగనే యున్నది.[12]

3. క. మిాటు గతి రథికులను నొక
నాఁటికి వేవుర వధింతు నరు శరములు నో
నాఁటి పడవైచు నంతకు
వేఁటాడెద ప్రతిబలంబు వీరుల నెల్లన్.
ఉద్యో. 4—407.

అప్పకవి, మిాటు శబ్దము నిర్బిందుకమని యూ లక్ష్యము నిచ్చినాడు కాని సరికాదు—మిాటు శబ్దములో నరసున్న యున్నది. కన్నడమున—మాంటు—ఈ మిాటు శబ్దము సార్ధానుస్వారమని చిన్నయ సూరి[13]—ఇందువలన—తిక్కన, సార్ధబిందుక నిర్బిందుక ప్రాస సాంకర్యము చేయలేదు.[14]

'ప్రస్తుతము వింజంబాఁ కిడిన—' అను దానిలో 'ఆ కిడిన' అనునది సరియైన రూపము—ఆకు + ఇడిన - అని పద చ్ఛేదము—ఆమ్—అనగా అజ్ఞాపత్రము—యిచ్చినట్లు—మాటాడకుండ నుండుట యని యర్థము. ఆమ్ శబ్దమునకు ఆజ్ఞాపత్రము అన్న అర్థమున్నందుకు ప్రయోగము.

సీ. పా. చావులేకుండ నాజముచేత నాకు దె
చ్చిన వారు గలరె యూ సృష్టియందు.
భోజరా. 4—45.

(భోజరాజీయము)

ఆమ్‌శబ్దము నిర్బిందుకము — కన్నడమున— నిర్బిందుకము.

ఎ సఁ గు

ఈ శబ్దమునకు 6 పుటలు (80—85) ఆరోపములు గలవు. అన్నిటియందు అరసున్న గలదు. కాని 'ఎసఁగు' అను రూపము నిర్ధారణచేయు ప్రయోగ మొకటియును నందు లేదు. వచనములలో 'ఎసంగు' అను రూపమున్నంత మాత్రమున నది ఎస గులో అర్థానుస్వారము గలదని నిరూపింపదు. తిక్కనలో కాకపోయినను నితర కవి ప్రయోగములందైన ఎసంగు, అనురూపము నిర్ధారకముగా గాన రాలేదు. కాబట్టి యిది నిర్బిందుకముగా గ్రహింపవలెను. దీని వివరణము.

ఎసఁగునకు, 'ఎసవు' అను రూపాంతరము గలదు. సాధారణముగా, అనుస్వార ఘటిత గకార శబ్దములు వకారములు కావు. అప్పకవి, 'క్వచిద్గకారోవః' అను సూత్ర వివరణ సందర్భమున నిట్లు చెప్పినాడు.

గీ. అఁగె, లోఁగెను, వీఁగెను, డాఁగె, నేఁగె
వాఁగె నను నివి మొదలగు వాక్యములను

11. శబ్దరత్నాకరము. సవరణలు: వివరణలు. పుట 839. నిర్వచనోత్తర రామాయణమున—భాషా విశేషములు గాని యతిప్రాస విషయములను గూర్చి గాని యింతవఱకు వ్యాసంగము జరుగలేదు. ఈ పద కోశమందుకు దోహదము నొనరించును.

12. సూ. ని. శబ్దరత్నాకరములం దిట్లే సార్ధానుస్వారముగా నున్నది.

13. సూ. ని. 5 వ సంపుటము. పు. 337.

14. అప్పకవీయ భావప్రకాశికలో నీ విషయములే చర్చింపబడలేదు.

బొదలు నక్షరముల చిన్నబొల్లు పై గ
కారములు గాని యనునాసికములు గావు—
(2–116)

ఇచట—అర్థబిందువున్నను నివి, శబ్దగత 'గ' కారములుగాని సరళములుగావు—ఇవి 'వ'గా మారవు—అనగా ఆ వెను, లోవెను, పీవెను, అను రూపాంతరములు పొందవు. అను నాసికములు లేని 'గ' కారము. 'వ'కారనుగును అని యర్థము.

ఇందువలన—ఎసగు శబ్దములో నర్థబిందు వున్న ఎసవు అనురూపము రాదు— 'ఎసఁగు' అని నిర్బిందుకముగా నున్న నే-'ఎసవు' అను రూపము వచ్చును.

పాల్కురికి సోమనాథుడు, ఎసవు రూపమును పండితారాధ్య చరిత్రలో నిట్లు నిర్ధారకముగా వాడి యున్నాడు.

'ద్వి. భువి శివనిర్మాల్య భూతి యనఁగ 'నె
సవి' సుధాకర కరాసార ప్రసార'
దీక్షా ప్ర. 75 పుట.

ఇచట 'వి' ప్రాసలో నున్నది.

తిక్కన ప్రాసలో నీ ఎసఁగు శబ్దము ప్రాసలో నొక పట్టున ప్రయోగించినాడు.

క. బిగు వెడలక నిలిచి పడున్
నగములు వేత సచయంబు న్రమంబై పె
ల్లగు మావేగము గడిపి యె
సఁగు పూర్వస్థితిన బ్రదుకు సమకూరంగన్
శాంతి. 3—88.

ఈ పద్యమున సార్ధబిందు నిర్బిందుక ప్రాసము గలదు. ఇట్టి ప్రాస తిక్కనలో లేదని యువాళకు తెలిపితిని.

పై పద్యములోని 'ఎసఁగు' ఆరోపము 884 పుటలో నున్నది.

'ఎసఁగు: మా వేగము గడిపి
యెసఁగుఁ బూర్వ స్థితిన'

కాని, ముద్రిత ప్రతిలో దీనికి పాఠ భేద మున్నది.

పెల్లగు మా వేగము గడపి యె
సగొనుఁ బురాస్థితిన బ్రదుకు సమకూరంగన్
(శాంతి. 3—88)

ఇచట పదము, ఎసగొను—

ఈ పదకోశమున నితరారోపములలో పాఠ భేదము ఉన్నచో చుక్క గుఱుతుతో చూపబడినవి—గాని యీ 'ఎసగు' ఆరోపము వద్ద అట్టి గుఱుతు లేదు. కావున నిచట పాఠ భేదము నుదాహరింప లేదనుట స్పష్టము.

పాఠ భేద ముండుటచే నిచట 'ఎసఁగు' శబ్దము లేదు. తిక్కన ఖండాఖండ ప్రాస చేయలేదు.

ఎసగు శబ్దములో నరసున్నలేదని వేఱొక ప్రయోగము చూపుచున్నాను.

రాఘవపాండవీయమున

'ఒప్పెసగ రూఢాసక్తి' 1–26 లో ఎసగ శబ్దము గలదు. ఇచట రామాయణార్థమున ఒప్పె + సగ రూఢాసక్తి—సగరుడు పుట్టుటకాసక్తి. అని భారతార్థమున ఒప్పెసగ—రూఢాసక్తి అని పదచ్ఛేదము సగర శబ్దము సంస్కృత శబ్దముగాన అందర సున్న ప్రసక్తి లేదు—[15]

శకటరేఫ ఎరఁగి—ఎఱఁగి

ఈ శబ్దమునకు నమస్కరించుట యని యర్థము. ఈ గ్రంథమున మూడు పుటలలో పై శబ్దమునకు సాధురేఫతో శకటరేఫలతో రూపములు చూపబడినవి. ఈ రూపములను గూర్చి యిట్లుగలదు.[16]

ఎఱఁగి—ఎరఁగి (—ఱ—కారరూపం ప్రాచీనం కాని తిక్కన కాలానికి సాధుశకట రూపాల భేదం

---

15. ఎసగు—పొసగు. శ్రీ తి. రామచంద్ర గారి వ్యాసము 1935 ఫిబ్రవరి.

16. గ్రంథపరిచయం — శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి.

పోయిందనడానికి ఇవి తార్కాణం. (ప్రాసస్థానాల్లోను ఈ తేడా కనిపిస్తుంది.)'

'ఎఱఁగు' ఎరఁగు శబ్దములలో — అకార రూపము ప్రాచీనమగుట సరియైనదే—కాని తిక్కన కాలమునకు—ద్వైరూప్యములున్నవన్న మాట సరికాదు. క్రీ. శ. 18 వ శతాబ్దమువఱకు లాక్షణికులందఱును, 'ఎఱఁగు' శబ్దములో—'ఱ' కారమున్నదని తెలిపిరి గాని—సాధురేఫ రూపమున్నట్లెవ్వరును తెలుపలేదు కాబట్టి యీ శబ్దమున మొదటి నుండియు శకటరేఫయే గలదు.

'ఎరఁగు' అను రూపము నన్నయలోనే గలదు గనుక నా కాలమునందే 'ఎఱఁగు'నకు 'ఎరఁగు' అను రూపద్వయ మేర్పడినది యని చెప్పుచు కొందఱు భాషావేత్తలు నన్నయ ఎరఁగు ప్రయోగము నీ క్రిందిదానిని చూపిరి.

సూ. ని. మొదటి సంపుటము 497 వ పుటలో నిట్లు గలదు.

ఎరఁగు=ఎఱఁగు— నమస్కరించు

ఆ. వె. ఎట్టిరాజులను మహీసురోత్తము లెదు
రరుగు దెంచునప్పు డధిక భక్తి
నెరఁగి ప్రియము పలికి, తెరువిత్తురు
భార. ఆది. 7.111.

ముద్రిత ప్రతియందు 'ఎరఁగు'నకు, 'తెరలి' అను పాఠాంతరము గలదు. దీనివలన, నన్నయ నిశ్చయముగా ప్రాసలో 'ఎరఁగు' అను పదము ప్రయోగించెనని చెప్పుటకు వలను పడదు. నన్నయ 'ఎరఁగు' అని పదమే ప్రయోగింపలేదని, ఆ పద్యము సంస్కృత మూలమునుబట్టి తెలియగలదు.

ఆపగచ్ఛ పథోఽస్మాక
మిత్యేనం పార్థివోఽబ్రవీత్
తదా 'ఋషి'రువా చైనం
సాంత్వయన్ శ్లక్ష్ణయా గిరా
మమ పంథా మహారాజ
ధర్మఏష సనాతనః
రాజ్ఞా సర్వేషు ధర్మేషు
దేయం పంథా ద్విజాతయే.
(ఆదిపర్వము 176 అ. 6, 7 శ్లోకములు.)

'రాజులు మార్గమున వెడలుచున్నప్పుడు — విప్రులకు తెరువిచ్చి, తొలగవలయును' అని దీని తాత్పర్యము. మూలములో, 'దేయం పంథా' అని స్పష్టముగా నుండుటచే—వారికి దారి నీయవలెననియే యర్థము గాని—నమస్కరించు అను నర్థము కాదు. కావున—అచట—'తెరలి'వారికి 'తెరువీయవలెనని'యే పాఠ ముండవలయును. ఇంతకు మార్గ మధ్యమున నమస్కరించుట యెట్లు పొసగును? ఇంతకన్న వివరముగా నీ సందర్భమున తిక్కన, మారన లిట్లు చెప్పినారు.

తిక్కన—సీ. పా. విప్రగోక్షత్రియ వృద్ధ దుర్బల భార
వహ గర్భిణులకు నీవలయు తెరవు
అను. 4—103.

మారన—తెరువిచ్చి తొలఁగవలయును
పురుషుడు విప్రునకు— మార్క. 3—233.

పై యుదాహృతులను బట్టి—నన్నయ 'తెరలి' అను పదమునే ప్రయోగించినాడు గాని, 'ఎరఁగు' అను పదమును ప్రయోగింపలేదని తెలియుగలదు.

రెండవది. ఇచట 'ఎరఁగి' అను పాఠమున్న యెడల నది నన్నయ కవితా నియమములకే విరుద్ధముగా నున్నది. నన్నయ సీసముల యందువలె, గీతముల యందు యతిప్రాసలను పాటించి యున్నాడు. ప్రస్తుతమీ ఆటవెలది సర్వయతి నియమముగలది—అనగా నాలుగు పాదములయందును యతులే యుండవలెను కాని యీ 'ఎరఁగి' పాఠమున నా నియమము తప్పినది - చూడుడు.

1. పా—యతి— ఆవె - ఎట్టి రాజులను మహీ
సురోత్తము లేదు
2.— యతి రరుగు దెంచునప్పు డధిక భక్తి
3 — ప్రాసయతి (నెరఁగి) ప్రియము పలికి—
తెరువిత్తు రట్టిద

4. యతి ధర్మవీపు వీనిఁ దలఁప వెట్లు.

నన్నయ గీతములలో (ఆటవెలది — తేట గీతము) నేదే నొక నియమ ముండును. రెండు పాదములకు యతులు; రెండు పాదములకు ప్రాసలుండును. లేదా గీత పద్యమంతయు యతి నియమముతోగాని, ప్రాసనియతతోగాని యుండును. పై గీత సర్వయతి నియమముగఁది. అనగా అన్నిపాదములలోను యతియే యుండవలెను. కాని పై పద్యమున 'ఎరఁగి' అన్న పాఠము వలన—పై పద్యమున నన్నయ నియమము భంగమైనది.

'తెరలి ప్రియము పఠికి తెర ఎత్తు రట్టిద' అనునది-సరియైన పాఠము-ఇందు యతియే యుండుటచే నన్నయ నియమములకు సరిపోయినది. నన్నయ సాధురేఫముగా 'ఎరఁగు' శబ్దము నుపయోగింపలేదని సిద్ధాంతము.17

ఎ ర ఁ గి

ఇక, ఈ పదకోశకర్త లిచ్చిన యారోపములను పరిశీలింతము.

నిర్వచనోత్తర రామాయణము

1. ఎరఁగి...నెదుర.. ... 2-45 యతి
2. ఎదురు వోయి నెరఁగి 3—88 ,,
3. పదయుగళంబున కెరగి 3—104 పాద మధ్యము
4. ఎరఁగి...సహింపవలయు 10—145 యతి
5. ఎదురువోయి వెరఁగుటయును 9—47 యతి

నిర్వచనోత్తర రామాయణమున 'ఎరఁగు' శబ్దమెచ్చటను ప్రాసస్థానమున లేదు—కావున 'ఎరఁగు' శబ్దము తిక్కన వాడలేదు. ఇక భారతమునగల ఆరోపములను పరిశీలింతము.

భీష్మ పర్వము—3—293. అమ్మహాత్మునకు
భక్తి నెరఁగి తెల్లంబుగ

ఇది వచనము—

కర్ణ పర్వము—3—256. అప్పుడు కపి యెరఁగి
హస్తి కక్ష్యపై నిలిచిన—

ఇది వచనము—

తక్కిన ఆరోపములు

ఎరఁగిన తేఁటి—దివుటమై నెరఁగిన తేటి యనఁగ
వి. 6—42.

ఇది సీసపద్యపాదము రెండవ దళము పాద మధ్యము.

ఎరఁగిన యప్పుడు—మహి కెరఁగిన యప్పుడొప్పి.
ద్రో. 1—161.

ఇది కంద పద్యమున రెండవ పాదము పాద మధ్యము.

ఎరఁగు సింగము పోలె—మృగంబుపై కెరఁగు సింగము
పోలె గిట్టి శ. 1—379.

ఇది చంపకమాల—పాద మధ్యము.

పై యారోపము లన్నింటియందును 'ఎరఁగు' శబ్దము సాధురేఫ ప్రాసగతముగా లేదు. 'ర'కారము—యతిస్థానమున లేదు. అందువలన తిక్కన కాలమునకు, 'ఎరఁగు' రూపము లేదనియే నిశ్చితము.

పుట 897

ఏఁడీ అతఁడేఁడీ డాగిపోయె నొకొ
ద్రో 1—374.

ఇచట రూపము 'ఏఁడీ' కాదు. వకారాది వేఁడీ యనునది.

కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణ సారసంగ్రహమున—నిట్లే లక్షణము చెప్పి — ద్రోణ పర్వము నుండి పై లక్ష్యము నిట్లిచ్చినాడు.

ల క్ష్య ము

క. వాశెము కృతులం జెల్లును
వేశము వైళంబనంగ వేఁడీ యేఁడీ
వీూలన వీూను లనంగా
జాలంధర ముని నిశాట సంహారణ శివా.

---

17. సంశోధిత మహాభారత ముద్రణమున—'తెరలి' అనే పాఠముండి నన్నయ కవితా నియమములకు సరిగా నున్నది.

వేఁ డి

క. ఓడితిమె యేము రణమునఁ
గ్రీడికిఁ గ్రీడించి రాక గెలుపే యని వేఁ
డీ డాగెనాకో మా
తోడి బవరమిట్లు వాఁడు తొలఁగఁగ జేసెన్
2—325—328.

ఇందువలన—'వేఁడీ' అను శబ్దమే—తిక్కన యుపయోగించినది.

వేఁడి— అనుటకు నిర్ధారక ప్రయోగము

గీ. ... .కపి వీరసేనల గాంచి,
వీరిలో ముఖ్యు లెవ్వారు వేఁడు రాముఁ
డతని యనుజన్ముఁ డెట్టివాఁడనుచుఁ బలుక
రామా. 3–192.

'వేఁడి'కి బహువచనము—వేరి—

తిక్కన కవితారీతి

ఎఱ్ఱన, హరివంశములో తిక్కనను స్తుతించిన యీ పద్యమాంధ్ర సాహితీలోక మెఱిగినదే.

మ. తను కావించిన సృష్టి తక్కొరుల
చేతం గాదు నా, నే ముఖం
బునఁ దా బల్కిన బల్కు లాగ
మములై పొల్పొందు నా, వాణి స
త్తను నీతం డొకరుండు నాఁ
జనుమహాత్వప్తిం గవి బ్రహ్మ నా
వినుతింతుం గవి తిక్కయజ్వ నిఖిలో
ర్వీ దేవతాభ్యర్చితున్ (1–9)

కాని యింతవఱకు—'తిక్కన కావించిన సృష్టి' 'ఇది' అని విమర్శకులు నిరూపించినట్లు కానరాదు. తిక్కన కవితను నెఱ్ఱన గ్రహించినట్లుగా నితర కవులు గ్రహింప లేదు. తత్సమ పదభూయిష్ఠమగు నన్నయ కవిత్వమును, దేశిపద బహుళమగు శివకవుల కవిత్వమును రెండింటిని సమన్వయించి, తిక్కన—సాహిత్య కవితా ప్రపంచమున—'తెనుగుసృష్టి' చేసినాడు—ఇట్టి సృష్టి నాటికి నేటికి లోకోత్తరమై తిక్కన కవి బ్రహ్మత్వము సార్థకము చేసినది.

సంస్కృత భాషా మూలముననే ఉత్తమ సాహిత్య స్థాయిని కావ్యరచన తెలుగున సంభవమన్న నన్న యార్యుని పథకమునకు ప్రతిగా, శివకవులలో సోమ నాథుడు చాటిన

'అల్పాక్షరముల ననల్పార్థ రచన
కల్పించుటయె కాదె కవి వివేకంబు'

అన్నసూక్తిని ప్రత్యక్షరము పాటించి — ఎంతవఱకు సంస్కృతము వాడవలెనో, అంతవఱకే వాడి—తెనుగు కవితలో నొక క్రొత్త సృష్టిచేసిన వాడు తిక్కన.

తిక్కనయందు తెనుగుజాతి, తెనుగుభాష తెనుగుదనము మూర్తీభవించినవి.

తిక్కనయే చెప్పినట్లుగా, ఆతడు వాడిన వన్నియు అలఁతి అలఁతి తెలుగు పదములు—కాని వానిలో వలఁతి యర్థమున్నది. అవి తెలుగువారి మనో భావములను సూటిగా, చాటుతనముతో తెలివి పఱచునవి.

ఈ సందర్భమున, తిక్కన కవితా శిల్పమును గూర్చి—డాక్టరు భద్రిరాజు కృష్ణమూర్తిగారు, గ్రంథ పరిచయంలో వ్రాసిన వాక్యాలు-ఆంధ్ర సాహిత్య విమర్శకుల కందఱకు నత్యంత ముపాదేయములు.

'పలుకుల పొందు, పాతబడ్డ మాటలతోనైనా కొత్త పదబంధాలని సృష్టించటం సంస్కృతంలోనే చెప్పటానికి సాధ్యమౌతాయనిపించే ఉదాత్త భావాలను గూడా అలఁతి, యలఁతి మాటలతో కాహల సంధించి నటు చెప్పటం తిక్కనగారి కవితా శిల్పం—(Conxcious Craftmanship) లో ముఖ్య ప్రక్రియలు తిక్కన పదాల కూర్పులో తెలుగువారు కొత్త మాటలు సృష్టించుకొనే తీరుతెన్నులు ప్రతిబింబిస్తాయి.

....

పొడిమాటలు అంకెల లాంటివి; పదబంధాలు సంఖ్యల లాంటివి. అంకెలను స్థానాలను బట్టి వాటి

విలువలను, కలిపే తీరును మనము గుర్తుంచుకో వాలి గాని సంఖ్యలను గుర్తుపెట్టుకో నక్కరలేదు...

మాట లెప్పుడూ పాతవే. మాటలను ఏ కవి క్రొత్తగా సృష్టించలేదు...పాతవడ్డ మాటలతో, తన 'నేర్పు చూపి' 'ఇంపారెడు పల్కుల నేర్చుకొని, 'నేరు పరి సరి గుచ్చునట్లు—క్రొత్త సమాసాలు కూర్చి తెలుగులో ఉన్న సృజనాత్మక శక్తిని ప్రదర్శించాడు.'
పుట 5.

తెలుగు భాషా శాస్త్రమును సంపూర్ణముగా నాకళించుకొన్నవారికి గాని పై రీతిని తిక్కన కవి తను గూర్చి చెప్పుటకు తక్కినవారికి సాధ్యము కాదు.

తిక్కన కవితయందలి తెనుగు సృష్టిని—గూర్చి, కూలంకషముగా, తెలుగు విద్వాంసులు వ్యాసంగము చేయుదురు గాత—అట్టి వ్యాసంగమున కీ కోశము మిక్కిలి తోడ్పడ గలదు.

ము ద్ర ణ ము

ఇంత మహాగ్రంథము నిన్నివేల రోజులతో ముద్రణ దోషములు లేకుండ ముద్రించినందులకు మరమభినందించవలసి యున్నది.

భా ష

'ముందు మాట'లోను, గ్రంథ పరిచయం లోను ఉపయుక్తమైన భాష. తిక్కన పదకోశము వంటి ఉత్తమ సాహిత్య గ్రంథమున కుచితముగ నుండలేదని చెప్పుటకు చింతిలు చున్నాను

1. సంపాదకవర్గం—గ్రంథపరిచయం—ఉద్దేశం, కారణం, ఇట్లు తెలుగులో వ్రాయుట సరికాదు. తెలుగున పదాంతమందు బిందువు నిలువదని యీ వరకే నిరూపించినాను. ఇట్టిది తెలుగు భాషా సంప్రదాయానికి విరుద్ధము.

2. వ్రాయు అను క్రియకు – 'అట్లానే రాయాలి' 'రాయింపారు' 'రాసిన వాటిని' 'రాయించే వని' 'రాయించటానికి' అని వ్రాయుట. ఈ కోశమునకు మచ్చవలె నున్నది.

వ్యావహారిక భాషలో, పదాదిని సంయుక్తాక్షరము పలుకలేరు కాబటి 'వ్రాయుటకు' 'రాయటము' రాయడం మొదలగు రూపములు వచ్చుట భాషా పరిణామమే. అయితే అట్టి వ్యావహారిక రూపాలను సందర్భానుసారంగా కవులు ప్రయోగించి, వానికి కావ్యభాషలో స్థానము కల్పించినారు. కాని వ్రాయుటకు 'రాయటము 'రాయించు మొదలగు వానిని నిర్ధారకముగా యతిస్థానములోనున్న ప్రయోగములే లేవు.

అట్టి ప్రయోగము లుండుటకు భాషాతత్త్వము ననుసరించి ఆస్కారమే లేదు—వ్రాయు, అనునది 'వరై' అను ద్రవిడ ధాతువునుండి వచ్చినది. వరై. వ్రా. అంకనసి. కన్నడమున దీనికి సాజాత్యరూపము బరి. ఇప్పటికి తెలుగులో 'నీ కైదు బర్లు 'వచ్చునా' అని, అడిగే ప్రశ్నలో—బరి శబ్దము కనబడును—యతి ప్రాస స్థానములు శబ్దస్వరూప నిర్ణయమునకు ప్రధాన సాధనములు కాబట్టి 'వ్రా' తో యతి స్థానమున నున్న వానిని కొన్ని నిరూపించు చున్నాను—

వర్గంబుకవి లియ వ్రాయుంచి—పండి. 2 546 పుట.
వాన పఱులు నీటివ్రాతలు ,, 2 418 ,,
వ్రాయనేర్చిన నాడె సద్వర్ణ సమితి-వి క1.49 ,,
వనిత కుచద్వయంబుపై వ్రాసిన--పా ర 1.43 ,,
వ్రాయంగా రాని పలుకులు పలికె నపుడు
చిత్రభా. 3 30

ఇంక చాటువులలో సైతము 'వ్రా'కే
యతులు

వ్రాయక కరణముల్ వ్రాయుచుంద్రు
చాటుపద్య మణిమంజరి—పుట. 23.
వ్రాయుట చిత్రమా? వికృత వైదికమా ,, 63.
వ్రాయరె యెల్ల లోకముల వారలు ,, 90.
ఇక ప్రాసలో చూడుడు.

క. ఏ వ్రాలైనను వ్రాయుదు
నా వ్రాయం వ్రాసెనేని నవ్వుచునైనన్

'శ్రీ' వ్రాసి తా వ డియ్యఁడు
భావజ్ఞుఁడు రాయనార్య భాస్కరు దెపుడున్.
పుట. 77.

తెనాలిరామకృష్ణకవి పాండురంగమహాత్మ్యమున వ్రాయస ప్రవృత్తి (1–34) అని ప్రయోగించి నాడు. దీనిని 'రాయస ప్రవృత్తి' అని మార్చినారు. కాని అట్లు మార్చుట సరికాదు. 'రాయసము' వారు అను ఇంటి పేరుగల వారుండవచ్చును. కాని వ్రాయసమును, రాయసముగా నిర్వహించి యతిస్థాన ప్రయోగము లేదు. కాబట్టి వ్రాయుటకు 'రాయు' అనుట యెంతమాత్రమును సరికాదు.

ఉదాహరణమునకు మాత్రమే యివి చూపితిని.

గ్రంథ పరిచయమున, విమర్శింపవలసిన భాషా విషయము లనేకము లున్నను గ్రంథవిస్తర భీతిచే విరమించు చున్నాను.

తెలుగు భాషా విషయమున నీనాడు—

(1) సాంప్రదాయిక దృష్టి.

(2) భాషాశాస్త్ర దృష్టి.

అను రెండును—ప్రచారములో నున్నవి. ఈనాడవి వేఱ్వేఱుగా నున్నవి. ఈ రెంటిని సమన్వయము చేసిన నాడే, మనకు తెలుగుభాష సమగ్ర స్వరూపము వెల్లడి యగును.

అట్టి సమన్వయమునకు మార్గము చూపిన, ఈ తిక్కన పదకోశమును సంధానించిన సంపాదక వర్గమువారిని మఱియొక పర్యాయము నభినందించు చున్నాను.

ఇట్టి కోశములను ప్రకటించుచున్న ఆంధ్ర ప్రదేశ సాహిత్య అకాడమీవారు అభినందనీయులు.



బ్రతకాలి

69) అద్దేపల్లి రత్నాజీరావు

జీవించాలి మనము మన కోసం
త్యాగం చేయాలి నీరసం
ఈ రోజుల్లో కరువు రోజుల్లో
పరల బ్రతకాలి వేటికోసం

మత్తుపదార్థాలు సేవించటం కాదు.
లేక మాటలెత్తి పాడవటం కాదు
బట లిప్పి తిరగటం కాదు
మరి వేటికోసం ఈ బ్రతుకు.

బ్రతికినన్నాళ్లు మనవి కావు
మరి అవి పొట్టకోసం బ్రతకటం
నాడు రోజులు నేడు లేవు
నేటి రోజులు మరి రావు

ప్రజాప్రభుత్వం వచ్చింది
మరి ప్రభుత్వానికి అందలం పెరిగింది
కొట్లాట్ల కోరికలు కోసం
కలుషితమైంది మన రాజ్యం

తినడానికి తిండి లేక
కట్టడానికి బట్ట లేక
చదవడానికి సీట్లు లేక
చదివిన ఉద్యోగాలు రాక
దేనికి ఇక బ్రతకడం
తీరని దాహంతో తీరని ఆశతో
బ్రతకాలి మన కోసం మనవారి కోసం.

కారుచీకటి మూసుకొస్తుంది
అది కంటి అద్దాలుతో పోతుందా
పోతుందని పౌరుషం లేదు
పోదని నీరసం లేదు.

రోజులు మారుతున్నాయి
రోగాలు పెరుగుతున్నాయి
పురోగమిస్తుంది మన దేశం
పూరిగుడెసెలు కోసం

అందలం అందించింది అందుకోడానికి కాదు
పీడిస్తుంది కాలం పన్నులు పౌరుషంతో
పీడకలలు పోయాయి
మరి పీడించికు రోజులు వచ్చాయి
దూషించడం ద్వేషం కాదు
మరి మర్యాదించటం మంచిదీ కాదు.

తనకు మాలిన ధర్మంకాదు
తలవంచుకొని తిరగడం కాదు
దీనికి చూడాలి మార్గం
ఇది మార్గంకాదు మరి మనిషి బ్రతికే దుర్గం

ఈ నాలుగు గోడల్లో నలిగి చచ్చిపోవటం
తీరని అపవాదం
ఇది మనకు కాదు మన వారికి కాదు
మరి ఎవరికి ఇంకెవరికి
భ్రమ కలిగించే జీవులకు
భ్రాంతిపడే రోజులకు

రోజుకొక వేషం
రోజుకొక మోసం
చేస్తైనా బ్రతుకుతాంలే
మనకోసం మన వారికోసం

చదువురాని మూర్ఖులతో
చేయలేని మాటలతో
ఎన్నుకున్నాం
మరి కన్నుకుట్టుకున్నాం
కలిమిని కాదన్నాం
కష్టాలను కొనితెచ్చుకున్నాం
కష్టపడిన లాభంలేదు
లాభమున్నా అనుభవించరాదు
ఏమి విడ్డూరం
కోరగానివి మనకి న్యాయం
కలిమిలేములు పంచుకున్నాం
కష్టాలను పంచుకున్నాం

బ్రతకాలి

కాలం మారింది
కరువు పెరిగింది
లొంగుబాటుకు లోభత్వానికి రోజులు
లోలోపల కుమిలిపోయే రోజులు
ఏమన్నా లాభం లేదు
మరి ఏమి చేసినా లాభం లేదు

మంచిరోజులు వస్తాయంటారా
మరి వచ్చేవరకు ఉండమంటారా
మనలో దాగే సత్యం
మరపురాని ఆణిముత్యం
సానపట్టే దెప్పుడు
సరసన చేరే దెప్పుడు
చేరిన మనదగ్గర ఉండేదెప్పుడు
అలాంటప్పుడు బ్రతకాలి ఎవరి కోసం
మనకోసం మనవారి కోసం

మత ద్వేషాలతో మరపురాని సంఘటనలతో
మారిపోయింది లోకం
కలుషితమయింది వాతావరణం
కరుణ, దయ పోయింది మరి కర్మభూమి మిగిలింది.

మనుషులను పెంచలేక
మరయంత్రములు త్రిప్పలేక
మొదలుపెట్టింది కుటుంబ నియంత్రణ మనకోసం
సత్యాగ్రహాలు మొదలుపెడ్తే
శాంతిదూతలు మధ్యకు వస్తే
సాగిపోతాయి రోజులు
సర్వనాశనం అయిపోతాయి జీవితాలు.

కోరింది ఇస్తున్నాం
కోరగానిది తెస్తున్నాం
కోతుల్లాగ గెంతుతున్నాం
మరి పాత చేష్టలు పోయే దెప్పుడు
పరమశివుణ్ణి కొలిచే దెప్పుడు
అలాంటప్పుడు బ్రతకాలి ఎవరికోసం
మనవారికోసం మనకోసం.

అరవిందుని పూర్ణయోగానికి ఆధారచక్రం- ‘జాతీయతత్వం’

డా. ముదిగొండ శివప్రసాద్

ఇది అరవిందుల శత జయంతి సంవత్సరం. అరవింద దర్శనం గూర్చి బహుముఖాల పరిశోధనా వ్యాసాలూ ప్రశంసా గ్రంథాలూ వస్తున్నాయి. అతిగహనమైన ‘పూర్ణయోగం’ గూర్చి, ‘అతిమానస’ తత్వం గూర్చి కూడా సామాన్యుల కందుబాటులో ఉండేటట్లు ప్రముఖులు గ్రంథాలు వెలువరిస్తున్నారు. డాక్టర్ కరణ్‌సింగ్ వంటివారి సిద్ధాంత వ్యాసాలను (థీసిస్.) కూహా పాఠకులు ఎంతో ఆసక్తితో చదువుతున్నారు. ఈ సందర్భాన్నే రస్కరించుకొని కొవ్వూరులోని శ్రీ కాశమాను తారానాథ్ ‘అరవింద దర్శనము—మన జాతీయవాదము’ అనే పేర ఓ నూటఇరవై పుటల గ్రంధాన్ని వెలువరించారు. అరవిందుడు జాతీయ వాదియా? అంతర్జాతీయ వాదియా? అన్న అనుమానం సామాన్యంగా అందరికీ వచ్చేదే! ఆ ప్రశ్ననే శ్రీ తారానాథ్ తనకు తాను వేసుకొని చెప్పిన సమాధానమే ఈ గ్రంథం. వీనిని ఆధారంగా చేసుకొని ఈ వ్యాసంలో అరవిందుల ‘ఆత్మ’ ఏమిటో స్పృశించేందుకు ప్రయత్నిస్తాను.

జాతీ వాదమంటే ఏమిటి.

జాతి అంటే ఏమిటి? జాతీయ వాదమంటే ఏమిటి? దీనిని గూర్చి ముందు చర్చించనిదే, అరవిందుల జాతీయ తత్వం అవగాహన చేసుకోవడం సాధ్యపడదు. ఆ మాటకొస్తే అరవిందులు కూడా తమకు తామే జాతీయవాదమంటే ఏమిటి? భారత దేశంలో ఒక జాతి అంటూ వుందా? ముందుగా 1908—10 మధ్యకాలంలో ప్రశ్న వేసుకొని దానికి తమ అంతరాత్మ చెప్పిన సమాధానాలనే ‘భవానీ మందిర్’ అన్న కరపత్రంగా వెలువరించారు. ఈనాటి వలెనే ఆనాడు కూడా భారతదేశంలో ఒక జాతి లేదని ఒక నాగరికత లేదనీ ‘జాతీయ వాదమనే’ సిద్ధాంతమే ఒక అరువు తెచ్చుకున్నవాదమనీ యూరప్‌నుంచి దిగుమతి చేసుకున్న తత్వమనీ చాలామంది ప్రముఖులు అంటూండేవారు. వారు ఒక ప్రశ్న వేసేవారు. ఈ దేశంలో ఎన్నడైనా ఒక సార్వభౌమాధికారం వుందా? ఒక రాజూ—ఒక రాజ్యమూ పాలించడం కన్పడిందా?? ఛప్పన్నార దేశాల పరిపాలనం — వందలాది విదేశీయుల ఆధిపత్యాలు—అలాంటప్పుడు ఇనొక జాతి ఏమిటీ—అని మొదటి అనుమానం. ఇంకా తీవ్రంగా ఆలోచిస్తే అసలు ‘జాతీయ’ వాదమనే మాటే చాలా సంకుచితంగా వుంది—సువిశాల వసుధైక ప్రభుత్వమనే భావనకు అడ్డుగోడగా వుంది. కాబట్టి ‘నేను జాతీయవాదిని’ అని ఎవడైనా అంటే అతణ్ణి ప్రగతి నిరోధకుడినిగా చూడవలసి వుంటుంది—అనేది రెండవ భావన. కాబట్టి సారాంశం ఏమిటంటే.

(1) ఇక్కడ ఎప్పుడూ ఒక జాతి అనేది లేదు—ఎందుకంటే ఎన్నడూ ఒక రాజ్యం లేనే లేదు.

(2) జాతీయవాదమనే భావనే చాలా సంకుచితమైనది. వర్తమాన వసుధైక కుటుంబ భావనకు అడ్డుగోడ నిలిచేది.

పై రెండు సిద్ధాంతాలను అరవిందుని సమకాలికులలో శ్రీ రవీంద్రుని వంటివారు, ఆధునికంగా శ్రీ సునీతికుమార ఛటర్జీ, రాజాజీ, మొరార్జీదేశాయ్,

ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యగార్లు సమర్థిస్తున్నారు. జయప్రకాశ్ నారాయణ్ ప్రభృతులు బలపరుస్తున్నారు. వీరందరూ కారల్ డబ్ల్యు డచ్ ప్రభృతుల సిద్ధాంతాలను అంగీకరిస్తున్నారు. కారల్ డచ్ సిద్ధాంతం ప్రకారం 'జాతి అంటే రాజ్యమును లేక రాజ్యాధికారాన్ని కలిగిన ప్రజ' (A People in Possession of a State.)—

సిద్ధాంత ఖండనం :

ఇటీవలి కాలాలలో పై సిద్ధాంతాన్ని ఎదుర్కొన్న మొట్టమొదటి జాతీయవాది అరవిందులు. ఆ తర్వాత శ్రీ రాధాకుముద్ ముఖర్జీ, బలరాజ్ మధోక్, దత్తోపంత్ జీ ప్రభృతులు కూడా కారల్ డచ్ నిర్వచనాన్ని సవాలు చేశారు—ఇప్పుడు రాష్ట్రం రాష్ట్రీయత, రాజ్యం, అన్నపదాల నిర్వచనాలు కూడా తెలుసుకోవలసిన అవసరం వుంది.

(1) రాష్ట్రం అంటే జాతి—రాష్ట్రీయత—అంటే జాతీయత. ఇండియాలో ఒక జాతి ఎన్నడూ లేదనేది ఒక వాదం. దానిని తర్వాత ఖండించవచ్చు. ముందుగా ఇక్కడ భారత జాతీయత 1885 లో ప్రారంభమైందనే ఒక సిద్ధాంతాన్ని ఖండిద్దాము. 'జాతి' అనేది రాజకీయ ప్రయోజనాల కోసం కార్య క్రమాలకోసం 'మనం అంతా ఒకటే' అనే భావనను కలిగి వుండటం. ఈ భావన జాతీయ కాంగ్రెసు స్థాపింపబడటంతో వచ్చింది. అంటే 1885 జాతీయవాదం ఇండియాలో పుట్టింది. అయితే 1947 లో ఇండియా రెండు ముక్కలైంది. హిందువులూ—ముస్లిములూ భిన్నభిన్న రాజకీయ ప్రయోజనాలు ఆశించారు. అంటే 1885 లో పుట్టిన భారత జాతీయత 1947 లో నశించిపోయిందని మనం అంగీకరించవలసివుంటుంది. ఇంకా ముందుకుపోతే 1947 కు ముందు మనకు సార్వభౌమత్వంలేదు కాబట్టి ఇక్కడ ఒక జాతి లేనేలేదు. 1947 తర్వాత స్వరాజ్యం వచ్చింది కాబట్టి ఇక్కడ 'జాతి' అవతరించింది. అంటే భారతజాతి అవతరించి నేటికి 25 సంవత్సరాలు మాత్రమే అని సిద్ధాంతీకరింపవలసి వుంటుంది. [రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా కలిసినవారికి 'జాతీయత' ఉంటుంది—వారికి రాజ్యం కూడా లభిస్తే అప్పుడది 'జాతి' అవుతుంది—అన్నది ఇందులోని సిద్ధాంతం.]—ఇదే నిజమైతే చరిత్ర కందని కాలం నుంచి ఈ దేశంలో ఉన్న జాతి ఏమిటి? చరిత్ర ఏమిటి?? ఇక్కడ ఎన్నడూ ఒక 'జాతి' లేనే లేదు—కేవలం కొన్ని గుంపులు—సమూహాలు మాత్రమే జీవిస్తున్నాయి—కాబట్టి భారతదేశ చరిత్ర—అంటే కొన్ని గుంపుల చరిత్ర అని దీని సారాంశంగా మనం అంగీకరింపవలసివుంటుంది—ఇది పూర్తిగా తప్పు. ఎందువల్లనంటే:

(2) ఒకజాతి—ఒక రాజ్యమూ ఎప్పుడూ కలిసి వుండ నక్కరలేదు.

(అ) జెకస్లోవేకియా వుంది—అందులో వున్నది ఒకే రాజ్యం. కాని జెక్ జాతి, సోవోక్ జాతులు రెండు వున్నాయి. యుగొస్లోవియాలో ఉన్నది ఒకే రాజ్యం. కాని మూడు జాతులు కలిసి వున్నాయి—రష్యాలో ఒకే రాష్ట్రం—కాని 120 జాతులూ ఉపజాతులూ వున్నాయి.

(ఆ) దీనికన్న భిన్నంగా ఒకే జాతికి అనేక రాజ్యాలుండటం కూడా కద్దు. ఒకే చైనాజాతి, ఫార్మోజా, చైనా అనే రెండు దేశాలుగా రెండు రాజ్యాలలో వున్నది. ఒకే కొరియాజాతి, ఉత్తర దక్షిణ కొరియాలనే రెండు రాజ్యాల కింద వున్నది. ఒకే జర్మన్ జాతికి రెండు ప్రభుత్వాలూ రాజ్యాలూ వున్నాయి.

(ఇ) రాజ్యం లేకుండా కూడా ఒక జాతి వుండవచ్చు అందుకు ఇశ్రాయిల్ ఉదాహరణం. వందలాది సంవత్సరాలుగా యూదులు ఒక రాజ్యం లేకుండా వివిధ దేశాలలో తలదాచుకుంటూ వుండేవారు 1948 లో వారికొక రాజ్యం వచ్చింది. అందరూ అక్కడికి చేరి తమ జాతీయతను పెంపొందించుకున్నారు. అయితే ఇశ్రాయిల్‌లో రాజ్యం లేక ముందు యూదు జాతి యొక్క అస్తిత్వం లేకుండాపోయిందా??

(ఈ) జాతీయత లేని రాజ్యమూ ఉండవచ్చు. ఉదాహరణ పాకిస్తాన్. ఇక్కడ వున్నవారు ఒక ప్రత్యేకమైన జాతి కానే కాదు, అయితే వారి కొక రాజ్యమూ. దానికి అంగాలైన, భూభాగము, ప్రజ, ప్రభుత్వము, సార్వభౌమత్వము—ఈ నాలుగూ వున్నాయి.

(ఉ) ఒకే జాతికి ఒకే మతం ఉండదు—ఇండియానే తీసుకుందాం. అనాదిగా ఇక్కడ కొన్ని వేల మతాలు వున్నాయి నేటివరకూ—

(ఊ) ఒకే మతానికి ఒకే రాజ్యం వుండదు. ఉదాహరణకు ఇస్లామును తీసుకుందాం. అరబ్ రిపబ్లిక్‌లో ఎన్నో భిన్నభిన్నమైన రాజ్యాలూ, సార్వభౌమాధికారాలూ వున్నాయి. అయినా అందరిదీ మహమ్మదీయ మతమే. బంగ్లాదేశ్ తమ విధానం 'సెక్యులరిజం—సోషలిజం' అని ప్రకటించినా సిద్ధాంత రీత్యా అక్కడ వున్నది ముస్లిములే. అయినా సరే ముస్లిం పాకిస్తాన్‌నుంచి వేరుపడి ప్రత్యేక 'రాజ్యం' స్థాపించు కున్నది.

ఈ ఉదాహరణల నన్నింటిని బట్టి మనకు ఒక విషయం ఖండితంగా స్పష్టమవుతున్నది — ఒక 'జాతి' శాశ్వతంగా జీవించడానికి ఒక రాజ్యంయొక్క అస్తిత్వంతో సంబంధంలేదు—జాతి లేదు — రాజ్యం లేదు. జాతియొక్క సకమ వికాసానికి, సౌఖ్యానికి, రాజ్యాన్ని కూడా ఒక సాధనంగా ఉపయోగించుకుంటుంది మాత్రమే! రాజ్యమే జాతి అనుకుంటే వచ్చిన విషమపరిణామా లేమిటో మనం విదేశాలలో చూచాము. ఒకనాటి రోమన్ జాతి, గ్రీకు జాతి ఈనా డేవీ? అవి రాజ్యాధికారం చుట్టూ కేంద్రీకరించుకొని జీవిస్తూ వుండేవి. ఆ రాజ్యాలు పోగా ఆ జాతులు నశించాయి నేడు ఈజిప్టులో వున్నది పిరమిడ్లనాటి ఈజిప్టు కాదు కదా! నేటి ఇటలీ జూలియస్ సీజర్‌నాటి ఇటలీ ఎలా అవుతుంది??

భారతజాతి జీవన రహస్యం

అయితే ఇన్నివేల సంవత్సరాలుగా ఇన్ని దండయాత్రలు జరుగుతున్నా సరే భారతజాతి ఎందుకు నశించిపోలేదు ప్రశ్న! దీనికి పరిశీలకులు చెప్పిన కారణమేమంటే ఇక్కడి జీవన విధానం జాతీయ వికాసం చుట్టూ కేంద్రీకృతమై వుంది దాని రాజ్యాధికారం చుట్టూ కేంద్రీకరింప బడలేదు. అంటే జాతి తన స్వాయత్తతకు సుస్థిర నిర్వహణకు రాజ్యాధికారాన్ని ఒక సాధనంగా స్వీకరించింది. అందువల్లనే ఇక్కడ రాజ్యాలు పతనమైనప్పటికీ జాతి మాత్రం నశింప లేదు. వేయేండ్లు జాతి బానిసతనంలో వుండి రాజ్యాధికారం కోల్పోయినప్పటికీ, అంతకుముందు ఇంకా వేలాది సంవత్సరాలు చిన్నచిన్న జనపదాలు గణతంత్ర రాజ్యాలు వుండి రాజకీయ సార్వభౌమత్వం లేకపోయినప్పటికీ ఇక్కడి భారత జాతి మాత్రం చెక్కుచెదర లేదు. అంటే మన జాతి నిర్మాణమూ, రాజ్యాధికార ప్రయోజనమూ పాశ్చాత్య దేశాలకు పూర్తిగా వ్యతిరేకంగా రూపొందిందని అర్థం. అందుకే ఏ కారల్ డబ్ల్యు డచ్ నిర్వచనాలూ మనకు వర్తించవు.

అరవిందఘోష్ సమకాలీన పరిస్థితులలో కూడా అజ్ఞతవల్ల కొందరు, బుద్ధిపూర్వకమైన దురుద్దేశంతో మరికొందరు భారతదేశానికి నాగరికత లేదనీ, సంస్కృతి లేదనీ ఇక్కడ ఒక జాతి లేనే లేదనీ వాదింప సాగారు. విలియం ఆర్చర్ అనే నాటక విమర్శకుడు మన సంస్కృతినీ జీవన సర్వస్వాన్ని మిస్‌మేయోకన్నా అధ్వాన్నంగా నిందించాడు. దానిని చూచి బాధతో సర్ జాన్ ఉడ్రాఫ్ అనే మరో విమర్శకుడు 'Is India Civilised?' అనే గ్రంథం ప్రచురించి మన సంస్కృతీ సంప్రదాయాలను సమర్థించాడు. ఈ రెండు పుస్తకాలు అరవిందునిలో ఒక ఆలోచనా ధారను సృష్టించాయి. తత్ఫలితంగా పుంఖానుపుంఖంగా 'ఆర్య' పత్రికలో 1918 డిసెంబరునుంచి మన 'జాతి' గూర్చి బహుముఖాల చర్చిస్తూ సుమారు మూడు సంవత్సరాలపాటు వ్యాసాలు ప్రచురించారు. అవే తర్వాత గ్రంథ రూపంగా వెలువడ్డాయి. దాని పేరే 'The Foundations of India Culture'

ఒకే జాతి ఒకే సంస్కృతి.

అరవిందుల సిద్ధాంతం ప్రకారం ఇక్కడ బాహిరమైన రాజ్యాధికారంయొక్క ఏకేంద్రీకరణమును

బట్టి ఒక జాతి లేదని వ్యాఖ్యానించడం తప్పు. మన జాతి విశిష్టతయే అది. అనాది సిద్ధంగా ఇక్కడ భారతజాతి జీవిస్తూవుంది. దాని ఒక పరిమితమైన ఎల్లలు కల భూభాగం, ఒక నాగరికతా, ఒక సంస్కృతీ వున్నాయి—అవి ప్రవాహవేగంలో సాగుతూ నేటివరకు అవిచ్ఛిన్నంగా వస్తూనే వున్నాయి. విష్ణుపురాణం ఇలా చెప్పింది.

'ఉత్తరం యత్ సముద్రస్య
హిమాద్రేః చైవ దక్షిణమ్
వర్షం తద్ భారతం నామ
భారతీ యత్ర సంతతి'

సముద్రానికి ఉత్తరంగానూ హిమాలయాలకు దక్షిణంగానూ గల దేశం 'భారత వర్షం' అని నిర్వచించింది.

వాయు పురాణం ఇంకా స్పష్టంగా.
'యోజనానాం సహస్రంతు
ద్వీప యం దక్షిణోత్తరమ్
ఆయతో హ్యయా కుమారిక్యా వా
గంగా ప్రభవాంచ్చయః'

గంగానదీ జన్మస్థానం (గంగోత్రి)నుండి కన్యాకుమారి వరకు గల వేయియోజనాల భూభాగం పేరే భారతదేశం అని ఖండితంగా చెప్పింది. ఈ భూభాగంలో నివసించే జాతిపేరు భారతజాతి — అంటే ప్రకాశమందు—చైతన్యమందు, రత అంటే కోరికగల జాతి—కాబట్టి భారత జాతి అనిపేరు. అంతేకాక ఈ జాతికి రాజ్యాధికారంలోకూడా మొత్తం దేశంలోనూ ఒకే సార్వభౌమత్వాన్ని సాధించిన వాడు దుష్యంతుని కొడుకు 'భరతుడు' కాబట్టి అతనిపేర ఇది భారతజాతి అయిందని మరొక నిర్వచనం.

ప్రవాహ వేగంలో భారతీయకరణం

భారతజాతి అంటే ఏమిటి? వైదికార్యజాతి. 'ఆర్య' అంటే శ్రేష్ఠుడని అర్థం— సర్వశ్రేష్ఠమైన ఈ జాతి తన సంస్కృతినీ నాగరికతనూ ప్రపంచంలోని నలుమూలలకూ విస్తరింపజేసింది. అలాగే తన మీదికి అనాదిగవస్తున్న సైనిక — సాంస్కృతిక దండయాత్రల నెన్నింటినో త్రిప్పికొట్టి మిగిలినవాటిని తనలో 'జీర్ణం' చేసుకుంది. ఇరానియనులు గ్రీకులు, సిథియనులు కుషానులూ, హూణులూ, ఆ తర్వాత అరబ్బులూ, మొగలాయీలూ ఆంగ్లేయులూ ఇలా శర పరంపరగా వచ్చిన దండయాత్రల నన్నింటినీ ఈ జాతి సాహసోపేతంగా ఎదుర్కొని శత్రువులలోని విజ్ఞానాన్ని సహృదయంతో స్వీకరించి వారందరినీ భారతీయ కరణం (Indianisation) చేసివేసింది. కాని ఇటీవల కాలంలో భారత జాతీయవాహిని తన ప్రవాహ గతిని కోల్పోయి కొంత స్తంభించడంవల్ల గత రెండు మూడువందల ఏండ్లుగా భారతీయ కరణం చేసే సామర్థ్యాన్ని కోల్పోయింది. మురికి నీరునుండి పారిశుధ్యం ఉద్భవించదు. అదే గంగా వాహిని అయితే శవం కూడా శివంగా మారింది— అంటే సంస్తభితదశనుంచి భారత జాతీయ జాహ్నవి తిరిగి ప్రవాహవేగాన్ని పుంజుకోవాలని అరవిందులు ఆశించారు. అంటే ఈ నాడు 'భారతీయ కరణం' సిద్ధాంతంపై విమర్శ చేసే వారందరూ ఈ సిద్ధాంతానికి తొలి ఆధునిక ప్రవక్త అరవింద మహాశయుడేనని గుర్తుంచుకుంటే చాలు!

It is further rendered improbable by the fact that in one or two or three generations the invaders were entirely Indianised as u·rred completely the Indian religion manners customs culture and melted into the mass of the Indian people. No such phenomenon took place as in the countries of Roman empire, of barbarian tribes imposing on a superior civilisation their laws political system barbaric customs aleen rule.'

(Foundations of Indian culture.)

ప్రవాసీ మందిర్ :

భారతదేశమంటే ఏమిటి? ఇది మిగిలిన దేశాల వలె కొంత మట్టితో కూడిన పరిమితమైన భూభాగం కాదు. ఇక్కడిది ప్రాదేశిక జాతీయవాదమూ కాదు (Territorial Netionalism) భారతీయులు ఉపాసించింది ఎల్లలు లేని ఆధ్యాత్మిక జాతీయవాదాన్ని,

(Spiritual Nationalism.) సర్వమానవాళి కల్యాణమే దీని గమ్యం. అంటే భారతీయులు ఈ దేశాన్నే ఒక పెద్ద 'భవానీ మందిరం'గా భావించారు—అంటారు శ్రీ అరవిందులు తమ 'భవానీ మందిర్' అన్న కరపత్రంలో. ఈమె మహిషాసురమర్దని. భవానీ భారతి, సామూహిక శక్తి స్వరూపిణి. ఈమె ఉపాసన కొరకే సాధకుడు రాజకీయ, సాంస్కృతిక, సాహిత్యపరమైన భిన్నాభిన్నమైన కార్యక్షేత్రాలు స్వీకరిస్తాడు—అంటారు శ్రీ అరవిందులు. అంటే అరవిందుల తొలి దశలోని రాజకీయ కార్యక్రమం—మలిదశలోని పూర్ణయోగ సాధన, అవిచ్ఛిన్నంగా జరిగిన రచనా వ్యాసంగమూ మొత్తమూ ఈ 'భవానీమందిర' ఉపాసనలో అంతర్భాగమేనని వేరే వివరించ నక్కరలేదు కదా! అంటే అరవిందుని జీవన కార్యక్రమంలో రంగస్థలాలు భిన్నమైనప్పటికీ అంతస్సూత్రం మాత్రం ఒక్కటే అదే 'జాతీయ భవానీ సమార్చనం' అనేది సిద్ధాంతం.

'స్వ' ధర్మమే స్వరాజ్యం

స్వరాజ్యమంటే ఆంగ్లేయులో మరెవరో ఈ దేశం వదిలి వెళ్ళడం మాత్రమేకాదు—మన జాతీయతను. మన ఏకాత్మతను మన 'స్వ'ను సాక్షాత్కరింప జేసుకోవడమే స్వరాజ్యం. స్వరాజ్యమనేది ఒక ఆధ్యాత్మికమైన కల్పన. స్వాతంత్ర్యమనేది ఒక యోగ సాధన. రాజకీయ పోరాటం కేవలం ఒక ఉపకరణం మాత్రమేనంటారు అరవిందులు. ఈ విషయంలో అరవిందుడు, లోకమాన్యుడూ, మహాత్ముడూ ఏకాభిప్రాయాన్నే కలిగి వున్నారని స్పష్టం కావడం లేదా!!

పరమేశ్వరుని ప్రబోధం

భారత జాతిని పునరుద్ధరించి ఈ ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రపంచానికందింపవలసిన జన్మసిద్ధమైన బాధ్యత ప్రతిభారతీయునిమీదా వుంది. అంటే జాతీయ కాంగ్రెసును 1885 లోనో మరెప్పుడో ఏ దాదాభాయీ నౌరోజీయో స్థాపించ లేదు. పరమేశ్వరుడే ఈ పబోధాన్ని జాతికి ఇచ్చాడు. అంటే కార్యక్షేత్రంలో ఆ సంస్థను ఆ వ్యక్తులు స్థాపించక పోయినా పరమేశ్వర సంకల్పం మరో తీరులో బహిర్గమించి తీరక తప్పదు. క్షుభితమైన శోకార్ణవ సంతప్తమైన అనంతమానవాళికీ భౌతిక మానసిక ఆధ్యాత్మిక సుఖశాంతులనిచ్చి, సర్వాంగీణమైన ప్రగతిని సాధించడంకోసమే తాము సాధన ప్రారంభించామని చెప్పారు అరవిందులు (The Human Cycle) తమ రాజకీయ కార్యకలాపాలకంతా ఈ జాతీయ వాదమే ప్రాతిపదిక—తమ పూర్ణయోగసాధనకు కూడా ఈ 'భవానీ మందిరోపాసనమ్' ఆధార చక్రం.

అతిమానస తత్వం :

అరవిందులు చెప్పిన అతిమానస తత్వాన్ని గూర్చి రెండు మాటలు చెప్పి ఈ వ్యాసం ముగిస్తాను. అనాదిగా పదార్థం పరిణామం చెందుతూ నేటికి ఒక దశను చేరుకుంది. జడంనుండి చేతనం, జంతువునుండి మానవుడు. మానవునిలో మనస్సు—ఇలా పరిణామం కోట్లాది సంవత్సరాల కాలంలో 'సహజ' క్రమంలో సాగుతూ వచ్చింది. అంటే ఇప్పటి వరకూ భూమిమీద వున్న పదార్థాలలో 'మనస్సు' శ్రేష్ఠమైన మౌలిక తత్వం. అయితే డార్విన్ ప్రభృతులు పరిణామవాదం మానవునితో పరిమితమైపోయిందని సిద్ధాంతీకరించారు—అరవిందులు దీనిని త్రోసిరాజన్నారు. వర్తమాన మానవుడు కూడా రాబోయే మహామానవునికి (Superman) ఒక పరిణామ దశలోని రూపమే! అంటే లోగడవలె 'సహజ' పద్ధతిలో కాక స్వయంసాధనతో ఈ పరిణామాన్ని సాధించే శక్తి మానవునికి వుంది. అంతే. వెనుకటి పరిణామానికీ రాబోయే పరిణామానికీ ప్రముఖమైన భేదం. నేడు కాక రేపైనా ఈ అతిమానసం (Supermind.) వికసించక తప్పదు. అతిమానవుడు (Superman) ఈ భూమిపై సంచరించక తప్పదు. ఈ ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రపంచాని కందీయవలసిన బాధ్యత కూడా శక్తి స్వరూపిణి అయిన భారతమాత మనకు అప్పగించింది అంటారు శ్రీ అరవిందులు.

జాతీయతా దృష్టి :

అరవిందుణ్ణి గూర్చి ఒక సందర్భంలో (ఆలీపూర్ బాంబ్ కేసులో) మాట్లాడుతూ శ్రీ చిత్తరంజన దాస్ 'అరవిందుడు దేశభక్తికి కవి, జాతీయతకు ద్రష్ట, మానవాళికి ప్రేమికుడు' అంటారు.

(Poet of Patriotism prophet of nationalised and lover of humaniety) అరవిందుల జీవన రహస్యమంతా ఈ ఒక్కవాక్యంలో సూటిగా వివరించారేమో సి. ఆర్. దాస్ మనకు, అనిపిస్తుంది! ఎందువల్లనంటే అరవిందులు చెప్పిన సిద్ధాంతాల్లో అతిమానసతత్వం ఒక్కటిమాత్రం ఇంతవరకు ఎవ్వరూ చెప్పనిదీ చెప్పారేకాని తక్కిన పూర్ణయోగ కల్పనమంతా అనాదిగా మన వేదోప నిషత్తులనుండి వస్తూవున్నదే! విడివిడిగావున్న ఈ భావాలనన్నిటినీ ఒక మూసలో (synthesis)గా రూపొందించి దానికి 'పూర్ణయోగ'మనే కల్పన నివ్వడం అరవిందుల ప్రత్యేకత!

వేదాల ప్రకారం, మానవుడు పలాయన వాది కాదు కారాదు. సంసారం, మిథ్య, మాయా నేనే కాదు. ఒక సత్యం. ఎరువు లేనిదే చెట్టురానట్లు భూమి లేనిదే గింజల మొలకెత్తనట్లు తమస్సునుండే రజస్సు సత్త్వమూ క్రమవికాసం చెందుతాయి. పంకంనుండే పంకజం రావడం సహజపరిణామం. అందుకే అరవిందాశ్రమంలో దేహాన్ని నిర్లక్ష్యం చేయరు. ఆడటం పాడటం, వ్యాయామం చేయడం కూరలు పెంచడం, పండిన కూరలు వండటం, వండిన వాటిని 'యజ్ఞ' భావంతో అరగించడం—ఈ మొత్తమూ పూర్ణయోగంలో అంతర్భాగమే—ఇదంతా ఒక కామమే కావచ్చు. 'సత్యకామమే కావచ్చు—నైష్కర్మ్యం మాత్రం కారాదు. ఎందుకంటే ధర్మార్థ కామమోక్షాలు నాలుగు నాలుగు పురుషార్థాలే! కామంలేనిదే అర్థం దేనికి? ఈ అర్థకామాలు 'ధర్మ'బద్ధమైనప్పుడే అవి మోక్షానికి దారి తీస్తాయి. కాబట్టి మానవ జీవన సాఫల్యానికి చతుర్విధ పురుషార్థాలూ కావలసిందే! వీనితో మానవుడు దేహాన్ని మనస్సును బుద్ధినీ తృప్తిపరుస్తూ, జయిస్తూ స్వాధీనతతో పూర్ణకాముడై ఆత్మను సాక్షాత్కారం చేసుకోవడమే 'పూర్ణయోగం' ఈ విశ్లేషణమే 'ఏకాత్మతా' తత్వం. ఈ యోగ పర్యవసానం 'అతిమానస' వికాసం. గాంధీజీ 'రామరాజ్యం'లాగా ప్లేటో 'ఆదర్శరాజ్యం' లాగా అరవిందులు ఆశించిన ఆదర్శ సమాజం 'అతిమానస రాజ్యంగా ఆవిర్భవిస్తుంది, అక్కడ రాజా, రాజ్యమూ ఉండనక్కరలేదు. సత్యమూ, సత్వమూ రాజ్యం చేస్తూ వుంటాయి—

'న రాజ్యం నచ రాజా సీత్
న దండ్యో నచ దాండికః
ధర్మేణైవ ప్రజాస్సర్వే
రక్షన్తిస్మ పరస్పరమ్'

అనాదిగా భారతీయులు ఆశించిన 'ఆదర్శ రాజ్య'మిది. దీనినే అరవిందులు ఆధునిక శాస్త్రీయ పరిభాషలో చెప్పడం 'అతిమానస' కల్పనంగా తోచడం లేదా!! కొందరు విమర్శకులు ఇది సంప్రదాయంలో పూర్వం ఎన్నడూ చెప్పబడని నూతన 'కల్పన' అనే మాట 'కొంత' వాస్తవమేకాని మన 'కృత'యుగమంటే ఏమిటి? 'చేయబడ్డ' ఒక సత్యయుగమే కదా!!

ఈ అతిమానస రాజ్యం పరలోకానికి సంబంధించిన కల్పనకాదని మరో వారు గుర్తుంచుకోవాలి. 'మోక్ష' మంటే పరలోకానికి సంబంధించినదన్న భ్రమ (అది చతుర్విధ పురుషార్థాలలో చివర ఉండటం వల్ల) కల్గిన మాట వాస్తవమే! అదే మన జాతి పతనానికి దారి తీసింది అంటారు అరవిందులు. ఈ పృథ్వీమీద (Matter), జరిగే ఆధ్యాత్మిక ప్రతిష్ఠాపనమే (spirit)దైవసామ్రాజ్యం (Kingdom of God.) ఇది సాకారం. అంతేకాని పరలోక రాజ్యం కాదు—దీనిని సృష్టీకరించడమే తమ జీవన కార్యంగా పేర్కొన్నారు అరవిందులు!! యాంత్రికమైన పాశవికమైన జీవితానికి అలవాటు పడుతున్న వర్తమాన విశ్వానికి ఈ 'ఆధ్యాత్మిక సమాజ' (Spiritual Society) నిర్మాణాకాంక్ష, గ్రీష్మంలో అరవింద శైత్యోపచారంలా గోచరిస్తున్నదికదూ!!

ఈ వ్యాసరచనకు ఉపయోగపడ్డ గ్రంథాలు

(1) 'అరవింద దర్శనము—మన జాతీయ వాదము': శ్రీ కాకుమాని తారానాథ్, సబార్డినేట్ జడ్జి, కొవ్వూరు.

(2) 'అరవిందుల అతిమానసతత్వం'-వ్యాసం డాక్టర్ కరన్‌సింగ్ (ప్రస్తుత కేంద్రమంత్రి).

(3) 'రాష్ట్రంవేరు—రాజ్యంవేరు': శ్రీ దత్తోపంత్ జీ ఠెంగ్డే వ్యాసం.

(4) అరవిందుల గ్రంథాలు.

(5) 'ఏకాత్మ మానవతావాదం': శ్రీ దీనదయాల్ ఉపాధ్యాయ.

(6) 'మన చతుర్విధ పురుషార్థాలు' శ్రీ సుందర్‌సింగ్ భండారీ వ్యాసం.

'స్వర్గీయ శంభుప్రసాద్‌గారి సంస్మరణ'

[స్వర్గీయ శివలెంక శంభుప్రసాద్‌గారి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని —
వ్రాయబడిన ఒక సంస్మృతి]

ధారుణి లోన నెందఱు ప్రధానులు లేరు తలంచి చూడగా
వీరి వలెన్ జనాలకును వేత్తృత గల్గెడి రీతిగా బుధుల్
పేరు ప్రతిష్ఠ చెందిరె రిపేరొనరించిరె సంఘమున్ సదా
వారికి వారి సంతతికి వాక్ప్రయోగ మొనర్చిరే కదా.

విశ్వదాత బిరుదు వీరికి గల్గనే
గాంధి మహాత్ముని కార్యమునకు
సాయంబు చేయగా కాయంబు ధార వో
సిన వారె వీరలు సేవ జేసి
ధరను దేశోద్ధారక బిరుదంబు నొందిరే
ప్రజలలో మిక్కిలి వాజ కలదె
అట్టిరు తమ ఖ్యాతి నందునట్లుగ వేగ
జామాత శంభుప్రసాదు పరము

చేయ బుద్ధి గల్గె చెడిపోక వృద్ధిగా
నాంధ్ర జనులు సుఖము నందినారు
పత్రికాధిపతులు బాగుగా పొగడంగ
భారమైన 'భారతి' రమణీయ
మైన విధము నొంది మహిమ జెందె.

సకల కళావిదుల్ భువిని సారెకు సాయ మొనర్ప వేడగా
కుకవులు మూర్ఛ నొందగను కోరి వరేణ్యుల బ్రోచి వేగమే
ప్రకటితమైన ఖ్యాతి ధర వారిని వీరిని బోలె లేక సా
క కఠినమైన మతి లేక ఘనంబుగ బ్రోచిరే కదా.

ఆంధ్రపత్రిక, భారతి నార్య జనులు
శ్లాఘ్యమంచును కొనియాడ సాటివారు
వృద్ధి నొందించి లోక సమృద్ధమైన
పేరు నొందిరి కీర్తిని వీరు కాంచి
శంకరుని కరుణ యశంబు నొంది
భువిని శంభుప్రసాదునా నవని లోన!

'స్వర్గీయ శంభుప్రసాద్ గారి సంస్మరణ'

శివుని పరిపూర్ణ కృప నొంది శైవ దీక్ష
పొంది జగమును శ్రేయంబు నొంద జేయు
సూక్తి నిధి శంభుప్రసాదు శూలిసముడు
పట్టుదలగల మనిషి; అట్టి వాడు సుగతి జెందె
జగతి నెవ్వండు గలిగె ప్రగతి గల్గ—

ధర ఛలోక్తుల విసరెడి కరణి నేడు
గలడు కృపామయుండు నిర్మలుడు నేడు
సజ్జనాగ్రేసరుడు విద్వజ్జనాశ్రితుండు
సుజన పండిత వినుతుడు సూక్తి నిధియు
శంభుప్రసాద రాయుడు, శాశ్వతుండు!

నిర్మమతతోడ సాహాయ్య నిధి యెవండు
గలడు భువిని నేడు గలం డమల బుద్ధి
జాగరూకత గలవాడు వాగధీశు
తుల్యం డెవ్వండు గలుగునే తోషితేంద్రు
శంభుప్రసాదు సముడు లేశముగనైన

భువిని నిర్మాణ కుశలుండు దివికి నరిగె
సజ్జనుండును సౌమ్యుండు శాంతి నిధియు
సుకవి పండిత పోషకుం డకళినుడు
వినయశాలి, నిగర్వి వీతభయుడు
శంభుప్రసాదుని చూడ నభంబు విరిసె—

పండితు లందఱు, పాపము దివికేగె
మన కింక దిక్కెవ్వరనుచు నుండ
కార్యకారులు కళాకారులు మిక్కిలి
పొగడంగగా భువి ప్రోచినారు
పరిజనంబులు నేడు సరియని మన గతి
తలపోయగా నేగె కాలగతిని
సరి వారు విను వారు కరుణానిధి యటంచు
వాపోవుచుండగ వగరుచుండ

దివికి నేగె సుజనుడు వినయవంతు
డార్య పూజనీయుడా శంభుప్రసాదు
వాని సాటిగలారె! వసుధలోన
దివికి మేల్చేయ నరిగె నీ భువిని వదలి!

—వేదం రామశాస్త్రి.

సొంత వూరు

శ్రీ కంచి వాసుదేవరావు

'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అన్నారు — అటువంటి పుట్టి పెరిగిన ఆ వూరికి ముప్పయి ఐదు సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత అడుగుపెడుతుంటే మనస్సు ఉప్పొంగిపోవడంలో అబ్బురమేముంది?

బస్సు దిగి ఆ గడ్డపైన తిరిగి కాలు మోపిన విశ్వనాథంగారి తనువు పులకించి పోయింది—అందులోనూ ఆ వూరంటే ఆయనకి చాల అభిమానం—అక్కడ యిళ్ల అద్దెంత చవుక—పాలు పెరుగు పుష్కలంగా దొరకుతాయి—కాస్ట్ ఆఫ్ లివింగ్ తక్కువ—ప్రశాంత వాతావరణం—మనుష్యులు చాల మంచి వారు—ఆ వూరికిగల చారిత్రిక ప్రసిద్ధి ఆయనకు గర్వకారణమయింది—ఒకప్పుడు — ఆయనను ఉడికించి, తమాషా చేయడానికి—ఆయన మిత్రులు ఆ వూరిని తిట్టేవాడు—దాంతో ఆయన మొహం కందగడ్డయిపోయేవి ఆవేశంతో వూగిపోయేవాడు—ఆ వూళ్లో పుట్టి, పేరు తెచ్చుకున్న రచయితలు, నటులు, గాయకులు—రాజకీయ నాయకులు పేర్లు ఏకరవు పెట్టేవాడు—బహమనీ సుల్తానుల కాలంలో, ఈస్టు యిండియా కంపెనీ కాలంలో ఆ రేవు పట్టణానికి గల వైభవాన్ని గురించి ఉపన్యసించేవాడు—

అంత అభిమానంగల విశ్వనాథంగారు ఆ వూరికి అంతదూరంగా అన్ని సంవత్సరాలు ఉన్నాడంటే- వినరికి వారు—ఆయనకే అమిత ఆశ్చర్యంగా వుంటుంది—కాని అసాధ్యమనుకున్న అనేక విషయాలను కాలం సుసాధ్యం చేస్తుంది - రైల్వేలో ఉద్యోగం వచ్చిన విశ్వనాథం—పుట్టి పెరిగిన ఆ వూరినీ కాస్త—ఆ జిల్లాను—ఆ రాష్ట్రాన్నీ విడచి, తన భాష, తన సంప్రదాయం కాని ఒరిస్సాకు వెళ్లిపోయాడు- వెళ్లే ముందు ఎంతబాధ పడ్డాడనీ!—'అసలు ఆ ఉద్యోగం వదలుకుందామా అనుకున్నాడు—కాని పుట్టి పెరిగి ఎన్నో సంవత్సరాలు ఆ వూళ్లో వుంటున్నా—సొంత యిల్లుకాని, పొలంకాని, స్వజనం కాని లేక కేవలం రెక్కలమీద ఆధారపడవలసిన తనవంటి వారు—ఇటువంటి సెంటిమెంట్సు పెట్టుకుని నిక్షేపంలాంటి రైల్వే ఉద్యోగాన్ని వదలుకోవడం తెలివితక్కువ అని స్నేహితులు బంధువులు సలహా యివ్వడంవలన ఆయన ఆ వూరు విడచిపోయాడు - ఐనా అప్పుడప్పుడు — ఆ వూరు వచ్చిపోతూ వుండవచ్చులే- క్రమేణా తన ప్రాంతానికి ఉద్యోగంకోసం ప్రయత్నించ వచ్చుననీ—ఆశాభావాన్ని ఏర్పర్చుకుని మరీ ఆ వూరిని విడచి వెళ్లిపోయాడు—కానీ చిత్రం ఉద్యోగంనుంచి విరమించుకునేటంతవరకు— ఆయనకు ఈ వూరు రావడమే మళ్లీ పడలేదు— అన్నాళ్లూ ఆ పరాయి రాష్ట్రంలోనే వుండిపోయాడు—ట్రాన్స్‌ఫర్లూ ఆ రాష్ట్రంలోనే జరిగాయి—అన్నేళ్లు ఆ రాష్ట్రంలోవున్నా—తన పిల్లలూ—ఆ రాష్ట్రాన్నీ ఆ భాషనూ సొంతం చేసుకున్నట్లు—తను ఆ రాష్ట్రాన్నీ ఆ ప్రాంతాన్ని తనదిగా భావించలేక పోయేవాడు— అందువల్లనే — ఉద్యోగం విరమించుకున్నాక— తనకు వచ్చే ప్రావిడెంటు ఫండు — త్వరలో మెచూరు కానున్న యల్. ఐ. సీ పాలసీమీద వచ్చే డబ్బుతో—తను పుట్టి రెండు దశాబ్దాలుగా పెరిగిన ఆ వూళ్లోనే ఇల్లు కొనుక్కుని శేష జీవితాన్ని కృష్ణా రామా అంటూ గడిపివేయాలని ఆయన నిశ్చయించుకుని—అన్ని సంగతులూ విచారించడానికి ఇప్పుడు ఈ వూరికి వచ్చాడు —

తీరా బస్సుదిగిన తర్వాత వివరించేకి వెళాలి అన్న ప్రశ్నకు జవాబు లభించిన- ఎదురుగా ఉన్న

హోటలుకు వెళ్లి 'రూం' తీసుకున్నాడు—తాత్కాలిక మకాముగా—

స్నానంచేసి, కాఫీ ఫలహారాలు పూర్తిచేసుకుని—తను ఒకప్పుడు-అనేక సంవత్సరాలు నివసించిన యింటి వేపుకు నడక సాగించాడు—పరిచితమైన ఆ రోడ్ల మీద ఎవరైనా కన్పించకపోతారా అన్న ఆశ—ఇన్నేళ్ల తర్వాత—ఆ రోడ్ల స్పర్శలోని థ్రిల్ (?) అనుభవించాలన్న ఉద్దేశంతో—రిక్షాలో వెళ్లకుండా, నెమ్మదిగా నడక సాగించాడు.

రోడ్లు మారలేదు — కట్టడాలు గుర్తుపట్టలేనంతగా మారిపోలేదు—కాని తనకు తెలిసిన మనుష్యులు ఎవరూ కనపడకపోయేటప్పటికి ఆయనలో ఒక విధమైన నిరాశ కలిగింది—

తను పూర్వంవున్న యింటి ప్రదేశానికి చేరుకున్నాడు — ఇప్పుడు— అక్కడ— ఆ పొట్టిగువ్మాల పెంకుటిల్లు తీసి—దానిస్థానే రెండు అంతస్థుల భవనం వుంది—అందులో ఏదో ఆఫీసువుంది—యిల్లు యింకా అల్లాగే వుంటుంది అని తను భ్రమపడ్డం—తనకే చిత్రంగా తోచింది. ఆ యిల్లు అంటే తనకి అభిమానం-తను అక్కడే పుట్టాడు—అక్కడే పెరిగాడు—ఆ యింటి దొడ్లలోవున్న చెట్లెక్కి ఆడాడు—అక్కడే చదువు పూర్తయింది—పెళ్లయింది—తండ్రి, తల్లి ఆ యింట్లోనే మరణించారు—అది తన స్వంత యిల్లుకాదు—కాని స్వంత యింటికన్న ఎక్కువ అభిమానంగా చూచుకునేవారు—ఆ రోజుల్లో యింటి యజమానులకు—ఇంటి అద్దెకన్నా— ఆ యింట్లో అద్దెకుండేవారి మంచితనానికి ఎక్కువ విలువ యిచ్చేవారు—ఇంటి యజమానులనీ, అద్దెకుండేవారనీ ఆ విధంగా కలసిపోయినందుకీ అన్ని సంవత్సరాలు ఆ యింట్లో వుండగలిగి దానిపై ఒక మమకారాన్ని పెంచుకున్నాడు —

ఆ యింటి ఎదురు బొదురుగావున్న యిళ్లల్లో పెద్ద మార్పులు లేవు—కానీ ఎరుగున్నవాళ్లెవరూ అక్కడా కన్పించలేదు—

విశ్వనాథంగారు ఆఫీసులో ప్రవేశించి మేనేజరు గదివైపుకు వెళ్లారు—మేనేజర్ సీటులో ముప్ఫయ్యేళ్ల యువకుడు—తన పెద్దకొడుకు ఈడువాడు కన్పించాడు—' మే ఐ కమిన్ ప్లీజ్'—అని అంటున్న తననిచూచి అతను వినయంగా 'కమిన్ సార్—హవ్ కెన్ ఐ హెల్ప్యు'—అన్నాడు.

విశ్వనాథంగారు పక్కనున్న కుర్చీలో కూర్చుని ముందుకువంగి నెమ్మదిగా 'నా పిచ్చిసెంటిమెంటుకు మీరు నవ్వకోకుండా వుంటానంటే ఒకమాట—ముప్ఫయి ఐదేళ్ల క్రిందట నేను యీ యింట్లో వుండేవాడిని—ఆ యిల్లు యిప్పుడంతా మారిపోయింది అనుకోండి—ఐనా— ఒకసారి యీ ప్రాంగణమంతా తిరిగి రావాలని వుంది—' మేనేజర్‌గారు ఆ మాటలు విని ఆశ్చర్యపోయాడు — వెర్రి వేయివిధాలంటారు ఇదే కాబోలు! ఐనా యిది ప్రమాదం కలిగించని వెర్రి—అంగీకరించడంలో తప్పేముంది? అన్న ఆలోచనతో—నౌకరును పిలిచి 'ఈ బాబుగారు ఎప్పుడో చాల రోజుల క్రితం — ఈ యింట్లో వున్నారుట — ఇప్పుడు చూడ్డానికి వచ్చారు—వీరిని తీసు-వెళ్లి మన ఆఫీసు గదులూ—అద్దెలకు యిచ్చిన వాటాలూ చూపించు' అన్నాడు—నౌకరు విశ్వనాథంగారి వంక వింతగా చూచి 'రండి బాబూ' అని తోడ్కొని వెళ్లాడు.

ఒకప్పుడు— ఆ యింటికి పెద్ద పెరడు వుండేది—అందులో కొబ్బరి, జామ, మామిడి, సపోటా చెట్లు వుండేవి-చంద్రకాంత, మల్లెమందార, పూల మొక్కలు, సన్నజాజీ తీగలూ వుండేవి — ప్రతిరోజూ ఉదయం తెలతెలవారుతూ వుండగా ఇరుగు పొరుగు గృహిణులు పూలసజ్జలు పట్టుకుని పూజకు పూలు కోసుకు వెల్తూవుండేవారు—ఇప్పుడు దొడ్డి అంతా పోయింది—అద్దెల దృష్టితో — అద్దెకు యిచ్చే వాటాలు కట్టేసారు—ఈ ముప్పది ఐదేళ్ల చరిత్రకు సాక్షీభూతమా అన్నట్లు ఒక్కకొబ్బరి చెట్టు మటుకు యింకా నిలిచి వుంది—'నిరుడు కురిసిన హిమ సుమంబులు ఏవి తల్లీ'—అన్నట్లు— అప్పటి పూలు ఏవి—అప్పటి కాయలేవి—అప్పటి గదులేవి — ఇందులో

తను భోజనం చేసిన వంటిల్లు—చదువుకున్న వసారా—పడుకున్న గది—ఎక్కినచెట్లు — యిక్కడ వుండేవని గుర్తుతెచ్చుకోవడం ఎల్లా?—

'ఎవరు చంద్రయ్యా వీరు?'—అని ఆ అద్దె వాటాల్లో వున్న వాళ్లు అడిగిన ప్రశ్నలను — అతను యిచ్చే సమాధానాలు విని వారు తనవంక విచిత్రంగా చూస్తుంటే విశ్వనాథంగారు కొంత ఇరకాటంలో పడ్డారు—

ఐదు నిముషాలలో విశ్వనాథంగారు తిరిగి మేనేజరుగారి గది వద్దకు వచ్చాడు—అతను ఆయనను చూచి చిరునవ్వుతో 'ఏమండీ—అంతా చూశారా?' అని అడిగాడు—

'చూశాను బాబూ—థ్యాంక్సు—మీరు యీ యిల్లు కొనుక్కున్నారా?—అద్దెకు వుంటున్నారా' అని అడిగారు విశ్వనాథంగారు—

'మేము కొని ఐదారేళ్లయిందండీ—ఆ పెంకుటింటిని పడగొట్టి ఇదంతా చేసింది మేమే—

'ఆ యింటి వాళ్లెక్కడ వున్నారండీ'—

బాగుపడ దల్చుకున్నవారు ఈ వూళ్లో ఎందుకుంటారండీ—ఇల్లు అమ్మేసుకుని ముగ్గురు అన్నదమ్ములలో ఒకరు హైదరాబాదులో వుండిపోయాడు—మరొకరు గుంటూరులో ఏదో వ్యాపారం చేస్తున్నారట. చివరతను నెల్లూరులో గవర్నమెంటు సర్వీసులో వున్నాడు—ఇది రెండేళ్ల సంగతి— ఆ తర్వాత డీటెయిల్సు తెలియవు — అన్నట్లు మీ గురించి ఏమీ చెప్పారు కారు' అన్నాడు మేనేజర్—

'నేను యస్‌యీ రైల్వేలో పనిచేసి రీసెంటుగానే రిటైరయ్యాను— పెద్దపిల్లాడు ఢిల్లీలో వున్నాడు— రెండవవాడు కలకత్తాలో వున్నాడు — మూడవవాడు రైల్వేలో చక్రధరపూర్‌లో పనిచేస్తున్నాడు—అమ్మాయి కటక్ మెడికలు కాలేజీలో యం.బి.బి.యస్. చదువుతోంది—ఉద్యోగం అయిపోయింది కనుక — రిటైర్డు లైఫ్ ఎక్కడ గడపాలా అన్న ఆలోచన వచ్చింది—నామిసెస్‌కి, పిల్లలకి అంత యిష్టం లేకపోయినా పుట్టి పెరిగిన మమకారం పోనందున నేను యీ వూళ్లో సెటిల్ అవుతామనుకుంటున్నాను— ఇక్కడే ఒక్క యిల్లు కొనుక్కునే ఆలోచనలో వున్నాను' అన్నారు విశ్వనాథంగారు —

'మేనేజర్ పెద్దగా నవ్వుతూ' ఏముందండీ యీ ప్రదలో చవుటు వూరే [illegible]ళ్లుతప్ప—ఐనా మీలాంటి రిటైర్డు పీపులుకు యీ వూరు బాగా సూట్ అవుతుంది' లెండి అన్నాడు—

విశ్వనాథంగారు కాస్త చిన్నబుచ్చుకుని 'నేను ఓ సెంటిమెంటల్ ఫూలును బాబూ'—అన్నాడు—అని సెలవు తీసుకుని బయటకు వచ్చాడు—

ఇందాక తనకు ఆ యిల్లంతా చూపించిన నౌకరు ఆయన వెంటపడ్డాడు— ఆయన కాసీకి వాడి జేబిలో ఓ పావులాపెట్టి ముందుకు సాగాడు.

ఆ యింటికి కొద్ది గజాల దూరంలో నాగేశ్వరస్వామి ఆలయం వుంది—ఆ రోజుల్లో రామమూర్తి శాస్త్రుర్లుగారి ప్రతిరోజూ సాయంత్రం పురాణ కాలక్షేపం జేసేవాడు. ప్రతిరోజూ తను విడువకుండా వెళ్లి వినేవాడు — రామాయణం — భారతము—భాగవతం—ఆయన ముఖతహా విన్నాడు - యింతవరకు మరచిపోలేదు—అంత చక్కగా చెప్పేవాడు—గొప్ప విద్వత్తుగలవాడు—డబ్బువంక కన్నెత్తి చూచేవాడు కాదు—

ఇక గుళ్లో పూజారి కృష్ణయ్య—అమిత నిష్ఠాపరుడు—బ్రహ్మవర్చస్సు ఎల్లా వుంటుందో చూడాలంటే ఆయన ముఖమే చూడాలి—ఆయన మంత్రించి విభూతి యిస్తే ఏ దుష్టగ్రహమయినా దూరంగా వుండేది—అమ్మవారి సహస్రనామ పూజ ఆయన చేస్తుండగా చూడాలి—ఒళ్లంతా కందిపోయేది—ఆయన తదేక దీక్షతో నామ నామమూ ఉచ్చైస్స్వరముతో ఉచ్చరించి పూజచేస్తుంటే వినే వాళ్ల శరీరాలు గగుర్పొడిచేవి — ఆ గుడికి డబ్బున్నవారు వచ్చేవారు—లేనివారు వచ్చేవారు— పళ్లెంలో డబ్బు వేసేవారు కొందరు—మానేవారు చాలమంది—ఐనా అందరినీ ఒకే విధ గా చూచేవాడు ఆయన.

ప్రతిరోజూ రెండు పూటలా స్వామి దర్శనం చేసుకుని అయ్యవారి విభూతీ, అమ్మవారి కుంకుమా పెట్టుకుని రావలసిందే—పరీక్షలకు వెళ్ళేముందు ఆ దేవుడికి నమస్కరించి వెళ్లవలసిందే—పరీక్ష ప్యాసవుతే ముందర అక్కడ కొబ్బరికాయ కొట్టవలసిందే.

ఆ రోజులే వేరు!

విశ్వనాధంగారు ఆ గుళ్ళోకి ప్రవేశించాడు. ఇప్పుడు కరెంటు వచ్చింది. ఆ ప్రాంగణంలో రామాలయం— సత్యనారాయణస్వామి ఆలయం వెలిసాయి. గర్భగుళ్లో ఎవరో కుర్రవాడు—పూజారి విధులు నిర్వర్తిస్తున్నాడు—ఆ కుర్రవాడి చూపు పళ్లెంలో పడే డబ్బులుపైనీ— ఇన్నాళ్లకు ఆ స్వామినీ, ఆ తల్లిని చూస్తే ఒళ్లు పులకించి పోయింది 'స్వామీ నిన్ను మరచి పోలేదు—వెతుక్కుంటూ వచ్చాను' అనుకుంటూ నమస్కరించాడు—నిన్ను మేమూ మర్చిపోలేదయ్యా అని వాళ్లు అన్నట్లు తనకు అనిపించింది.

గర్భగుడినుంచి వచ్చాక మండపంమీద కాసేపు కూర్చుని బయటికి వచ్చాడు—సాయంత్రం తన ఒకనాటి స్నేహితుల గురించి భోగట్టా చేయాలనుకుంటూ బజారుకువచ్చి—ఒక హోటలులో కాఫీ తాగుతామని వెళ్లాడు. ఒకప్పుడు—ఆ హోటలు చాల ప్రసిద్ధి వహించింది—ఆ వూరికంతా అదే పెద్ద హోటలు—ఆ వూరికి వచ్చిన ప్రతికవీ, రచయిత— ఆ హోటల్లో కాఫీ తాగకుండా వెళ్లేవారుకారు.

పెసరెట్టుతిని కాఫీ తాగుతూవుంటే—తనకి ఎదురుగా కూర్చున్న ఒక వ్యక్తి—దాదాపు తనయీడువాడే తన వంక పరిశీలనగా చూడడం గమనించారు విశ్వనాధంగారు—అతన్ని తనూ పోల్చుకోలేక పోతున్నాడు.

ఆ వ్యక్తి నవ్వుతూ 'మీ పేరు విశ్వనాధం కాదూ' అన్నాడు.

'అవునా! మరి...మీరు...?'

'నన్ను యింకా గుర్తుపట్టలేదా!...నేను వెంకటేశ్వర్లుని—సైన్సు మాష్టారు అప్పారావుగారి అబ్బాయిని'—అన్నాడు.

'ఓరి నువ్వా'

'ఆరి నీనీ' అంటూ—యిదేమిటి ఎప్పుడు—యీ వూళ్లో వూడిపడ్డావు...ఏం చేస్తున్నావు... అంటూ ప్రశ్నలవర్షం కురిపించాడు వెంకటేశ్వర్లు.

విశ్వనాధంగారు క్లుప్తంగా తన గురించి చెప్పుకున్నాడు.

బిల్లు వెంకటేశ్వర్లే చెల్లించి—సర్కిల్పేటలో వున్న తన యింటికి రమ్మని— భోజనంచేసి వెళ్లమని అడిగాడు— విశ్వనాధంగారు కాదనలేదు — రిక్షాలో వెళ్దామని వెంకటేశ్వర్లు అంటూవుంటే 'వద్దు వెంకటేశ్వర్లు—నడచి వెళ్దాం—ఇన్నేళ్లకి యీ వూరు వచ్చిన తర్వాత ఎంత నడిచినా తనివి తీరడం లేదు'—అన్నాడు.

దోవలో వెంకటేశ్వర్లు చెప్పినదంతా విన్నాక అతను ఎంత 'అదృష్టవంతుడో' విశ్వనాధానికి అర్థమయింది.

వెంకటేశ్వర్లు తండ్రి అప్పారావుగారు హిందూ హైస్కూలో టీచరు—ఇతనుకూడా అదే స్కూలులో టీచరుగా పనిచేసి రిటైరయ్యాడు—ఇప్పుడు ట్యుటోరియలు కాలేజి నడుపుతున్నాడు—తండ్రియిచ్చిన పెంకుటింటిని డాబా చేశాడు. పెద్దకొడుకుతన మాదిరిగానే బందరులో బియిడి ప్యాసయి టీచరు ఉద్యోగం చేస్తున్నాడు. రెండవవాడు యల్ఐసీలో అక్కడే వుద్యోగం మూడవవాడు కోపరేటివ్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. ఒక కూతురిని ఆ వూళ్లోనే యిచ్చాడు. అల్లుడు ప్లీడరు—రెండవ కూతురికి యింకా పెళ్లిచేయవలసిఉంది. ఇద్దరు కొడుకులకు పెళ్లి అయింది. అందరూ — అదే యింట్లో సమష్టిగా చూడముచ్చటగా జీవిస్తున్నరు — 'దూరదేశాలకుపోయి పెద్ద ఉద్యోగాలు చేయడంకన్నా, వున్న వూళ్లో చిన్న వుద్యోగాలు చేసుకుని- బంధుకోటి అంతా ఒకచోట వుండడంబోయి' అన్న వెంకటేశ్వర్లు మాటలలో విశ్వనాధంగారికి ఎంతో నిజమనిపించింది—

వెంకటేశ్వర్లుగారి యిల్లు చూస్తే ఎంతో ముచ్చట వేసింది—దొడ్డిలో ఎన్నో కూరగాయల మొక్క

లను పాదులను పెంచుతున్నాడు — పూల మొక్కలు వున్నాయి—పిల్లలు ఎంతో మర్యాద ఎరిగి ప్రవర్తించారు—నిజంగా వెంకటేశ్వర్లు చాల అదృష్టవంతుడు—

రెండో కూతురికి పెళ్లి సంబంధాలు చూస్తున్నాననీ, ఆ మధ్య భోపాలులో పని చేస్తున్న ఒక సంబంధం వచ్చిందనీ, వాని పిల్లను అంతదూరం యివ్వడానికి యిష్టంలేక—అన్నీ నచ్చినా ఆ సంబంధం వదలుకున్నాననీ, దగ్గరవూరి సంబంధాలకోసం ప్రయత్నిస్తున్నానని వెంకటేశ్వర్లు చెప్పినప్పుడు — తన కూతురు కటక్‌లో ఒరియా యంబీపైనలు యియరు స్టూడెంటును ప్రేమించింది—తను ఆ సంబంధానికి యిష్టపడడం వీడన్న సంగతి గుర్తుకు వచ్చింది—

భోజనాలు అయ్యాక విశ్వనాథంగారు తను వచ్చిన పని మళ్లీ చెప్పాడు—ఇల్లు కొందామని వుద్దేశంతో వున్నానని చెప్పాడు—ఆ మాటలు విని వెంకటేశ్వర్లు చాల సంతోషించాడు—'వున్నవాళ్లు ఈ వూరు విడచిపోతుంటే, ఎప్పుడో యీ వూరు విడచి వెళ్లిపోయిన నువ్వు యింత అభిమానంతో తిరిగి రావడం నాకు చాల సంతోషంగా వుంది. గౌడుగుపేటలో—మనకు తెలిసిన వాళ్ల యిల్లు ఒకటి అమ్మకానికుంది.వాళ్లంతా హైదరాబాదులో సెటిలయ్యారు. ఇక్కడ యిల్లమ్ముకుని, అక్కడ కట్టుకుందామనుకుంటున్నారు—అని చెప్పాడు. రెండు రోజులు వుండమనికూడ మరీ మరీ చెప్పాడు. సాయంత్రం ఆ యిల్లు చూచివద్దామని చెప్పాడు. అన్నిటికి విశ్వనాథంగారు అంగీకరించారు.

భోజనాలయి కాసేపు పడుకున్న తర్వాత నాలుగింటికి వెంకటేశ్వర్లు విశ్వనాథంగారిని ఆ యింటికి తీసుకువెళ్లాడు. ఇల్లు బాగానేవుంది. కాని ఖరీదే ఎక్కువనిపించింది—ఇరవై వేల రూపాయలట.

ఒకటి, రెండు భాగాలు అద్దె కివ్వవచ్చు. నువ్వూ మీ ఆవిడే కనుక మీకు ఓ వంటిల్లూ గది సరిపోతుంది — బజారుకూ, కాలేజీకి దగ్గర—అద్దెల వలన డెబ్బయి ఎనభయి రూపాయలు వస్తాయి అని ఆ యింటి గురించి చెప్పాడు వెంకటేశ్వర్లు.

'ధర ఎక్కువేమో' అంటే వెంకటేశ్వర్లు నవ్వి 'పిచ్చివాడా! ఇక్కడ స్థలం ఇరవై రూపాయలు వుంది. 500 గజాల స్థలం—పైన యీ మాదిరి యిల్లు యిప్పుడు కట్టించాలంటే కనీసం పదిహేను యిరవై వేలు అవుతుంది. మొన్న నీ మధ్య మా యింట్లో ఒక గోడ కట్టించేటప్పటికి వెయ్యి రూపాయిలయింది—' అని అంటూవుంటే నిజమే అనిపించింది.

వెంకటేశ్వర్లు ట్యూషను కుర్రవాళ్లు వచ్చే వేళయింది అని వెళ్లిపోయాడు—

విశ్వనాథంగారు కాసేపు అటూ యిటూ తిరిగి మరి కాసేపు పార్కులో కూర్చుని పాండురంగడి గుడికి వెళ్దామనుకుంటూ బయలుదేరాడు—

ఒక కొట్టులోంచి ఎవరో చప్పట్లు కొట్టి పిలుస్తుంటే అటు చూశాడు విశ్వనాథంగారు—ఎవరో ఒక స్థూలకాయుడు పిలుస్తున్నాడు—విశ్వనాథంగారు పోల్చుకున్నారు—అతని పేరు సుబ్బారాయుడు—చదువుకునే రోజుల్లో చాల అల్లరి పిల్లాడని పేరు—

ఇప్పుడు అతను పుస్తకాల షాపు నడుపుతున్నాడు—మామూలు భోగట్టాలు క్షేమ సమాచారాలు పూర్తి అయ్యాక విశ్వనాథంగారు తన ఉద్దేశా అని బయటపెట్టాడు—సుబ్బారాయుడు — కొట్టులో కుర్రాడికి రెండు కాఫీలు తీసుకు రమ్మని చెప్పాడు—

'విశ్వనాథం— నీ ఆలోచనలకు అడ్డు వస్తున్నానని అనుకోకు—ఈ వూళ్లో ఇల్లు కట్టుకుని వుండడం కన్నా—యింట్లో అద్దెకు వుండడం ఎక్కువ లాభం—ప్రతి సంవత్సరమూ రిపేర్లే ఈ వూళ్లో—వుప్పనేల అవడంతో చవుడు వూరుతూ వుంటుంది—ఈ వూళ్లో నువ్వు సెటిల్ అవాలనుకుంటున్నావు—మంచి ఆలోచనే—నలభయి ఏభయి రూపాయలలో మంచి పోర్షను వస్తుంది. నువ్వు యింటిమీద పెట్టే డబ్బు బిజినెసులో యిన్వెస్టుచేయి—మంచి లాభాలు వస్తాయి. నీకూ ఓ వ్యాపకం వుంటుంది' అన్నాడు.

'బిజినెసు వ్యవహారాలు నాకేమి తెలుసు—ఐనా ఏ బిజినెసులో యిన్వెస్టు చేయను? నాకన్నీ లైనులూ కొత్తే' అన్నారు విశ్వనాథంగారు.

'ఉద్దేశం ఉండాలేతప్ప—ఇన్వెస్టు చేయడానికి బిజినెస్సే దొరక్కపోతుందా?—మాట వరుసకి నాకు పెట్టుబడిపెట్టే పార్టనరేవుంటే — లాభాలు వేలు సంపాదించి యివ్వగలను—ఈ మధ్య హైద్రాబాదుకు వెళ్లాను—మా అమ్మాయి గారింటికి—వాళ్ల యింటి పక్కని పబ్లిక్ లైబ్రరీసు ఆఫీసులో పనిచేసే 'సీ పోజిషను'లోవున్న ఆఫీసరు వున్నాడు. నాలుగు పుస్తకాలు అచ్చువేయించండీ, స్టేటులోవున్న అన్నీ లైబ్రరీలచేత కొనిపిస్తా అన్నాడు. మా అబ్బాయి పేరు పడ్డ రచయిత—వాడి నవలలు వున్నాయి—వాడికి చాల మంది రైటర్ ఫ్రెండ్సు వున్నారు—వాళ్లు తమ నవలలు యిస్తారు—వీటన్నిటికీ మార్కెటులో మంచి వాల్యూవుంది. దీనికితోడు ఓ ప్రింటింగు ప్రెస్సు పెడ్తే మన పనీతప్ప బోలెడు జాబు వర్కు చేయచ్చు—నాకున్న కాంటాక్ట్సు అటువంటివి—నువ్వు పెట్టుబడి పెట్టు—నీ పెట్టుబడిమీద ఇంటరెస్టు—లాభంలో వాటా యిస్తాను'—అంటూ చిన్న సైజు ఉపన్యాసం యిచ్చాడు.

సుబ్బారాయుడు చెప్పేదాంట్లోనూ పాయింటు లేకపోలేదు అనిపించింది విశ్వనాథంగారికి.

'ఎంత పెట్టుబడి కావలసి వుంటుందేమిటి?' విశ్వనాథంగారు కుతూహలంగా అడిగాడు—

'పిండికొద్దీ రొట్టె— కనీసం ఇరవై వేలయినా వుంటే,' అని నసిగాడు సుబ్బారాయుడు—

ఈలోగా కుర్రాడు కాఫీ తెచ్చాడు—కాఫీ చప్పరిస్తూ విశ్వనాథంగారు షాపును పరికించి చూచాడు—బీరువాలు దాదాపు ఖాళీగా వున్నాయి—తను వున్న యింతసేపూ ఎవరూ కొట్లో అడుగుపెట్టిన పాపాన పోలేదు—

ఆలోచించి చెప్తానని బయటకు నడిచాడు విశ్వనాథం—

'రేపు వుంటావా?' అని అడిగాడు సుబ్బారాయుడు—

'వుంటాను—వెంకటేశ్వర్లు సాయంత్రం అక్కడికి వచ్చేయమని మరీ మరీ అడిగాడు—అంతయిదిగా చెప్పినప్పుడు మానడం దేనికిలే—అని అనుకుంటున్నాను.'

'వెంకటేశ్వర్లుగారితో — జాగ్రత్తగా వుండు,' అన్నాడు యధాలాపంగా

'అంటే అన్నాడు' విశ్వనాథంగారు ఆశ్చర్యంగా.

'మనుష్యుల స్వభావాలు—ఆలోచనలు—ముప్పది ఐదేళ్ల క్రితం ఎల్లా వుంటాయో—ఇప్పుడూ అల్లాగే వుంటాయని భ్రమ పడకు—సరే రేపు కలుస్తాను వెంకటేశ్వర్లు యింట్లో' అన్నాడు సుబ్బారాయుడు—

విశ్వనాథంగారు యింక వివరణలు కోరలేదు—

చిలకలవూడికి వెళ్లి పాండురంగడిని దర్శించి వెంకటేశ్వర్లు యింటికి రిక్షామీద వచ్చాడు—రిక్షావాడు పేచీపెట్టాడు. దురుసుగామాట్లాడాడు. ఈ వూళ్లో మనుష్యులు యింత పొగరుగా జవాబు యిస్తారని ఆయన వూహించలేకపోయాడు—

భోజనాల దగ్గర సుబ్బారాయుడి విషయం విశ్వనాథంగారు వెంకటేశ్వర్లు దగ్గర ప్రస్తావించాడు—వాడా వూరంతా అప్పులు, ఐ పి పెట్టడానికి సిద్ధంగా వున్నాడు—యిప్పటికి యిద్దరు ముగ్గుర్ని ఆర్పాడు—జాగత్త—అని వెంకటేశ్వర్లు హెచ్చరించాడు—

భోజనాలయి కాసేపు కబుర్లు చెప్పుకున్నాక వసారాలో మంచంవేస్తే దానిమీద పడుకున్నాడు—బాగానే నిద్రపట్టింది — ఒక రాత్రివేళ మెలకువ వచ్చింది—అప్పుడు పన్నెండున్నర దాటింది — పక్కగదిలో పడుకున్న వెంకటేశ్వర్లు అతని భార్య మాటలు నెమ్మదిగా నయినా స్పష్టంగానే వినిపిస్తున్నాయి—

'అదేమిటండీ — ఆ యింటికి చెడ్డపేరుంది — ఎవరూ అద్దెకు కూడా రాకపోవడంవల్లనే కదా—వాళ్లు ఏదో కాడిక అమ్మివేయా లనుకుంటున్నారు—పన్నెండు వేలు కూడా ఎవరూ యివ్వబోవడంలేదు—తెలియని వాళ్లని చూచి మరీ అంత ఎందుకు చెప్పారండీ?'—అంది ఆవిడ అమాయికంగా—

'హుష్—నోర్ముయ్యి—లేకపోతే అమ్మాయి పెళ్లి ఎల్లా అవుతుంది—వెర్రిముండాకొడుకు—ఈ వూరు మీద మోజుపడి వచ్చాడు—ఏముందీ వూళ్లో వాడి మొహం'—

ఎవరో కొరడా పుచ్చుకొని కొట్టినట్లని పించింది—

'తన పిచ్చి సెంటిమెంటును వీళ్లంతా ఎక్స్ప్లాయిటు చేస్తున్నారు.

పాలు పెరుగు ధర—ఏమంత తక్కువగా లేదనీ, అద్దెలు ఎక్కువగానే వున్నాయనీ, యిందాక మాటల సందర్భంలో తేలింది?

ఈ వూరిమీద ఎందుకు యింత అభిమానం చూపాలో తనకి యిప్పుడు అర్థం కావడం లేదు. వూరు అదే—కాని మనుష్యులు వేరు.

ఒరిస్సాలో తాను ముప్పది ఐదేళ్లు వున్నాడు. ఈ వూళ్లోకన్నా ఎక్కువ రోజులే వున్నాడు. ఐనా దాన్ని ఎందుకు తనదిగా భావించలేకపోయాడు. తన పూర్వులు అనగా తాత ముత్తాతలు బళ్లారిజిల్లాలో వుండేవారుట — వాళ్లు కన్నడం మాట్లాడేవారుట. క్రమంగా ఈ ప్రాంతానికివచ్చి యిక్కడ స్థిరపడి పోయారు తనకు కన్నడ భాషరాదు. తను కన్నడిగ అనికాక ఆంధ్రుడని భావించుకుంటున్నాడు. ఇప్పుడు తను ఒరిస్సాకి వెళ్లిపోయాడు. తన కొడుకులు మన వలు తాము ఆంధ్రులమనికాక, ఉత్కళులమనిభావించు కుని ఉత్కళదేశంపట్ల అభిమానం చూపవచ్చు—అందులో తప్పేముంది? అదీ యిదీకూడా భారత దేశమే—శాస్త్రి, శర్మ, రావు, మూర్తిల వంటివారే పాత్రో, పట్నాయక్, మహంతీలుకూడా...ఈ సత్యం చిన్నదయినా తన కూతురు గ్రహించింది. ఆమె, తెలుగు ఉత్కళ అనే భేదంలేక ఒక ఒరియా యువకుడిని పెళ్లి చేసుకుంటాననంటే తనెందుకు అడ్డు చెప్పాలి?

ఎప్పుడో ముప్పది ఐదేళ్ల క్రితం తమ సంబంధం కోల్పోయిన ఈ వూరితో తిరిగి 'సంబంధాలు పెట్టుకోవడం'కన్నా, 'మిత్రులు' అనబడేవారి వంచనకు గురి కావడంకన్నా-తను యిన్నేళ్లుగా నివసించిన ఆ ప్రాంతంలోనే స్థిరపడ్డమా, వ్యాపారం చేసుకోవడమూ మంచిది కాదా అనిపించింది—

భ్రమ తెరలు జారిపోయాయి—

మర్నాడు ఉదయం ఎనిమిదింటికే సుబ్బారాయుడు వచ్చాడు—ఇల్లు కొనుక్కోవడము మంచిదని వెంకటేశ్వర్లు వ్యాపారంలో యిన్వెస్టు చేయడం మంచిదని సుబ్బారాయుడు-నెమ్మదిగా వాదించుకోవడం ప్రారంభించి- 'చివరకు 'త్వం శుంఠా...అంటే త్వం శుంఠా' - అనే స్థాయిని జేరుకోబోతూవుండగా విశ్వనాథంగారే అన్నారు- 'వెంకటేశ్వర్లు — నీ కూతురి పెళ్లికి డబ్బు కావాలంటే నాతో చెప్పు ప్రయత్నిస్తాను. సుబ్బారాయుడూ అప్పులవాళ్ల బాధ తప్పించుకోవడానికి నీకు నేనేసహాయం చెయ్యమంటావు—నా ఎడ్రసు యిస్తాను వ్రాయండి-ఆ విషయం ఆలోచిస్తాను—ప్రస్తుతానికి ఈ వూరికి వచ్చే ఆలోచన మానుకున్నాను...అంటూ విశ్వనాథంగారు తన హేండు బ్యాగు పుచ్చుకుని విసవిసా బయటికి నడచిపోతుంటే 'డామిట్ కథ అడ్డం తిరిగింది' అన్నట్లు వెంకటేశ్వర్లు సుబ్బారాయుడు తెల్లబోయి ఆయన వెళ్లిన వంకే చూస్తూ నిలుచుండి పోయారు.

సహజా ఓ సహజా!

శ్రీ వి. మోహన ప్రసాద్

చండీ దాసొక
బిందువు లేని వృత్తం
అలా ఆకాశమంతా నిండి నిండీ
లయలో తరంగిత మవుతూ పరివ్యాప్తమై
శూన్యానికి ఆవలి పదార్థంగా దాక్కొని
తన నగ్నావయవాల్ని మబ్బుల చాటున
దిగులుగా చూచుకొంటూన్న భగ్నయోగి.

సౌందర్యం ఒక స్థితి
ఊటీలోని నిశ్చల సరో మధ్యాన వికలాంగుడై
వరుణుడు తెప్పజారి కాలి పుల్ల నీటిపై తేలియాడిన
చందాన ఆధునిక మానవుని మనః శకలం
నిద్రలో మంచం అంచుకి కొట్టుకొస్తుంది.
మాయ మాయగానైన సత్యమే
కాదా రామీ ఓ రామీ!
నవ్వారు పట్టీల సరస్త్రావ చిచ్చికొట్టిన అలలు
యమున ఒడ్డున ఇంకిన ఆశల ఆవిరులు కావా!

కాలానికీ అనంతానికీ
అక్షరానికీ ఓంకారానికీ
చిదంబరంలో రాజీచేసిన
శివుడు మన మొదటి హెడొనిస్ట్.

తావో
సహజ
సూఫీ
హిప్పీ
అన్నీ ఏమిటి రగుల్చు తున్నయ్!
ఈచ్ ఈజ్ బోతే అని
మెరిపీ
కురిసీ

రగిలీ పగిలీ చీలీ రక్తం కక్క
నటియించీ మువ్వలు ఎర్రని శబ్దాలతో రాలీ
నుదురువేయి వ్రక్కల య్యీ స్వేదం యింకీ
ఊగీ తాగీ తూలీ తేలీ పడబోతూ ఆనీ
విరిగీ ఎముకలు పుప్పొడి అయ్యీ అన్నీ
బిందువు నుంచి విలీనం అయి
క్షణ క్షణానికీ ప్రక్కలకి తప్పుకొని
సూర్య కిరణాలలోని గాలిలోకి
కాళ్ళూ చేతుల్తో మెలికలు పడి ఈది
చినుకు చినుకునీ తప్పించుకుని
అవర్ణిత సూక్ష్మ స్థలావర్తంలోని
శీతల ప్రేమ రాహిత్యాన్ని మోహంలోనో
చివరికి కామంతోనో రగిల్చి
భగ్నమన్న తర్వాత
కేంద్రం వృత్తమంతా జ్వలించి
విశ్వాత్మలో స్పేస్ సర్కిల్‌ని దహిస్తుంది.

ఇప్పటికే
భయద భ్రాంతయ్యి
రోమ్ లోనో కోపెన్ హాగన్ లోనో
బీరు గుండిగలో చచ్చిపడున్న బల్లిలా
మానవుడి అంతర ప్రవృత్తి
ఏ పూర్ణయోగం కోసమో
ఏ ఊర్ధ్వ మనోలోకాలకేసి చూస్తుంది
లెస్తూ!
మనసు తిరిగే మురికి వాడలు
ఆరోవిల్‌లు కావు పారీషియన్ విల్లాలూ కావు.
కోర్కెను తుంచుకొని
కాస్తంత అనుభవపు జాప్ఁ నంజుకొని
మళ్ళీ వీర్యోత్పత్తి వరకు
ప్రేమను అతి శరీరకంగా గానంచేసి
కాలాన్ని సుదూరానికి పరచిన తివాచీలా
వెళ్తున్న కొద్దీ తిట్టుకొంటూ చుట్టుకొంటూ
గుణించు కొంటూ గొణుక్కోవటమే
మనయోగి వే
మన భగ్నయోగం.

సహజా ఓ సహజా !

శైశవం లానే
చాలనం లానే
మానవుడి లీలావస్థ.
ఆకాశంలో నియోన్ జాజిమల్లికాంతి
విచ్చుకొంటూన్నా ఇకపై నెప్పుడూ చంద్రుడుండని
'డెజర్టెడ్ హోటెల్' చిత్రంలా
గోళాల గ్రహాల కక్ష్యల కాంతి కాలాల మిలీనియమ్‌ల
వాటి కనుపాపల నీలి కదలికలలో మునిగిన
సర్వ సముద్రాల పరీమళ జలాలపై లేచిన వీచికలలో
కలసిన ఒక్క నిట్టూర్పులో నిబిడమైన
విచిత్రాంతరంగ లీలావస్థ
ని
ఎవడైనా మానవు డెపుడైనా ఏమైనా అనుభూతి చెందితే
అదే భగ్నయోగం.
దొంగకు కొల్లగొట్టిన జాలి.
లీలా ఓ లీలా
మాయా ఓ మాయా
సహజా ఓ సహజా
రామీ ఓ రామీ

ఎల్లోరా గుహ కేంద్ర బిందువై
అర్ధనిమీలిత బుద్ధ నేత్రాలలోంచి కరుణ చింది
ఉబికి పొంగి ఉప్పెత్తున లేచి విశ్వమంతా నిండి
చిద్విలాస లాస్యమై జగత్తుని తట్టటం
ఇక జరగదు.
ఎవరు విన్నా రెవరు కన్నారు
ఆ ప్రశాంతిని !

అందాకా ఎందాకానో
లీలావస్థలో
తన్నుకొంటూ రక్కుకొంటూ చీల్చుకొంటూ
నిద్రలో పొర్లిపొర్లి ఏడుస్తూ
బావిలో వరలు వరలుగా కూలిపోతూ
చచ్చిపోతూ మరణ సుఖాన్ని పొందుతూ
మహాకావ్యం తగలడి ఒక్కొక్క అక్షరమే

భా ర తి

ఓంకారంగా గాలిలో బూదిలా విరుగుతూ
తప్త జలంలా చలిలోకి కాగుతూ ఉందాం.

వీణ తంత్రి మ్రోగి మ్రోగి
పటుక్కున తెగుతుంది.
శవం చెవిన ఫోన్
పదే పదే మ్రోగుతుంది.
యొరగాంబా నృత్య గేయాలు పాడుతూ
కుక్కని చంపి వొండుకు తింటాం.
పొట్టనిండా పాలు త్రావి బొజ్జున పాపాయిలాగా
వెన్నెల పందిరి కింద కాళ్లు బార్లా జాపి
హాయిగా చచ్చిపోదాం
బిందువే లేని వృత్తంగా
రావా రామీ ఓ రామీ
సహజా ఓ సహజా
లీలా ఓ లీలా
మాయా ఓ మాయా!
అందాకా ఓయి అనంతా
మేఘాల ఇడ్లీపిండి రుబ్బుతూండు ఆకసాన!!



పరివర్తన కలనము

డా. విశ్వనాథ అరుణాచలం

కలన గణితం (Calculus) లో ప్రమేయాల (Functions)ను చర్చించిన తరువాత, వాటి అవిచ్ఛిన్నత్వా (Continuity), అవకలనీయత్వా (Differentiability)లను చర్చించి, అవకలనీయత్వ ప్రయోగాలను తీసుకొంటాము. బహుముఖమైన ఈ ప్రయోగాల పరిచ్ఛేదంలో ప్రమేయాల గరిష్ఠ, కనిష్ఠ విలువలని కనుక్కోవటం ఒక ముఖ్యవిభాగం. వాస్తవ (Real) సంఖ్యల ఉపసమితి I, క్షేత్రం (Domain)గానూ వాస్తవ సంఖ్యాసమితి IR రేంజి గానూ, ఉండే ప్రమేయం f ను సూక్ష్మంగా f : I ——> IR, IC, IC IR అని వ్రాస్తాము. f ఏ ఏ విలువలవద్ద గరిష్ఠమౌతుందో, కనిష్ఠమౌతుందో తెలుసుకోవటం మన గణిత చర్చలలో అనేక సందర్భాలలో అవసరమౌతుంది. దాదాపు ఈలాంటి చర్చనే ప్రమేయకము (Functional) అనే గణితాంశాలకు అన్వయింప చేసినప్పుడు, మూడు శతాబ్దాల క్రితము, ఒకకొత్త గణితశాఖ పుట్టింది. అదే నేడుపరివర్తన కలనము (Calculus of Variations) అనే పేరుతో వ్యవహృతమౌతూ ఉంది.

ప్రమేయకము :

ఒకటో, పెక్కో వేరే చలరాశులమీద ఆధారపడిన ఇంకో చలరాశిని ప్రమేయకమంటాము. ఈ వేరే చలరాశులను స్వతంత్ర చలరాశులని ప్రమేయకాన్ని ఆధారిత చలరాశి అని స్థూలంగా వ్యవహరించుకొంటే, స్వతంత్ర చలరాశి ప్రమేయక సమితిలోని విలువలని తీసుకొంటూ, తదనుగుణంగా ప్రమేయకాన్ని మారుస్తూ ఉంటుంది. స్వతంత్ర చలరాశి (రాశులు) నిర్ణయమైనప్పుడు దానికి అన్వయించిన ప్రమేయకం గూడా నిర్ణయ మౌతుంది.

ప్రమేయక భావాన్ని ఇంకా విపులీకరించేందుకు సులభమైన ఉదాహరణలను తీసుకొందాము.

(i) చివరి బిందువులు ఉమ్మడిగా ఉండే కొన్ని సమతల వక్రాల దైర్ఘ్యములు :

ఉమ్మడి బిందువుల A, B లనుకొందాము. A, B లను కలిగిన ఒక సమతలాన్ని తీసుకొందాము. A నుండి B ని చేరేందుకు, ఈ సమతలంలో వ్యవస్థితమయ్యే వక్రాలు కొల్లలు. ఏదైనా ఒక వక్రాన్ని (అవిచ్ఛిన్నంగా ఉండవలె) తీసుకొంటే ఆ వక్రం సమీకరణంగా y=y (x) అనే ప్రమేయం మనకు తారసిల్లుతుంది. y=y (x) మీదుగా

A నుండి B కిదూరము

$$l[y(x)] = \int_{x_0}^{x_1} \sqrt{1+\left(\frac{dy}{dx}\right)^2}\, dx \quad (1)$$

అనే సమాకలనంవల్ల తెలుసుకోవచ్చు. కనక ఒక సమతలంలో వ్యవస్థితమయ్యే ఈలాంటి వక్రాలను ఎన్నో తీసుకొని, ఆయా వక్రాలను సూచించే ప్రమేయాల మీదుగా—ఒక్కొక్క వక్రానికి ఒక్కొక్క l [y(x)] విలువను కనుక్కుంటాము. నిర్వచనం ప్రకారం l [y(x)] ఒక ప్రమేయకము.

(ii) ఒక స్థిర సంవృత వక్రము మేఖలగా ఉండే వక్రతలాల వైశాల్యాలు :

యూక్లిడీయ—త్రిపరిమాణాత్మక అవకాశంలో C ఒక సంవృత వక్రము. C ని మేఖలగా కలిగిన వక్రతలాలు ఎన్నో ఉంటాయి. ఒక్కొక్క వక్రతలం సమీకరణాన్ని Z=Z (x, y) అనో, y=y (Z x) అనో, x=x (y, z) అనో తీసుకోవచ్చు. ఉదాహరణకు Z=Z (x, y) అని పేర్కొందాము. ఈ నిర్ణీతమైన వక్రతలంమీద విస్తృతమై C—మేఖలావృతమైన వక్రతల వైశాల్యం S [Z (x, y)] అందాము. ఇప్పుడు S [Z (x, y)] ఒక ప్రమేయకము.

(iii) ఒక నిరోధక మాధ్యమంలో (Resisting Medium) నిర్ణీతవేగంతో గమించే ఒక నౌక వస్తువు ఎదుర్కొనే నిరోధకబలం.

ఒక ఆకృతిగల వస్తువు కొంత వేగంతో ఒక మాధ్యమంలో గమించేటప్పుడు, మాధ్యమం వస్తువు గమనాన్ని నిరోధిస్తుంది (సాధారణంగా). ఈ నిరోధం R అనుకొందాము. R, వస్తువు ఆకారంమీద ఆధార పడి ఉంటుంది. ఆకారాలను ప్రమేయాల ద్వారా నిర్ణయిస్తాము కాబట్టి R, ప్రమేయాల మీద ఆధార పడిన ఒక ప్రమేయకము.

ఇట్లాంటి ప్రమేయకాలను తీసుకొని, అవి ఏఏ సందర్భాలలో గరిష్ఠ, కనిష్ఠ విలువలను పొందుతాయో చర్చించడమే పరివర్తన కలన ధ్యేయము. క్రీ. శ. 1696 నుంచి పరివర్తన కలనం ఒక ప్రత్యేక గణిత విభాగంగా పెంపొందడం ప్రారంభించింది. జోహాన్ బెర్నౌలీ (1667-1748) మొట్టమొదట గణిత శాస్త్రజ్ఞుల నుద్దేశించి ఒక సమస్యను ప్రతిపాదించినాడు. పరివర్తన కలన గణితానికి నాంది ఈ సమస్యలో కనబడుతుంది. తరువాత పీటర్స్‌బర్గ్ శాస్త్రీయ అకాడమీ (లెనిన్‌గ్రాడ్) సభ్యుడు, లియొనార్డ్ ఆయిలర్ (1707-83) కృషి ఫలితంగా ఈ గణితశాఖ స్వతంత్ర ప్రతిపత్తి గల్గిన పరిశోధనకు అస్కారం ఉండే ఒక విజ్ఞాన విభాగంగా రూపొందింది. ఇప్పుడు, పరివర్తన కలన గణిత పురోగమనంలో మైలురాళ్ళుగా కనిపించే మూడు సమస్యలను మనం పేర్కొందాము.

1 కనిష్ఠకాల సమస్య

(Brachisto chrone Problem)

సుప్రసిద్ధ గణితశాస్త్ర స్రష్టలకు ఆస్పదమైన బెర్నౌలీ కుటుంబంలో జన్మించిన జోహాన్ బెర్నౌలీ క్రీ. శ. 1696 లో ఒక సమస్యను ప్రకటించినాడని తెలుసు కొన్నాము. ఒక శీర్షరేఖ మీద లేని A B అనే రెండు బిందువుల్ని కలుపుతూ, శీర్షతలంలో ఉండే అనేక వక్రాల మీదుగా A నుంచి ఒక ద్రవ్యకణం B కి జారుతూ ఉన్నప్పుడు ఒక్కొక్క వక్రం మీదుగా ఒక్కొక్క కాలవ్యవధి తీసుకొంటుంది. ఏ వక్రంమీద గమిస్తే గమనకాలం కనిష్ఠమౌతుంది? సాధారణంగా A నుంచి B ని కలిపే అన్ని వక్రాల కంటే సరళరేఖ మీదుగా దూరం కనిష్ఠంగా ఉంటుంది కాబట్టి, ఈ పథంలో ద్రవ్యకణం జారితే కాలం కూడా కనిష్ఠంగా ఉండవచ్చుననే భ్రమ మనకు కలగటం సహజం. కాని సరళ రేఖాపథంలో కణం గమిస్తే అది తొందరగా జారదు. అందువల్ల గమనకాలం పెరుగుతుంది. A వద్ద ఎక్కువ వాలు (సరళరేఖకంటే) ఉండే వక్రం మీదుగా త్వరగా జారుతుంది. కనక అట్లాంటి వక్రాన్ని వెదకి, ఆ వక్రం చక్రజం (Cycloid) గా ఉండవలెనని జోహాన్ బెర్నౌలీ ధ్రువీకరించి నాడు. ఈ సమస్యనే స్వతంత్రంగా జాకబ్ బెర్నౌలీ (1654-1705), సర్ ఐజాక్ న్యూటన్ (1642-1727), డీ'లె' హాస్పితాల్ (1661-1704) ప్రభృతులు సాధించినారు.

(2) హ్రస్వతమ రేఖా సమస్య

(The Problem of Geodesic)

ఒక వక్రతలం తీసుకొందాము. ఈ తలాన్ని F (x, y, z)=0 అనే సమీకరణంచేత సూచిస్తాము. ఈ తలం మీద A, B లు రెండు బిందువులు. A, B లను కలుపుతూ, ఇదే తలం మీద ఉండే అనేక వక్రాలలో హ్రస్వంగా ఉండే వక్రరేఖను 'జియోడెసిక్' అంటాము. ఇట్లాంటి హ్రస్వతమరేఖా సమస్యల్ని సాధించటంలో ప్రమేయకాలను కొన్ని నియమాలకు కట్టుబరచి, కనిష్ఠ, గరిష్ఠ విలువలకోసం అన్వేషిస్తాము. మొట్టమొదట ఈలాంటి సమస్యల్ని, ఆయిలర్, జె. లెగ్రాంజ్ (1736-1813) చర్చించినట్లు గణిత చరిత్ర చెబుతోంది.

(3) సమకైవార సమస్య

(Isoperimetric Problem)

నిర్ణీతమైన కైవారము కలిగి ఒక సమతలంలో వ్యవస్థితమైన సంవృత వక్రాలు ఎన్నో ఉంటాయి. ఏ రూపంలో విస్తృతమైతే సంవృత వక్రము గరిష్ఠ వైశాల్యాన్ని పొదివి కొంటుందో చర్చించడమే సమకైవార సమస్య. సంవృత వక్రాల పొడవు స్థిరంగా ఉండవలెననే నియమాన్ని సమకైవార నియమమని వ్యవహరిస్తాము. ఈ కోవకు చెందిన సమస్యల్ని విపులంగా చర్చించిన ఖ్యాతి ఆయిలర్‌కు లభించింది.

ఆధునికంగా, వైశ్లేషికగతి శాస్త్రం (Analytical Dynamics) లో, ద్రవగతి శాస్త్రంలో (Fluid Macanics), రాకెట్ నిర్మాణ శాస్త్రంలో, ఆర్థిక శాస్త్రంలో... ప్రమేయక కలన పద్ధతులను విరివిగా వాడుతున్నారు.

చిరస్మరణీయులు – శ్రీ శంభూప్రసాద్‌గారు

శ్రీ టి. ఎల్. కాంతారావు

పుట్టిన ప్రతి వ్యక్తి మరణించక తప్పదనేది నిత్య సత్యం. అయితే మరణం అనేది ఒక భౌతికచర్య మాత్రమేనని మరణం తరువాత కూడా జీవించవచ్చునని అల్పసంఖ్యాకులైన మహానుభావులు మాత్రమే ఋజువు చేశారు. ఎవరి బ్రతుకైతే వారి మరణం తరువాత కూడా సమాజాన్ని నిరంతరం ప్రభావితం చేస్తూ ఉంటుందో వారు ప్రతి క్షణ స్మరణీయులు. కొంతమంది సమాజాన్ని రాజకీయంగా ప్రభావితం చెయ్యవచ్చు. కొంతమంది సంఘ సంస్కరణాభినివేశంతో సమాజాన్ని ప్రభావితం చెయ్యవచ్చు. మరి కొంతమంది సాహిత్యంతో, జర్నలిజంతో సమాజాన్ని ప్రభావితం చెయ్యవచ్చు. ఈ ప్రభావం అనేది తత్కాల సమాజ లక్షణంతోపాటు అంతరించేదయితే మరణించిన వ్యక్తి కొంతకాలం మాత్రమే సమాజ హృదయంలో జీవించగలడు. అలా కాక ఆ వ్యక్తియొక్క ప్రభావం అనంతర సమాజంలోకి కూడా చొచ్చుకుపోయి ఒక సంప్రదాయంగా విస్తరిల్లగలిగిననాడు ఆ వ్యక్తి ఏ రంగంలో అయితే తన ప్రభావాన్ని ప్రసరింప జేశాడో ఆ రంగం సజీవంగా ఉన్నంతకాలం మరణించిన ఆ వ్యక్తి కూడా శతానేకుల హృదయాల్లో నిత్యం జీవిస్తూనే ఉంటాడు. శ్రీ శంభూప్రసాద్‌గారు తెలుగుజాతికి అటు సాహిత్యపరంగాను, ఇటు జర్నలిజం పరంగాను అమితమైన సేవ చేసిన మహానుభావుడు. ఆయన భౌతికంగా అస్తమించి 8–6–73 నాటికి సంవత్సర మవుతుంది. ఆయన సంస్మరణే ఈ చిన్న వ్యాసం.

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు స్థాపించిన ఆంధ్రపత్రిక దినపత్రిక, వార పత్రిక, భారతి మాసపత్రికలను వారి అనంతరం శ్రీ శంభూప్రసాద్‌గారు తన సంపాదకత్వంలో దినదిన ప్రవర్ధమానం చేసిన విషయం సర్వులకూ తెలిసినదే. సంపాదకులుగా శంభూప్రసాద్‌గారి వ్యక్తిత్వాన్ని నేను యిక్కడ ప్రధానంగా చెప్పదల్చుకున్నాను. ఇటు సాహిత్యాభినివేశంలోగాని, అటు పత్రికా సంపాదకత్వ నిర్వహణా దక్షతలోకాని ఆయనకు ఉన్న శక్తిసామర్థ్యాలను ఏ ఆలోచనా పరుడూ శంకించలేడు. ప్రతి సంపాదకునికి కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలుంటాయి. ఈ అభిప్రాయాలను ఆయా పత్రికల స్వభావాన్నిబట్టి తెలివైన ప్రతిపఠకుడు సునాయాసంగా గ్రహించగలడు. శంభూప్రసాద్‌గారి వైయక్తికమైన అభిప్రాయాలను భారతి మాసపత్రికకు, ఆది వారం సారస్వతానుబంధానికి పోలికకన్న అంతరమే ఎక్కువగా ఉన్నట్లు శంభూప్రసాద్‌గారి కొన్ని ప్రస్తావనలనుబట్టి తెలుస్తుంది. సాహిత్యంమీద, సమాజ గమనంమీద ఆయనకున్న అభిప్రాయాలను ఎక్కువ ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలలోను, భారతి ప్రతి సంవత్సరారంభంలో స్వవిషయంలోనూ వ్యక్తం చేశారు. ఇలా వ్యక్తమయిన శంభూప్రసాద్‌గారి అభిప్రాయాలకు 'భారతి'కాని ఆంధ్రపత్రిక కాని కొంత వరకూ ప్రతిబింబమే అయినా పూర్తిగా మాత్రం కాదు. కారణం ఆయన రచయితయొక్క స్వాతం

త్ర్యాన్ని అపహరించక పోవడమే. ఇక్కడ రచన—రచయిత స్వాతంత్ర్యం అంటే కొంత వివరించవలసి ఉన్నది. కొన్ని కొన్ని పత్రికలకు కొన్ని కొన్ని విషయాలు మాత్రమే రాస్తే అచ్చు అవుతాయి అనే నమ్మకం ఈ నాడు ఎక్కువగా ఉన్నది. కారణ మేమంటే—అయా పత్రికా సంపాదకుల లేక అధిపతుల మనస్తత్వానికి ఆ పత్రిక సంపూర్ణ ప్రతిబింబం కావడమే. ఇలాంటి స్థలాల్లో రచయితకు విషయ పరంగా స్వాతంత్ర్యం ఉండదు. ఆ పత్రిక మూసలోనే రచయిత తన రచనను సాగించాలి. రచయిత ఒక పార్టీ సిద్ధాంతానికి నిబద్ధుడై ఉండటమంటే శంభూప్రసాద్‌గారికి ఇష్టం ఉండదు. అలా నిబద్ధుడై ఉండటంవలన అతని మేధస్సు వికసించడానికి బదులు ఒక పరిమిత పరిధిలో కుంచించుకుని పోతుందని ఆయన విశ్వాసం. 'సాహిత్యం రాజకీయాలకు ఆయుధం కావాలన్న వాదం ఒకటి ఇటీవల మరీ ప్రచలితం అవుతూ వస్తున్నది. సాహిత్యానికి మరణం ఇంతకంటె వేరే ఉండదు. ఎందుచేతననగా, ఏ రాజకీయానికి ఏ సాహిత్యం ఆయుధం కావాలి? రాజకీయం ఎప్పుడూ ఏకాకారంగా నిల్చిఉంటుందా? ఎప్పటికప్పుడు రాజకీయం మారుతూ ఉంటుంది అని అంగీకరించే పక్షంలో, సాహిత్యంలో శాశ్వత సత్తాకు స్థానం ఎక్కడనుంచి వస్తుంది? రాజకీయం సాహిత్యాంశమే అవుతుంది కాని సాహిత్య సమస్తం కాదు. ప్రకృతిని, ప్రకృతియొక్క వైవిధ్యాన్ని సాహిత్యపరుడు ద్రష్టయై అనుశీలనంచేసి ఆ ప్రకృతిలోని సార్వత్రైన ఋతాన్ని, ధర్మాన్ని చూచి, ఆవిష్కరించవలసి ఉంటుంది. అట్లా చేసే శక్తి గల్గినవారే రచయితలు నామవాచ్యు లవుతున్నారు. కాని వారు విపరీత సిద్ధాంతాలను సాహిత్య ప్రపంచంలో ప్రవేశపెట్టి సాహిత్యాన్ని పర్యాప్తము, పరిచితము చేస్తున్నారు. పరిమిత ధర్మాలకు అపరిమితమైన సాహిత్య భావమును కట్టివేయ జూడడం కోరి బానిసత్వాన్ని కొనితెచ్చుకోవడం వంటిదే అవుతుంది—అది శంభూప్రసాద్‌గారు పరీధావి సంవత్సరాది సంచికకు రాసిన ప్రస్తావనలో పైన నేను రాసిన అంశాన్నిగూర్చి వివరించారు ఆయన రాసిన పంక్తులలో సంపాదకునిగా ఆయనకున్న స్థిరమైన అభిప్రాయాలు బహిర్గతమయ్యాయి. అయితే ఆయన భావాలతో ఏకీభవించని అనేక రచనలు 'భారతి' 'ఆంధ్రపత్రిక'లలో మనం చూడగలుగుతాం. ఈ లక్షణం రచనలలో క్షీణత్వం అనుకున్నా, ఔన్నత్యం అనుకున్నా ఇక్కడ వెల్లడవుతున్న సత్యం మాత్రం ఒకటుంది. శంభూప్రసాద్‌గారు సాహిత్యం ఇలా ఉండాలి అని ఆశించారు. అంతేగాని రచయితయొక్క స్వకీయమైన భావనా స్వాతంత్ర్యాన్ని అరికట్టలేదు. రచయితకి, సంపాదకునికి మధ్య ఉండవలసిన సాన్నిహిత్యమే ఇది. రచయిత సంపాదకుని మనస్తత్వానికి ప్రతిబింబం కావాలని మేధావి అయిన సంపాదకుడు అంగీకరించడు. కాబట్టే శంభూప్రసాద్‌గారు వారి అభిప్రాయానికి లొంగని అనేక రచనల్ని 'భారతి'లో ఆంధ్రపత్రికలో ప్రచురించ గలిగారు. రచయిత ఒక భావానికి అంకితం అవుతాడు. ఆ భావం ఒక రాజకీయపార్టీ ప్రణాళికలో ఒక అంశం కావచ్చు. అంతమాత్రంలో ఆ రచయిత ఆ పార్టీ ఏజంటుగా వ్యవహరించవలసిన అవసరం ఉండదు. దీన్నే శంభూప్రసాద్‌గారు 'సాహిత్య రాజకీయాంశమే గాని రాజకీయ సమస్తం కాదన్నది' ఈ అభిప్రాయంలో ఏ రచయితకూ పేచీ ఉండనవసరం లేదు. అసలు రచయిత స్వాతంత్ర్యాన్ని శంభూప్రసాద్‌గారు ఎలా గౌరవించారో ఒక నిదర్శనం చెబుతాను. 'శాసనాలు మాత్రమే అచ్చేసే' పత్రికలని పరోక్షంగా భారతి తత్తుల్యమైన పత్రిక లేవైనా ఉంటే వాటిని దృష్టిలో పెట్టుకుని ఎవరైతే రాశారో వారి వ్యాసాలను, గేయాలను భారతిలోనూ ఆంధ్రపత్రిక ఉగాది సంచికల్లోనూ ప్రచురించారంటే అది ఆయనయొక్క మానసిక ఔన్నత్యానికి, రచయితయొక్క భావాన్ని గౌరవించడానికి తిరుగులేని నిదర్శనం.

శంభూప్రసాద్‌గారి దృక్పథం కేవలం సాహిత్యానికే పరిమితంకాక, అనేక ఇతర అంశాలపై కూడా కేంద్రీకృతమైంది. ఆయన శాస్త్ర విషయాలకు అధికప్రాధాన్యం ఇచ్చారు. రచనలంటే కేవలం సాహిత్య విషయమేనని మరి ఏ ఇతర విషయాలను

రచయితలు పట్టించుకోవడంలేదని ఇది ఎదుగుదల కాదని శంభూప్రసాద్ గారు అనేకసార్లు సంవత్సరాది ఆంధ్రపత్రిక ప్రస్తావనల్లో పేర్కొన్నారు. 'రాష్ట్రీయ విజ్ఞాన పరిపుష్టిలేని సాహిత్యరంగం మూఢవిశ్వాసాల మురికికూప మై జాతీయ పురోగమనానికి కాక తద్వినాశనానికి కారణ మవుతుంద'ని 1958 లో భారతి స్వవిషయంలో చెప్పేరు శంభూప్రసాద్‌గారు. విరోధి కృత్ ఉగాది సంచిక ప్రస్తావనలో ఆయన ఈనాటి సామాజిక స్థితిని విశ్లేషించిన పద్ధతి ఆయనయొక్క రాజకీయ పరిజ్ఞానానికి ప్రబల తార్కాణంగా నిలుస్తుంది. 'ఈ సంధిలో అభ్యుదయమూ, ప్రగతీ, మార్పూ—ఈ మాటలు ఎక్కువగా వినవస్తున్నాయి. మార్పు ప్రగతి అభ్యుదయం అంతా కోరుతూనే ఉన్నారు. కాని ఆ అభ్యుదయం ఫలానా పద్ధతిలోనే వస్తుంది అనడం ఎంతవరకూ ప్రజాస్వామ్య ధర్మవిగితమూ అన్నది ఆలోచించుకోవలసిన స్థితి ఉన్నది. ప్రజాస్వామ్యమంటే బహుభావాల పరస్పర సంఘర్షణం. ఏ భావమూ, ఏ భావాన్నిగాని దండించరాదు. దానికి స్వాతంత్ర్య కల్పన చేయడం— ప్రజాస్వామ్య ధర్మ ప్రపంచంలో ప్రాణభూతమైన విషయం. రాజ్యాలు లాగానే సిద్ధాంతాలూ నిలవవు. ఒకప్పుడు అభ్యుదయకర సిద్ధాంతం అనుకున్నది అనతికాలంలోనే అభివృద్ధికి ప్రతిబంధకమై భావస్వేచ్ఛకు నిర్బంధకమై వ్యక్తియొక్క ఆలోచనా స్వాతంత్ర్యానికి అవరోధకం అవుతూ ఉంటుంది...ఇది దేశంలో ఏర్పడిన శీల సంక్షోభంయొక్క లక్షణమా? ఒకటి చెబుతూ ఒకటిచేసే అధ్యాలోవ అపవాద లక్షణమా? వాగ్విడంబనమా. వాక్యాచరణము ఏకవాక్యత లేక పృథక్కరణం చెందినపుడు వ్యక్తికీ, వ్యక్తిత్వమునకు ప్రత్యాఖ్యానం సంభవించినపుడు, శీలసంక్షోభం ఆలోచనా వైక్లబ్యం సంభవించి రజ్జు సర్ప భ్రాంతివలె సత్యం అసత్యంవలె అసత్యం సత్యంవలె అవభాసించే స్థితి ఏర్పడుతోంది.' ఈ పంక్తులన్నీ వర్తమాన సమాజంలోని వైయక్తిక స్థితికి తార్కాణాలుగా నిలుస్తాయి. వారి మేధస్సు పదునైనది, బుద్ధి చురుకైనది కనుకనే పై విషయాలను విమర్శనాధికంగా విశ్లేషించారు.

శంభూప్రసాద్‌గారు ఘనీభవించిన సంప్రదాయ వాదికాదు. అరాచక ఆధునిక వాదికాదు. ఆయన మూర్తీభవించిన పాతక్రొత్తల మేలు కలయిక. అనవసరమనుకున్న పాతను ఆయన ఆదరించినదీలేదు. అవసరమనుకున్న ఆధునికతను తిరస్కరించినదీలేదు. 'పాశ్చాత్య విధానములను యథాతథములుగా స్వీకరించుట ఆరాధించుట ప్రమాదకరము. ఈ ప్రమాదమును తప్పించుకొనుటకు నూతన సాంఘిక దృక్పథము అవసరము. పురాణ యుగధర్మములను, వైదిక మతమును ప్రచారము చేయడమువల్ల దీనివి సాధించలేము' అన్న శంభూప్రసాద్‌గారి దృక్పథము విశాలమైనది.

శంభూప్రసాద్‌గారు ఎంత రాజకీయ విజ్ఞత కలిగినవారో అంత సారస్వతాభినివేశము కలవారు. ఆంధ్రపత్రిక వారపత్రికలో ఆయన రాసిన 'తెలుగు—వెలుగు'లు శీర్షిక ఆయన సాహిత్య సేవకు ప్రబల తార్కాణము. రాజకీయముగా ఆంధ్ర దినపత్రిక, వైజ్ఞానికముగా సారస్వతానుబంధము, కథ, నవల పరంగా ఆంధ్ర సచిత్ర వారపత్రిక, సాహిత్య పరంగా 'భారతి' సంవత్సరాది ఆంధ్రపత్రికలు దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారి తరువాత శంభూప్రసాద్ గారి చేతిలో సర్వాంగసుందరంగా తీర్చి దిద్దబడి తెలుగుజాతికి, తెలుగు దేశానికి మహోన్నతమైన సేవ చేశాయి. శంభూప్రసాద్‌గారి వారసత్వంలో ఎంతమంది రచయితలు, కవులు, విమర్శకులు వెలుగులోకి వచ్చారు. ఆ రచయితల హృదయాల్లో ఆయన ముద్ర చెరగనిది. తెలుగుభాష జీవించినంతకాలం, తెలుగు సాహిత్యం వికసించినంతకాలం శంభూప్రసాద్‌గారు జీవిస్తారు ఆయన చిరస్మరణీయుడు.

ఆధునిక భాషాశాస్త్రాభివృద్ధి

డా. బొడ్డుపల్లి పురుషోత్తం

1

అత్యంత ప్రాచీన కాలమున మానవులందఱు ఒకే భాషను మాట్లాడెడివారట! మానవులేకమై స్వర్గము నధిగమించుట కొఱక గొప్పగోపురమును నిర్మించుచుండుటనుగాంచి, పరమేశ్వరు డచ్చెరువంది, వారిలోగల ఐక్యమును చెడగొట్టి చిందరవందర చేయుటకై ఒకరి భాషణము నొకరికి అర్థము కాకుండునట్లు చేసెనట!! అంతటితో ఆ గోపుర నిర్మాణ మాగిపోయినది. ఎక్కడి వారక్కడనే వేఱుపడి పోయిరి. అందువలననే ప్రపంచమున విభిన్నభాష లేర్పడినవని యొకానొక విశ్వాసము. ఇది 'బాబెల్ గోపుర' కథ—బైబిలునందున్నది. కథాగత సత్యాసత్యము లట్లుంచి, భాషా సమస్య, తత్సంబంధమగు క్లిష్టతలు, చాల ప్రాచీన కాలము నుండియు నున్నట్లు దీనివలన విదితము కాకపోదు.

ప్రాచీన రాజుల కొలువు కూటములలో బహు భాషా కోవిదులు గలరు. వారనేక భాషల ననువదించుచు రాజులకు రాజకీయములందు తోడ్పడుచున్నట్లును నిదర్శనములు గలవు. రెండు మూడు భాషలలో వెలసిన ప్రాచీన శాసనములును అనేకములు గలవు.

భాషా విషయిక విశేషాసక్తిని గ్రీకు తాత్త్వికులు, భారతీయ సంస్కృత వైయాకరణులు ప్రదర్శించిరి. గ్రీకు తాత్త్వికులు 'భాష — దాని పుట్టుపూర్వోత్తరముల'ను గూర్చి చర్చలు గావించుచుండగా సంస్కృత వ్యాకర్తలు పదముల వ్యుత్పత్తి నిర్మాణములనుగూర్చి, క్రోడీకరణమునుగూర్చి విశేష శ్రద్ధ వహించి, పాణిని 'అష్టాధ్యాయి' సూత్ర నిర్మాణదక్షత యందు, శాస్త్రీయ సాంకేతిక నైపుణ్యములోను అసాధారణమై మానవ మేధానైశిత్యమునకు శాశ్వత చిహ్నమైనది.

గ్రీకు తాత్త్వికులు భాషోత్పత్తిని గూర్చి గావించిన చర్చలే ఆసక్తి జనకములై, అనంతర కాలమున సుదీర్ఘముగా సాగిన వాదోపవాదముల కాధారభూతములైనవి. భాష దైవప్రసాదమా? మానవ సంపాదితమా? అర్థమునకు శబ్దమునకు గల సంబంధ మెట్టిది? ఈ పదమున కీ యర్థ మనునది భాషా వ్యవహర్తల యంగీకారమునే కల్పినదా? లేక అదంతటదే యేర్పడినదా? మున్నగు ననేక సమస్యలు గ్రీకు తాత్త్వికులచే అహమహమికతో చర్చింపబడినవి.

భారతీయులు, గ్రీకులు స్వతంత్రముగ తమ తమ భాషలకు వ్యాకరణములను రచించిరి. గ్రీకులు నామములు, క్రియలు, విశేషణములు మున్నగు భాషా విభాగ నిరూపణమునందు శ్రద్ధ వహించిరి. భారతీయులు ప్రకృతి ప్రత్యయ విభజనమునందు, రూపసాధనమునందు శ్రద్ధ చూపిరి.

గ్రీకు వ్యాకరణ మొకనాటితో పూర్తి కాలేదు. తద్రచనకు కొన్ని శతాబ్దులు పట్టినది. అందలి అనేక లోపములను తరువాతి వారు సవరించిరి. ఈ రచన అంతకాలము పట్టుటకు కొన్ని కారణములు:— (i) మధ్యమధ్య తత్త్వశాస్త్ర, తర్కశాస్త్ర ప్రమేయ మధిక మగుట. (2) లక్ష్యములనుండి లక్షణమును ఏర్పఱచక, లక్షణమును ముందు పెట్టుకొని లక్ష్యముల నూహించుటలో విశేషాసక్తి చూపుట.

ఇట్లేర్పఱుపబడిన వ్యాకరణ విభాగములు శాశ్వతములని భావింపబడినవి. గ్రీకు వ్యాకరణము ననుపరించి, లాటిన్ మున్నగు భాషలకు వ్యాకరణము

లేర్పడినవి. ఒకేవిధమగు వ్యవస్థగల భాషల కొకే రీతి వ్యాకరణ రచన సరిపడునుగాని, భిన్న వ్యవస్థాత్మక మైన భాషల కొకే రీతి వ్యాకరణ రచన సరిపడదు. అట్టి రచనల మూలమున చాల ప్రమాదములు గూడ సంభవించును.

సంస్కృత వ్యాకరణాను సారముగా, తజ్జన్యము లగు ప్రాకృత భాషలకు వ్యాకరణ రచన లేర్పడుట సముచితమే కాని, తమిళ కర్ణాటాంధ్రాది భాషలకు సంస్కృత వ్యాకరణాను కరణముగా వ్యాకరణ రచన లేర్పడుట శోచనీయము. ఏలన ఈ భాషల వ్యవస్థ తద్భాషా వ్యవస్థకన్న భిన్నమైనది. ఈ రహస్యమును ద్రావిడభాషలపట్ల తొలుత గుర్తించినది కాల్డ్వెల్డ్ దొర. ద్రావిడ భాషలలోని విభక్తి విభజనమును సంస్కృత వ్యాకరణానుసారము కావించి, ద్రావిడ వైయాకరణులు తమ భాషా స్వభావమున కెంతో ద్రోహము కావించిరని కాల్డ్వెల్డ్ ఈ రీతిగా హెచ్చరించెను.

"Dravidian Grammarians have arranged the case system of their nouns in the Sanskrit order and in doing so, have done violence to the genius of their own Grammer (C.G.C. p. 277-Madras – 1956)"

"The imitation of Sanskrit in this particular was certainly an error; for whilst in Sanskrit, there are eight cases only, the number of cases in Tamil, Telugu, etc., is almost indefinite. Every postposition annexed to a noun Constitutes, properly Speaking, a new case: and therefore the number of such cases depends upon the requirements of the speaker and the different shades of meanig he wishes to express.' (I bid p. 254 ఇట్టి హెచ్చరికలింకను ననేకములు కలవు.

మొత్తముమీద ప్రాచీన భాషాభిజ్ఞులు తమ వ్యాక్రుతులను వర్ణనాత్మకముగా కాక, ఆ దేశాత్మకము కావించిరి. శిష్టోచ్చారణము నందలి విధానములను వర్ణించుటకు మారుగా, శబ్దోచ్చారణ రీతులను ఆదేశింప సాగిరి. భాషా పరిణామములను మేధావులు గుర్తించుచున్నను, అట్టివానిని గుర్తింపని వ్యాకరణ ములే అధ్యయనమునం దుండెడివి. ఏలన ఈ వికార ములు గ్రామ్యములని, పరిహరణీయములని వారి తలంపు.

రోమన్ సామ్రాజ్య పతనముతోపాటు, తద్భాషా వ్యాకరణములు కూడ తమ ప్రాధాన్యమును గోల్పోయి నవి. వ్యవహారమున భాషలు విపరీతముగా మార్పు చెందినవి. ఈ మార్పులు వ్రాతలోనికి కూడ నెగ బ్రాకినవి. నూతన రోమనుభాష లిట్టి పరిణామముల మూలమున నావిర్భవించినవే. దీనితో భాషా జగత్తున నూత్న చైతన్యము కల్గెను. ఏతత్ప్రభావము చేతనే లాటిన్‌భాషలోగూడ, 'ఇది తప్పు' 'ఇది ఒప్పు' అను విభాగరేఖ సన్నగిలినది. ఎంత సన్నగిలినను, కృతక మతాచార సంబంధియగు లాటిన్‌భాషకు, రోమాన్సు భాషలకు హస్తిమశకాంతరముండనే యున్నది. క్రీ. శ. 1100 వరకు ఆంగ్లో సాక్సన్‌భాషకు, లాటిన్ భాషకు వేఱు వేఱు వ్యాకరణము లేర్పడలేదు. రోమాన్సు భాషలకు ప్రత్యేక వ్యాకరణములు నెమ్మ దిగా నేర్పడ జొచ్చినవి.

ఆధునిక భాషా చైతన్యము పరిశీలన ప్రధా నముగా గలది. పరిచ్ఛేద, సమన్వయములవలన నది వర్ధిల్లెను. ఈ విధమగు చైతన్యము క్రీ శ. 400 నుండి 1100 లోపున లేదనియే చెప్పవచ్చును. బైబిల్ అను వాదములు, యాత్రోపయోగ పదసూచి కలు తప్ప భాషావిషయిక కృషి అన్యమేమియు జరుగ లేదు. స్వకీయ భాషావిశేషమతులైన గ్రీకులు, అన్య భాష లనాగరకములని త్రోసి పుచ్చిరి. రోమను లొక్క గ్రీకుభాషను దక్క, తక్కిన భాషలను గూర్చి ఆలో చింపరైరి. 'వెర్రో' అను రోమను శాబ్దికుడు, గ్రీకుకు, రోమన్ భాషకుగల సంబంధమును కొంత ఊహింపగల్గెను. కాని యాతని యితర నిర్ణయము లంతగా మెచ్చదగినవి కావు. అప్పటి కెవ్వరికిని చారి త్రక దృష్టి లేనే లేదన వచ్చును. గ్రీకు, లాటిన్, సంస్కృత భాషా వైయాకరణులు వర్ణనాత్మక

వ్యాకృతులను రచించిరి. అందనేకములు విశేషముగా ఆదేశాత్మమై (Prescriptive) ఆధునికుల మెప్పుకు పాత్రము కాలేదు.

2

క్రీ. శ. 1305 లో 'దాంతే' తన 'దేవల్‌గరి ఎలొక్వెన్షియా' (Develgari Eloquentia) అను గ్రంథమునందు ఆదర్శమగు ఇటాలియన్ భాషను అభివర్ణించెను. ఫ్రెంచి మున్నగు భాషలకు, ఇటాలియన్ భాషకుగల సంబంధము కూడ నిందు నిరూపితము. ఇటాలియన్ మాండలికములు కూడ నిందు చక్కగా నిరూపితములు.

మధ్యయుగమునందు 'విశ్వజనీన వ్యాకరణ నిర్మాణ' మొక్కటియే (Universal Grammer) చెప్పుకొనదగిన భాషా కృషిగా పరిగణింపవగును. ప్రాచీనుల కృషి కిది యొక రీతిగా పునరుద్ఘాటనమనియు పేర్కొన నగును. ప్రాచీనులు తమ భాషలే గొప్పవని; అవియే అధ్యయనార్హములని; వాని లక్షణముల తోనే యితర భాషలకును లక్షణము నేర్పాటు చేయవగునని తలపోసిరి. మధ్య యుగమునకుం జెందిన భాషాభిజ్ఞులును తత్తుల్యముగనే భావింప జొచ్చిరి. అయినను వీరు గ్రీకు లాటిన్ భాషలతోపాటు మఱి కొన్ని భాషలనుగూడ (అవి ఎంత తక్కువని భావింప బడుచున్నను) అధ్యయనము సేయ నారంభించిరి. ఇది గమనింపదగిన మార్పు. గ్రీకు, లాటిన్ భాషలకన్న భిన్నమగు భాషా నిర్మితిగల భాష లున్నవని; అట్టి వానికి భాషా వ్యాకరణములు సరిపడవని; గుర్తించు చాటువరకు 'విశ్వజనీన వ్యాకరణము' తన ప్రభావమును ప్రసరింపఁజేయుచునే యుండెను. ఇప్పటికిని దీని ప్రభావము ప్రచ్ఛన్నముగా మున్నట్లు పసిగట్ట వచ్చును. ఓలన ఆధునిక వర్ణనాత్మక భాషాశాస్త్రజ్ఞులు తమ రచనలలో సకల భాషానుకూల నియమముల నేర్పఱచుటలో విశేషాసక్తిని ప్రదర్శించు చున్నారు. ఆధునిక శాస్త్రీయ పద్ధతులతో నిట్టి వ్యాకరణ నిర్మాణమునకు ' హోర్ఫు' Whorf) అను శాస్త్రజ్ఞుడు ప్రయత్నించెను.

అన్యదేశములపై దండెత్తుటకు, నూత్న దేశముల నన్వేషించుటకు అన్యభాషా పరిశీలన మావశ్యకమాయెను. అమెరికన్ ఇండియన్ భాషలు, ఆఫ్రికన్ భాషలు అనేకములు వెలుగులోనికి వచ్చినవి. ప్రాచీన వ్యాకరణ పద్ధతులవే వీనికిని అన్వయింపజేయుటనగా గుండ్రని రంధ్రములోనికి చదరపు మేకును బలవంతముగా కొట్టినట్లేయుండును. ప్రాచీనములగు భాషలకు, నవీనముగా నన్వేషింపబడిన భాషలకు ఎప్పటి కప్పుడు వర్ణనాత్మక వ్యాకరణములు వెలువడ సాగినవి. భాషా విభజనమునుగూర్చి, భాషానుబంధములను గూర్చి, వివాదము లేర్పడ జొచ్చెను. భాషాప్రమాణములు, జాతులు, భాషా నిర్ణయము, మాండలికముల మున్నగు ననేకాంశములపై చర్చలు ప్రవర్తిల్లినవి.

పద్ధతులు లోపభూయిష్ఠ ములే యైనను, పరిశీలనము ప్రారంభమాయెను. నిత్యసత్యాన్వేషణ బుద్ధియీ యుగమున ప్రబుద్ధ మాయె ననవచ్చును. 18 వ శతాబ్ది అంతమువరకు ఈ విధమగు కృషి అవిరళముగా నుండెను. దీనివలన ఉత్తమోత్తమమగు ఫలితము సమకూరె నన జాలము. కాని ఏదో కొంత మేలు చేకూరక పోలేదు. భాష లేదో రీతిని వర్ణింపబడినవి. కొన్ని భాషలు బలవంతముగా ఇండో యూరోపియన్ భాషా కుటుంబమునందు చేర్చబడినవి. భాషా విభజనమునం దభివృద్ధి గోచరించును. అయినను అక్కడక్కడ దురూహలు, దూరపు టూహలు లేకపోలేదు. నిరాధారమగు ఊహలును కల్గకపోలేదు. విషయ సేకరణము చాలవరకు జరిగినది. చారిత్రక రచనల కనుకూలముగా భాషా పరిణామములు గుర్తింపబడినవి. భాషా శాస్త్రాభిరుచి, భాషాశాస్త్ర చైతన్యము ప్రవృద్ధమైనవి. కావలసిన దొక్కటే—నిర్దుష్ట శాస్త్రీయ పద్ధతి.

3

18 వ శతాబ్దాంతమునకు పూర్వమే సర్ విలియం జోన్సు, సంస్కృతమునకు, ప్రాచీన పర్షియన్ భాషకు, లాటిన్, గ్రీకు, కెల్టిక్, జర్మానిక్ భాషలతో గల సంబంధమును పాండితీ స్ఫోరకముగా ప్రపంచము

నను నిశదీకరించెను. ఇదియే తులనాత్మక భాషాధ్యయనమునకు నాందీ ప్రస్తావనమై, శతాధిక వర్షములు తన ప్రభావమును ప్రసరింప జేసినది.

తులనాత్మక భాషా పరిశీలనమును 'జోన్సు' సూచించినాడే కాని దాని నాతడు వ్యవస్థాపింపలేదు. ష్లెగెల్, రాస్క్, బాప్, గ్రిమ్, వెర్నర్ మున్నగువారు, ఈ పద్ధతి నధిగమించి, దీనిని శాస్త్రీయమొనర్చిరి. తొలుత నీ పద్ధతి చాల సామాన్యముగా నుండెను. ఇండో యూరోపియన్ భాషా శాఖలోనున్న భాషలలోగల సోదర పదములను సేకరించి, వానివాని ప్రాచీన రూపములను సాధించి, వానికిగల సదృశ విదృశ లక్షణముల నభివర్ణించుటే తులనాత్మక సద్ధతి. ప్రాచీన లాటిన్, సంస్కృతము, ప్రాచీన స్లావిక్, ప్రాచీన కెల్టిక్, మున్నగు భాషలన్నియు నొకే భాషా కుటుంబమునకు జెందినవని, వాని మాతృక యొకటేయను సిద్ధాంతము బలపడిన పిమ్మటే యీ తులనాత్మక భాషాశాస్త్రము స్థిరపడినది. ఇట్టి శాస్త్రీయ భాషా పరిశీలనమునకు మార్గదర్శకుడైన సర్ విలియం జోన్సు మిక్కిలి యభివందనీయుడు. లాటిన్ భాష మాతృకగాగల రొమాన్సు భాషలందును నీ విధముగు రచనలు వెలువడినవి. ఇండో యూరోపియన్ భాషలతో నెట్టి సంబంధమును లేనట్టివియు; సెమెటిక్ భాషా కుటుంబమునకు జెందినట్టివియు నగు అక్కడియన్, ఫొనీషియన్, హీబ్రూ, అరామెయిక్, అరబిక్ భాషలకును, నీ తులనాత్మక పద్ధతి ననుసరించి, వ్యాకృతులు వెలసినవి. కాల్డ్వెల్ మహాశయుడును నీ తరుణముననే దక్షిణ భారతీయ భాషలగు తమిళము, మలయాళము, కన్నడము, తెనుగు మున్నగు భాషలకు తులనాత్మక వ్యాకరణమును రచించి, ఈ ద్రావిడ భాషలకు, సంస్కృత ప్రాకృతములకు జన్యజనక సంబంధమున్నదను సాంప్రదాయిక విశ్వాసమును పటాపంచలు గావించెను. భాషా శాస్త్రవేత్తలనేకులీ ద్రావిడ భాషలపై నేడు కృషిసల్పి వీని ఏక కుటుంబకతను; ఈ కుటుంబములో గల ఉపకుటుంబములను, భాషా కూటములను నెలకొల్పిరి. అట్టివారిలో బర్రో, ఎమెనో, జ్యూవల్స్ బ్లాక్ (Jules Block) మున్నగువారు సుప్రసిద్ధులు. తెలుగు దేశములో కీ. శే. కోరాడ రామకృష్ణయ్యగారు, ఆ తరువాత ఆచార్య గంటి జోగి సోమయాజులుగారు ఈ సిద్ధాంతమునకు వ్యాప్తిని గల్గించిరి. అనంతర కాలములో ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు 'తెలుగు ధాతువుల'ను తమ సిద్ధాంత వ్యాసము మూలమునను, అనేక పరిశోధనా వ్యాసముల వలనను ద్రావిడ భాషా సంబంధమగు కృషిని పరాకాష్ఠ కెక్కించిరి. ఇది యట్లుండుగాక.

19 వ శతాబ్దమునందు వర్ణనాత్మక వ్యాకరణమున కంతగా ప్రాచుర్యము లేదు. చారిత్రక పరిశీలనమందే యానాటి వారు విశేషాసక్తిని ప్రకటించిరి. అన్ని భాష లొకే మాతృకనుండి యవతరించినవను మూఢవిశ్వాసము నశించినది. అన్నిభాషల కనువర్తించు 'విశ్వజనీన వ్యాకరణ' రచనా ప్రయత్నమును సన్నగిలెను.

ఈ శతాబ్దమందే భాషా శాస్త్రజ్ఞులకు క్రొత్త సవాలొకటి యెదురాయెను. ఈ సవాలు చేసినవారినే 'యువ భాషాశాస్త్రజ్ఞు' లందురు. (Neo-Grammarians) వీరు, ధ్వని సూత్రములకు (Phonetic Laws) అనేకాపవాదము లుండునను భాషా శాస్త్రజ్ఞుల వాదమును ఖండించుచు, ధ్వని సూత్రముల కపవాదములే లేవని సవాలు చేసిరి. ఈ సవాలు శాస్త్రజ్ఞులను విభ్రాంతుల నొనర్చెను. 'అపవాదము లేని నియమమే యుండద'ని గదా! (There is no rule without exception) లోకము నమ్మిక. దీనికి ప్రతిగా వీరు 'నియమమే లేని యపవాద ముండద'ను (There is no exception without a rule) వాదమును లేవనెత్తిరి. సామ్యము (Analogy) ఎరవు గొనుట (Loan) మున్నగునవి చోటు చేసికొనకుండనుండు మేరకు ధ్వని సూత్రములు నియతముగనే యుండునని అంద రంగీకరించిరి. అనగా అపవాదములుగా పరిగణింపబడుటకు గల కారణము లన్వేషింపబడవలయును; చరిత్ర నన్వేషింపవలయును. ఎరవు పదములవలనను నిట్టి యపవాదము లేర్పడ వచ్చును.

ఇందుల కొక్క ఉదాహరణము : తెనుగుభాషలో తాలవ్యాచ్చులతో గూడిన కకారము చకారమగును. దీనినే 'తాలవ్యీ కరణ మం'దురు. (The law of Palutizations) కాని యీ నియమమున కపవాదములుగా భ్రాంతి గొల్పు పదములనేకములు తెలుగులో నున్నవి. వాని నపవాదములని యెంచి, సూత్రమునకు శైథిల్యమును గల్గించుటకన్న, ఆయా పదముల చరిత్ర నన్వేషింపవలసి యున్నది. కన్నడమునందీ తాలవ్యీ కరణము లేదు. అందుచే నీ పదములు కొన్ని కన్నడమునుండి ఎరవు (Loan) తెచ్చుకొన్నవి కావచ్చును. కొన్ని 'తాలవ్యీ కరణము'నకు పూర్వమే 'వృత్తి'లో బద్ధమై యుండి యుండవచ్చును. ఒక్కొక్క పదము చరిత్ర నన్వేషింపవలసి యున్నది. 'ప్రతి పదమునకును స్వకీయ చరిత్ర గలద'ను నినాదము (Every word has it own history) సదా సంస్మరింప దగినది.

ఈ వివాదము మూలమున నొకమేలు చేకూరినది. అప్రమాణికములని, హేయములని పరిగణింపబడుచున్న మాండలికములకు పరిగణన మేర్పడెను. లిఖిత భాషా రూపములకన్న నిత్యవ్యవహారమందలి భాషా రూపములకే ప్రాధాన్య మేర్పడెను. ముఖాముఖి పరిశీలనమునకు విలువకల్గెను. వీనితో వర్ణనాత్మక భాషా శాఖ disriptive linguistics) యావిర్భవించెను.

20 వ శతాబ్దిలోనే 'భాషా పట సంపుటి' (atlas) వెలసినది. సరియైన వర్ణనాత్మక భాషా శాస్త్రము క్రీ. శ. 1916 లో 'దేససూస్రే' విరచితమగు 'సామాన్య భాషాశాస్త్రము'తో నారంభమైనది. ఈ గ్రంథము ఆయన అనంతరము ఆయన శిష్యులచే సంకలితమైనది. ఇందులో తులనాత్మక, వర్ణనాత్మక శాఖలు స్పష్టముగా వింగడింపబడినవి.

4

20 వ శతాబ్దమనగానే వినూతన భావావిర్భావము కల్గెనని భ్రాంతిచెందరాదు. 19 వ శతాబ్ది లక్షణములే కొంత కొనలు సాగినవి. 'ససూస్రే' విరచిత సామాన్య భాషాశాస్త్ర మావిర్భవించినమే, చారిత్రక భాషాశాస్త్ర కృషి ఆగిపోలేదు. ఇప్పటికిని ఆ రంగమున కృషి జరుగుచునే యున్నది. అయినను, ఎప్పటికప్పుడు, ఎక్కడి కక్కడి వర్ణనాత్మక భాషా శాస్త్రము చారిత్రక భాషా శాస్త్రముతో పోటీ వేయుచునే యున్నది. అడ్డు తగులుచునే యున్నది. తులనాత్మక భాషా పరిశోధనమునుండి యిపుడు విశేషముగా శాస్త్రజ్ఞులు వైయక్తిక భాషాభివర్ణనమునందు విశేషాసక్తిని ప్రదర్శించుచున్నారు.

అమెరికా ఖండమునందు అజ్ఞాతమునందున్న అమెరికన్ ఇండియన్ భాషల నభివర్ణించు ఉద్యమము ముమ్మరము కాజొచ్చెను. దీనితోనే వర్ణనాత్మక భాషాశాస్త్రము కూడ ప్రాముఖ్యమునందుకొన్నది. ఈ భాషా శాస్త్రమునకు జీవము 'క్షేత్ర కృషి' (Field work) భాషా వ్యవహర్తలతో ప్రత్యక్ష సంబంధము నేర్పఱచుకొని, వారి ముఖతః వెలువడిన భాషను వ్యాకరించి వర్ణ నిర్ణయము, పదపదాంశ నిరూపణము, వాక్య స్వరూప స్వభావ పరిశీలనము కావించుట ఈ శాస్త్రమునకు ప్రధానాంగము లయినవి. ఈ రీతి కృషికి మార్గదర్శకులలో ముఖ్యులు బొజ్, సఫీర్, బ్లూమ్‌ఫీల్డు మున్నగువారు. వీరారంభించిన కృషిని తుదిముట్టించుటకే వీరి శిష్యులు అనుయాయులైన భాషా శాస్త్రజ్ఞులు అవిరామముగా పరిశ్రమించుచున్నారు.

ఐరోపియన్ దేశములలోను వర్ణనాత్మక భాషా శాస్త్రము విస్తృతి గాంచినది. కాని ఆ ఖండమునందు విశేషముగా సిద్ధాంతములేకాని, ప్రత్యక్షకృషితో ముడివడిన శాస్త్ర రచనలు మృగ్యములు. అవి యొక రీతిగా తాత్త్విక పరిశీలనములు. ఈ విధమగు పరిశీలనములకు మార్గదర్శకుడు 'ఎస్పర్సన్' (Jesperson) 'సంశ్లేషాత్మక స్థితినుండి విశ్లేషాత్మక స్థితిలోనికి పర్యవసించుటయే భాషా పరిణామము' అనురీతిని కొన్ని సిద్ధాంతముల నీ భాషా శాస్త్రజ్ఞుడు ప్రతిపాదించెను. సాంప్రదాయికమగు వ్యాకరణములను విమర్శించి, విప్లవాత్మకమగు ఆలోచన అను నీతడు తన రచనల మూలమున ప్రేరేపెను.

'ప్లేగ్ భాషాభిజ్ఞులు' విశేషముగా నిర్మాణ

వాదులు. (Structuralists) 'కోపెన్‌హాగెన్ భాషా శాస్త్రజ్ఞులు' భాషా పరిణామములను బీజ గణిత పద్ధతిని నిరూపించుటకు కృషిగావించు చున్నారు. 'సోవియట్ భాషా శాస్త్రజ్ఞుడు యన్. వై. మార్ భాషనుబట్టి వర్గ నిర్ణయమును గావించు రీతులకై యత్నించు చున్నారు.

చారిత్రక భాషా శాస్త్రమునకు 19 వ శతాబ్ద మందున్నంత ప్రాముఖ్యము సన్నగిలినను, పూర్తిగా నిద్రాణమై యున్నదని భావింపరాదు. చారిత్రక పరిశోధనములు ఐరోపాలోను, అమెరికా లోను, కొనసాగింపబడుచునే యున్నవి. చారిత్రక విషయములనుగూడ వర్ణనాత్మకముగా జెప్పు పద్ధతి ప్రబలినది.

ఆధునిక కాలమందు భాషల ప్రాముఖ్యము విస్మరింపరానిది. మొన్న మొన్నటిదాక భాషల స్థితి చాల హీనముగానున్న అమెరికా ఖండమునందు, నేడు భాషాధ్యయనము విశేష ప్రాముఖ్యము నందుకొన్నది. భాషాధ్యయనముతో పాటు భాషాశాస్త్రముగూడ వృద్ధి కాగలదు.

ప్రకృతము, వర్ణనాత్మక భాషా శాస్త్రమే ప్రబలమైనది. ఎట్టి విశేషణమును జేర్చక 'భాషా శాస్త్రము' అనగా 'వర్ణనాత్మక'మనియే గ్రహింప నగును. భాషాధ్యయనమునకు వర్ణనాత్మక భాషాశాస్త్రమే పునాది. 'ధ్వని విజ్ఞానము' (Phonetics) నందును, 'వర్ణ విజ్ఞానము'నందును (Phonemics) వర్ణ నాత్మకముగా ఎంతో పరిశ్రమ జరిగినది. కాని 'పదాంశ విజ్ఞానము' Morphology నందును, 'వాక్య విజ్ఞానము' (Syntax) నందును సమగ్రమగు కృషి జరిగినగాని యీ శాస్త్రము మరింత పుష్టి మంతముకాదు. ఇంకను నీ శాస్త్రమునకు ప్రామా ణిక పారిభాషిక పదకోశము సిద్ధము కాలేదు. ఎవరికి తోచినట్లుగా వారు పారిభాషిక పదముల నుపయో గించుచున్నారు. ఏ శాస్త్రమునకైన నివియే జీవగఱ్ఱ.

ఇపుడు ముఖ్యముగా ప్రముఖ భాషలలో పదజాతమును (vocabulary) గూర్చిన సశాస్త్రీయ సంశోధనము జరుగవలయును. స్వ, పర పదజాత శాతము నిర్ణయింపబడవలయును. చారిత్రక భాషా శాస్త్రమునకు, చరిత్రకుగల సంబంధము నిరూ పితము కావలయును. ఏ చారిత్రక పరిణామము లాధా రముగా భాషాపరిణామములు కల్గెనో నిర్ణయించుట సాధారణమగు పనియని తలంపరాదు.

'భౌమిక భాషాశాస్త్రము' (Geolinguistics) ఇంకను అభివృద్ధి చెందవలసియున్నది. ఏయే భూభా గములయందే యే భాషలు వ్యాపించినవి వానికిగల రాజకీయ, సాంఘిక సాంస్కృతిక ప్రతిపత్తియెట్టిది? అవి పరిసర భాషలపై ఎంతటి ప్రభావమును గల్గి యున్నవి? పరిసర భాషలపై ఎట్లు ప్రభావిత మైనవి? ఈ మున్నగుననేకాంశములను శాస్త్రీయ ముగా నిరూపించునదియే భౌమిక భాషాశాస్త్రము. (Geolinguistics) అనేక చారిత్రక పరిణామము లాధారముగా ప్రస్తుత భాషా స్థితిగతులిందు నిర్ణ యింపబడునుగాన చారిత్రక భాషా శాస్త్రముతో దీని కధిక ప్రమేయ ముండును. ప్రస్తుత పరిస్థితులను గూడ నిది యభివర్ణించునుగాన వర్ణనాత్మక భాషా శాస్త్రమునకును, దీనికిని సంబంధ ముండకపోదు. సాంఘిక చరిత్రతోడను, చరిత్రతోడను, దీనికి సంబంధమని వార్యము.

భౌతిక శాస్త్ర సిద్ధాంతముల నాచరణ యోగ్యము గావించుటలో 'ఇంజనీరింగ్' వలెను; శారీరక శాస్త్రమునకు వైద్యశాస్త్రము రీతిగను, భాషాశాస్త్రమునందాచరణ యోగ్యమగు పద్ధతులను పరిశీలించి తెలుపు శాస్త్రమే 'భౌతిక' భాషా శాస్త్రము' వర్ణనాత్మక, చారిత్రక, తులనాత్మక భాషా శాస్త్రములు, ఆరితేరిన పండితులకే ఆసక్తి జనకముకాగా, భౌమిక భాషా శాస్త్రము ప్రపంచమున పర్యటించి, విదేశీయులతో సంబంధములను పెంపొం దించుకొని, ప్రపంచ స్థితిగతులను అవగాహన మొనర్చుకొననెంచిన ఆధునిక పౌరుల కందరకు అత్యావసరమైనది.

కాకతీయులు - దేవత?

శ్రీ జి. ఆర్. వర్మ

రాష్ట్రకూట ముమ్మడి కృష్ణమహారాజ సేనాని రాష్ట్రకూట కాకర్త్య గుండన. కృష్ణమహా రాజాదేశించగా నీతడు వేంగీ సింహాసనాధిపత్యమునకు జరిగిన దాయాదుల యుద్ధములలో పాల్గొనెను. గుండన వేంగీ రాజరాజు పితామహుడైన దానార్ణవునకు దోడ్పడిన యాతనిచే మాంగల్లు గ్రామమును (క్రీ. శ. 955) దొమ్మనశర్మ కగ్రహారముగా నిప్పించెను.

తెలుగునాట చారిత్రకముగా తొలి కాకతీయుడీ గుండన. గుండనపేరు నాటికి పూర్వము నుండీ కర్ణాటకమునదిగా నున్నది. పండితులు కతిపయ కాలమున గుండన శబ్దమును గీర్వాణించి గుణ, గుణార్ణవ చేసియుందురు.

వరంగల్ జిల్లా మహబూబాబాద — మానుకోట—కొలని. కృష్ణా, నల్గొండ జిల్లా భాగములు కొంత నాటి నతవాడి.

కొలని—నతవాటి గాథలందున్న కాకర్త్య గుండన, మాంగల్లు శాసనమందున్న రాష్ట్రకూట కాకర్త్య గుండన ఒకడేనట.

తెలుగునాట కాకతీయుల తొలి రాజధాని కొలని—యనిరి. అది ముదిగొండ చాళుక్య రాజ్యము. రాష్ట్రకూట సామంతుడు ఒకానొక తైలపుడు ఆక్రమించుకొని స్థాపించినది ముదిగొండ చాళుక్యరాజ్యము.

తైలపుని సేనానులలో ఒకానొక కాకలిక నామధేయు డుండెనట.

కాకలికుడు, కాకర్త్య గుండనా, రాష్ట్రకూట కాకర్త్య గుండన ఒకరేననే పరిశోధకాభిప్రాయముతో కొలని నాక్రమించి తెలుగునాట ప్రప్రథమముగా కాకతీయ రాజ్యము స్థాపించినదీ కాకర్త్య గుండనగా గుర్తింపబడెను.

నల్గొండజిల్లా, గూడూరు (గుముడూరు) శాసనము ఏనాటిదో నిర్ణయింపబడలేదు. ఈ కామమసాని (స్వామిని) శాసన విషయములు దుర్జయాన్వయ కుల వంశీయుడైన విరియాల ఎఱ్ఱనరేంద్రుడు 'బొట్టుబేత వసుధాధిపు జేకొని వానివైరిని ఉద్ధతమున జంపియకొరవి దేశమునఁ బ్రతిష్ఠసేసి'న సంఘటన కొరవి నాక్రమించిన కాకర్త్యగుండనను సంహరించి ముదిగొండ చాళుక్య వంశాకురమైన కుమార బేతర్సును పదస్థునిజేసి, పసివానికి ప్రతినిధిగా తాను కొరవి నేలెనని పరిశోధకాభిప్రాయము.

ఇదే శాసనమున మరొక సంఘటన యున్నది. 'బేతభూవిభుని కాకతి నిల్పుట గొటిసేయుదే'.

బేతనామధేయు లిద్దరు, ఒకరిని కొలని సింహాసనమున ప్రతిష్ఠించి మరొకరిని కాకతి నిల్పెను.

ఈ ఎఱ్ఱరాజు దర్శించిన 'పల్లవరాయడు' కల్యాణి చాళుక్య చక్రవర్తి గానోపును. పల్లవ శబ్దార్థములనేకము. కన్నడ హొళబ పల్లవకు చేరునై యుండును.

'భారతి' ప్రచురించిన శ్రీ వరబ్రహ్మశాస్త్రి గారి పనిగారపు శాసన చర్చా వ్యాసములు కామమ్మసాని గూడూరు శాసనమును సుబోధకము చేసెను.

ఈ లెఖను గుముడూరు శాసనము - ఎఱ్ఱరాజు పదస్థుల జేసినది కొరవి ముదిగొండ చాళుక్య బేతరాజు, కాకతి గరుడ బేతరాజు. ఒకనిని 'కొరవి దేశమున ప్రతిష్ఠించె'ను. మరొకనిని 'కాకతి' నిల్పెను.

కాబట్టి కొరవి కాకతి దగ్గరి రాజ్యాలనిపించును. కాని అది సరిగాదు.

మందుల కంపెనీ ఏజంటుగాను, 'ఆంధ్రపత్రి'కకు నాటి హైదరాబాదు రాష్ట్రప్రతినిధిగా తెలంగాణా ప్రయాణముల్లో కాకతి అనే గ్రామమున్నట్లు విని పించలేదు; కనిపించలేదు.

శ్రీ పర్బ్రహ్మశాస్త్రిగారి వ్యాసములందున్న కన్నడ శాసనము (క్రీ శ. 1053) న పేర్కొన బడిన 'శ్రీ మన్మహాసామంత కాకతీయ పొఅ లరస' మొదటి ప్రోలరాజు.

'బేత భూావిభుని కాకతి నిల్పుట 'యను లో కాకతీయ బేతరాజునుగూడ పదస్తుని జేసియుండుట గావచ్చు కాని కాకతి రాజ్యమున గాదనిపించును.

గూడూరు శాసనములో 'కాకతి నిల్పుట' కాకతిరాజ్య మిప్పించుటయేగాక కాకర్త్య—కాకతీయ, కాకతి పురాధీశ్వరులలో నొకనికి (గరుడబేత) ముడి కేశ్వరత, అన్మకొండ నిప్పించుట యనదగును. కాక తీయ వంశాంకురమును నిల్పెననదగును.

రాష్ట్రకూట గుండ్యన పౌత్రుడూ, ఎఱియ రాష్ట్రకూటుని పుత్రుడైన రాష్ట్రకూట కాకర్త్య గుండ్యన రాష్ట్రకూట కృష్ణరాజ సేనానిగా నున్నప్పుడు కాకతి మండలేశ్వరుడై యుండెనేమో— ఆ మండలేశ్వరత వలననే తండ్రి, తాతలకు కాని కాకర్త్య ఈతని పేరున చేరియుండును. రాష్ట్ర కూట కాకర్త్య గుండ్యన ఏ కారణమున కాకతి మండ లేశ్వరత వదలెనో తెలియదు. కల్యాణి చాళుక్య విజృం భణ. తెలుగునాట స్థిరపడ నెంచె ననవచ్చును.

కరీంనగరు జిల్లా శనిగారపు శాసనములు ప్రక టితము గాక పూర్వము కాకతీయుల పురాతన శాసన ముగా భావింపబడినది. కాజీపేట దర్గా (క్రీ. శ. 1090) ఇమ్మడి బేతరాజు శాసనము.

కాజీపేట దర్గా శాసనమున 'సామన్తో విష్టి వంశః శ్రీ మాన్కాకతి పురాధినాథో బేతః' అని యున్నది.

క్రీ. శ. 955 నాటి మాంగల్లు శాసనమందలి 'కాకర్త్య', క్రీ. శ. 1053 నాటి శనిగారపు కన్నడ శాసనమున 'కాకతియ'గానుండి క్రీ. శ. 1090 నాటి కాజీపేట దర్గా శాసనము నాటికి 'కాకతి పురాధి నాథ'గా మారుట కాకతీయులు కాకతి రాజధానిగా మండలముగా పాలించుటచే కాకతీయు లనబడిరను విషయమునే బలపర్చును.

ఈ మూడు శాసనాలబట్టి, చివరిదానిలో విష్టి వంశమని చెప్పుకొన్నందున కుల, వంశనామము కాకతి గాదనే నిర్ధారణ యగుచున్నది.

అర్మకొండమే కాకతి యనే చరిత్రగాని, జనాభి ప్రాయముగాని, పరిశోధక నిర్ణయముగాని లేదు.

తెలుగునాట దుర్జయ కుల/వంశీయుల మన్న వారనేకు లుండిరి. తెలంగాణా శాసనములందు కాక తీయ సామన్త బంధు సేనానులు దుర్జయాన్వయుల మనిరి. కాకతీయులు గూడ దుర్జయాన్వయులుగా ప్రస్తుతింపబడిరి. ఐతే కాకతీయులు దప్ప ఇతర దుర్జయాన్వయులు కాకతి పురీశ్వరుల మనలేదు.

దుర్జయ శబ్దము బిరుద వాచకముగా నేర్పడి (అజేయ) ధైర్యమ్యందు నేగాని కుల/వర్ణ/ వంశ నామ మనిపించదు. కాని (కుల) వృత్తి వ్యవస్థగా నుండి యున్న యౌధేయులు, ఆయుధోపజీవులు యనదగును.

'సామన్త విష్టి వంశము' భిన్న మండలేశ్వరత సూచించునేమో తెలియదు. పరిశోధకు లెవరికి తోచిన యర్థములు వారిచ్చిరి. డాక్టర్ పుట్టపర్తి శ్రీనివాసా చారిగారు అదొక జీవన విధాన వ్యవస్థ యనుటలో విధిగా రాజును సేవించువారిగా గుర్తించిరి.

అనేక దేశములలో బహుపురాతన కాలమునుండి స్థిర, చరాస్తులన్నీ రాజులవిగా నుండెను కాని రాజసేవలో (పరిపాలనాది) నున్న వారందరు ఫల సాయము ననుభవించే పద్ధతిగా (తాత్కాలికపు హక్కు) యుండెను. రాజు భాగము (పన్ను) రాజునకిచ్చి మిగత ఫలసాయము అనుభవించే పద్ధతి. అదొక భూస్వామ్య వ్యవస్థగా మారెను. ఆ వ్యవస్థకు చెందినవారు రాజు

సేవలో వివిధ పదవుల్లో ఉన్నను. రాజు కవసరమైనప్పుడు యుద్ధములందు, దండయాత్రలందు అవసరమైన సైనికులనే గాదు సాధన సంపత్తి కల్గించే కట్టుడి. ఇదే కౌట (టి) ల్యుని 'అర్థశాస్త్ర'ము నాటి కాంభోజాది వార్తా శస్త్రోప జీవన వ్యవస్థ. రాష్ట్రకూటులు గూడ ఈ వ్యవస్థకు చెందిన వారైయ్యుందురు.

రాష్ట్రకూట, సామంత విష్టివంశ - వ్యవస్థ అధిరాజు సేతన కేర్పడినదై యుండును. అట్లైతే విష్టివంశము వారిది తప్పనిసరి సేవ, దుర్జయులు, ఆయుధోప జీవనము.

రాష్ట్రకూట యన చిన్నసామంతుడనే వ్యవహారార్థమున్నట్లే విష్టివంశమున కట్టి యర్థమున్నదేమో.

'విష్టి'కి 'వెట్టి'కి ఏమైన సంబంధమున్నదేమో సంశోధనీయమే. నేటి రెవెన్యూ గ్రామ పాలనలో వెట్టి, తలారి కేవలము కరణం, మునసబుల క్రింద గ్రామనౌకరులుగా నున్నారు. వారికి మాన్యము లుండెను.

తెలంగాణాలో 'వెట్టి' ఉందట. వెట్టి, ఒరిస్సా 'గోతిక', రాజస్థాన్ 'స్రఫి' మధ్య ప్రదేశ్ 'మహీదరి' పోలిక ఒకటే—నానురాను రాజుల, జమీందార్ల, ముతాదార్ల బానిసలు. అనువంశిక బానిసలుగా మారినది. ధనవతులైన వర్తకులు అప్పులిచ్చి పుచ్చుకున్న వారి ఆస్తి స్వాహా చేయడము, అప్పు తీర్చుటకు ఋణగ్రస్తుని కుటుంబాల్లో వారిచే ఊడిగములు చేయించుకొనే పద్ధతి నేడు 'సజీవంగానే' ఉన్నది.

రాష్ట్ర కూటులుగానున్న తాత, తండ్రి (గుండన, ఎఱ్ఱయ్య) కాకర్త్యులుగారు. రాష్ట్రకూట కాకర్త్య గుండ్యన విష్టి వంశీయుడనే ప్రసక్తి లేదు.

గరుడ (మొదటి) బేతరాజునుండి కొన్ని తరములు కాకతీయులు కల్యాణి చాళుక్య 'పాదపద్మోపజీవులు'గా నుండిరి. మండలేశ్వరత్వము, మాన్యములు రాజుసేవ యకారణముగా లభించినవి కాబట్టి విష్టి-వ్యవస్థ యనదగును.

గూడూరు శాసనపు దుర్జయాన్వయ ఎఱ్ఱ నృపుడు బేతభూవిభుని కాకతి నిల్పుట — కాకతి (మొదటి) బేతరాజునకు అన్మకుండాధిపత్యం ఇప్పించెననవచ్చును. ఆ పదవి అనువంశికంగా నిల్పుకోలేక పోయిన చరిత్ర యున్నది. కాగా దర్గా శాసనముబట్టి ఆహవమల్ల సోమేశ్వరునుండి ప్రోలరాజు అన్మకుండాధిపత్యం పొందెను. కాకతీయుల 'విక్రమచక్రి' బిరుదు కల్యాణి చాళుక్య సామంతతనే సూచించును.

క్రీ. శ. 1080–1110 మధ్యకాలానిదిగా గుర్తింపబడిన బేతరాజు అన్మకొండ శాసనమున 'దుర్జయ కులాబ్ధిచంద్ర...బేత నరేంద్రః తత్పుత్రః ప్రోల నృపః త్రిభువన మల్లదేవర పాదపద్మోపజీవి—అన్మకుణ్డాపురవరేశ్వరు'డు...మహామండలేశ్వరుడు 'కాకతియ బేతరస'.

కాకతి ఒక దేవత. ఆమె కులదేవత గాబట్టి ఆ రాజులు కాకతీయులైనారు అనే సందేహ, పరిశోధకాభిప్రాయమున కాధారమేమో తెలియుటలేదు.

శాసనములు, నాణెములు చెప్పే 'కకత, కాకిత, కాకతి, కాకతియ, కాకత్తె, కాకర్త్య' శబ్దములకు మూలశబ్దము రాష్ట్రకూట కాకర్త్య గుండనలో నున్న 'కాకర్త్య'—అతని పూర్వస్థానము లేక మండలేశ్వరతగా నోపునేగాని దేవత గాదనిపించును.

విద్యానాథుడు 'ప్రతాప రుద్రీయ'మున 'కాకతీయకుల దుర్గాదేవీ సమారాధనేన' అన్నందున కులదేవత దుర్గ, కాకతీయ దుర్గ రక్షకదేవత కాకతి, ఆమె పేరిట వారు కాకతీయులు అనే నమ్మకములు క్రీ. శ. 12 వ శతాబ్దం తర్వాతి సంగతులనుండి పుట్టినవై యుండును.

వేములవాడ శాసనములలో పొలవాస జగదేవుడు 'పొలవాసకుల తిలకుడు', క్రీ. శ. 1104 నాటి శాసనమున 'మహామండలేశ్వరం పొరవార కుళతిలకం శ్రీమజ్జగద్దేవ'లో పొలవాస ప్రాదేశిక వాచక (కరీం

నగరు జిల్లా జగిత్యాల ప్రాంతం)మే గాక అతని పూర్వులనాటి బిరుద వాచకముగా నేర్పడి కుల/వంశ వాచకమైన విషయము సూచించేదిగా నున్నది. వారు పారమారులు.

కాకతి బిరుద వాచకముగా లేదు. పారమార పరాక్రమమును సూచించేదిగా నుండగా కాకతి కా ప్రమేయము లేదు.

కాకతి ఒకనాటి వృత్తి వాచకముగా నున్నది. ఇంటిపేరు మనము పేరు ముందు వాడెదము. కొన్ని రాష్ట్రములలో పేరు చివర వాడెదరు.

ఇంటిపేర్లు సాధారణముగా ఆయా వ్యక్తుల పూర్వస్థానము, వృత్తి, ప్రత్యేకత, బిరుదుల సూచించేదిగా నున్నవి.

కాకతీయుల దుర్జయ విష్ణి వంశ కారణము లగాహింప గల్గినాము. కాకతీయుల బంధు, సామంత సేనాని శత్రువుల్లో కొందరిని పరిశోధకులు కాయస్థులుగా గుర్తించినారు. కాయస్థులు పూర్వ మెవరో తెలియదు. వారి కుల కథలలో పరశురామునికి భయపడి నాటి జీవన విధానము (క్షత్రియ) ఆచార సంస్కారముల విడిచిన వారు, వారి వంశ పురుషుడు చేత 'సిరాబుడ్డి కలము'తో పుట్టెనట. మనల నమ్మించలేని 'చరిత్ర' అనే కట్టు కథ.

అస్సాము రాష్ట్రమున పేరు చివర 'కాకతి' యని వ్యవహరించే వారున్నారు. ఈ పద్ధతి మైసూరు రాష్ట్రమున గలదు. సుప్రసిద్ధ సంస్కృతభాషా పరిశోధకులు డాక్టర్ వి. రాఘవన్ (మద్రాసు)గారి నుండి నా సందేహాలకు పొందిన సమాధానము. అస్సాము రాష్ట్రము వారిలో వారి పూర్వపు, ఒకనాటి వృత్తి, కాయస్థవృత్తి, వ్రాయస (రాయసం) లేఖక, కనకపిళ్లె, కరణం వంటిది. శిష్టకరణం—పట్నాయక్—ఈ కరణాలు పూర్వులు రాజులకు సచివులు, సేనా నాయకులనే చరిత్ర యున్నది.

కాకతీయులు కాయస్థులని పరిశోధకులు నిర్ణయించలేదు.



మైసూరు రాష్ట్రమున వ్యక్తుల పేర్లతోగల 'కాకతి' ఇంటిపేరు. ఆ రాష్ట్రమున కాకతి యను పురము నేటికీ గ్రామముగా బెల్గాం చేరువనే యున్నది. ఈ కాకతి ప్రాంతీయత బట్టి కాకతీయులన బడినారనే సందేహము. తొలుత గుర్తించినది డాక్టర్ మారేమండ రామారావుగారనుకుంటాను.

తాంత్రిక (వజ్రయాన) బౌద్ధమున కాకతి శబ్దమున్నట్లు చదివిన జ్ఞాపకము. కాకత శబ్దము పొట్ల, కాకర, విత్తనములు పేడ పిడకలలో భద్రము చేయు పద్ధతికి సంబంధమున్నట్లు జ్ఞాపకము. పందిరి దోసకాయలవంటి వానినే కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల్లో 'కాకడి' యనెదరు. మేఘాలయ రాష్ట్రమున మద్యవిశేషము 'కాకియద'.

కొంకణ, మహారాష్ట్రముల్లో కాకద, కాకోద్కర్ పేర్లున్న వ్యక్తులున్నారు. ఈ పేరు ప్రాదేశికమైన ఇంటి పేరు. కాకద—కాకతి వేర్వేరు పురాలో బెల్గాం దగ్గరి కాకతియో నేనెరుగను. కాకతి కోకోదర భవమన్న సంబంధము రేణుక (ఫణిరాజమండన) యగును.

కాకతీయులు ఆదిలో అధిరాజులవలె జైనులు కాబట్టి జైన కూష్మాండినియే కాకతి దేవత యనిరి. జైన కూష్మాండిని, బౌద్ధ తార, హిందూ దుర్గ అంబిక, ఏక వీరాదేవి పోలికలున్నవట.

కకుద (దౌడలు) కాకతియగునా? తలమాత్ర మున్న దేవతా మూర్తులు, భయంకర రూపులు, కోర లున్న విగ్రహాలున్నవి.

కకుత్ (శ్రోణిపార్శ్వ), కకుందర (స్త్రీ పిరుదులు) బట్టి కాకతి ఏర్పడెనా? మహామాతను సూచించే పెద్ద పిరుదులు, తొడలు, స్తనములున్న విగ్రహములు బహుపురాతన కాలమున వనేక దేశము లందున్నవి.

తమిళనాడులో, మన నెల్లూరు ప్రాంతమున 'కాకంది' యనే తావున్నదట.

నాటి నతవాడికి చెందిన కృష్ణాజిల్లా ముక్త్యాల ప్రాంతమున కాకతమ్మబీడు ఉన్నట్లు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్రాసిరి.

బెల్గాంలో 'ది హిందూ' పత్రికా విలేఖరి మిత్రుడు శ్రీ ఎం. మదనమోహన్ నా వివరణల ఆధారముతో సవదత్తి (రేణుక). కాకతి గ్రామము వెళ్లి వ్రాసిన జాబు బట్టి కాకతి పురాతనపురము అనిపించు శిలా లనేకమున్నవి. ఆయుధపాణులైన దేవతా ప్రతిమా శకలము లున్నవి. గ్రామదేవతపేరు వ్రాయ లేదు. మహాలక్ష్మిగా కర్ణాట, మహారాష్ట్రములందు పూజింపబడుచున్న దేవత పోలిన దారు విగ్రహమట.

బొంబయి పూర్వనామము ముంబాయి—ముంబా దేవి పేరిట స్థల నామము. మహాలక్ష్మికి లక్ష్మి (సిరి)కి సంబంధములేదు. మహాలక్ష్మియే మహా మాయ, జ్యేష్ఠ, దుర్గ వగైరా అంటున్నారు. మహారాష్ట్రమందున్న కొల్హాపుర మహాలక్ష్మి గూడా ఆదిలో జైనదేవత అనే సిద్ధాంత మున్నది.

ఒకే దేవత ఆయా ప్రాంతీయతల బట్టి ఊరి పేరిట పిల్వబడుట సాధారణ విషయము. మైలార దేవుని భార్యగా పూజింపబడే మాలసాదేవినే కొందరు మహామాయ అంటున్నారు. రెడ్లనాటి మూలాగూరమ్మ, జైనులైన కర్ణాటక గాంగుల (జాహ్నవేయ) కోలారమ్మ (కోలారు రక్షకదేవత), హోసూరమ్మ ఇత్యాదులవలె కాకతిపురదేవత కాకతమ్మ గావచ్చును. కాని ఆ వివరాలు లేవు. పుర, గ్రామ, సరిహద్దు రక్షక దేవత లుండుట పురాత నాచారము.

కాకతీయ శాసనములందు ప్రసక్తికి వచ్చిన దేవతలు లక్ష్మి, చండిక, మహాలక్ష్మి కాకతి లేదు.

'క్రీడాభిరామమం'దున్న ఏకవీర సైదోడు కాకతమ్మ రూపురేఖలు, గుణగణాలు, ఎవరో ఏమిటో తెలియదు. ఈ గ్రంథమున సిరి—చంద్రుల సైదోడుతనమున్నది. పురాతన జాతుల్లో చంద్రుని స్త్రీ రూపము సిరి అనీ, చంద్రుడు కొన్ని దేశములలో పురుషదేవత కాదనీ, వివిధ శృంగార, సృష్టి, సౌందర్య, సంహారకాధిష్ఠాన దైవాలమూలము చంద్ర, శుక్ర (వీనస్) గ్రహముల గూర్చిన పురాతన కథామూర్తు లనే పరిశోధకాభిప్రాయ మున్నది.

కాకతీయులు, అన్నిట అధిరాజులైన కల్యాణి చాళుక్యులనే అనుసరించినారట. చాళుక్యుల కులదేవత కౌశికి (చండిక) కాబట్టి కాకతీయుల కులదేవత యన బడే కాకతి (నిజమైన) చండిక గావచ్చును. 'క్రీడాభిరామ'పు సైదోడు తనము—అక్కచెల్లెండ్రు గాక చండికకు చేరువైన ఏకవీర వంటిదే కాకతి యనుకో వలసివచ్చును.

అమృత మథన గాథ నాధారము జేసుకొన్న దుర్గ, ఏకవీర, ఆదిశక్తి, అదితి వగైరాలకు చేరువ పోలికలున్న జ్యేష్ఠాదేవి, (నిఋతి), మహామాయ, పృథ్వి, ఈమె సైదోడు లక్ష్మి. ఈ లెఖను కాకతి లక్ష్మి యగును.

హైదరాబాద్ 'ది సెంటినల్' పత్రిక సబ్ ఎడిటర్గా నున్నప్పుడు ఆ ఆఫీసు కెదురు వీధిలో గల ఆఫీసు పత్రికాధిపతి శ్రీ సురవరపు ప్రతాపరెడ్డిగారుండే వారు. వారింటికి కూడా వెళ్లేవాడిని. మా సంభాషణలు అనేక విషయాల గూర్చినవి. శ్రీ రెడ్డిగారు కూడా

అందరూ కాకతమ్మ దేవత యనుటయేగాని ఎక్కడున్నది, ఎట్లున్నది ఎరిగినవారెవరూ లేదన్నారు. ఎక్కడా ఆలయమున్నట్లుగాని, పూజింపబడుచున్నట్లుగాని రూపురేఖల గూర్చిన 'రికార్డ్సు' వివరాల్లేవనిరి. వారు వ్రాసినదీ అంతే—

'ప్రతాపరుద్రీయ'పు కాకతికుల దుర్గాదేవి వివరాలు తెలియవు.

ఇది కాకతి విగ్రహము, ఇదామె గుడి, ఇది ఆమె రూపము అని తెలంగాణాలో చెప్పగలవారు, చెప్పినవారు చూచినవారు లేరు. ఏమాత్రము గుర్తించగల్గియున్న కాకతి గూర్చి చెప్పదగినవారు ప్రతాపరెడ్డిగారు.

అన్మకొండలో మార్వాడీలు పునరుద్ధరించిన 'భద్రకాళి' ఛాయాచిత్రము జూచాను. అంతకుముందామె పేరు ఏదో తెలియదు. బహుభుజ, రక్షణ—సంహారకశక్తి యనిపించు ఈ 'భద్రకాళి'నే కొందరు కాకతి యనిరి. ఈ 'భద్రకాళి' రూపము రేణుకకు చేరువ. ఈ 'భద్రకాళి' కాకతియైన ఏకవీర, కాకతి ఒకే మూసలో దేవత లగుదురు.


వరంగల్ మట్టెవాడలో లభించిన దేవత ఛాయాచిత్రము 'ఆంధ్రపత్రిక'లో జూచాను.

'బంధూక కుసుమాభాసం
పంచముండ వాసినీం
స్ఫురచ్చంద్ర కలారత్న
మకుటాం ముండమాలినీం
త్రినేత్రాం రక్తవసనాం
పీనోన్నత ఘట స్తనీం
పుస్తకం చాక్ష మాలాంచ
వరంచా భయ సంక్రమాత్'

ఇది చండికా రూప వివరణ. జగన్మాత, జగద్రక్షకి, సృష్టి, పోషణ, సంహారక శక్తి.

ఐతే పుస్తకము, అక్షమాల గాయత్రికీ, సరస్వతికీ ఉన్నవి.

సాహిత్యమందున్న కాకతి దేవత శాసనాల్లో



కన్పించదు. కాకతీయులు అన్మకొండనుండి పాలించిన కాలము న కాకతి అనే దేవతయున్న వైనములేదు.

కాకతిని పేర్కొన్న 'క్రీడాభిరామము' రెడ్డిరాజుల నాటిది. 'ప్రేమాభిరామము' కాకతి యున్నదో లేదో నాకు తెలియదు. కొరవి గోపరాజు పేర్కొన్న దేవతలు—కామాక్షి, మహాకాళి, చండి, నక్కజియ్య, కాళి, అంబిక, వింధ్యవాసిని, ఏకవీర, కాకితమూల శక్తి.

ఏకవీర మొదలగు ఆదిశక్తి బోలు దేవతల వలె 'కాకితమూల శక్తి' గాబట్టి ఈమెయూ ఆదిశక్తియే గావలెను. సైదోడు తనము అక్కచెల్లెండ్రు గాక అక్కపోలిక వారుగా నున్నది.

అన్మకొండ పద్మాక్షియే కాకతియని కొందరు, కాదని కొందరి సిద్ధాంతము. ఇమ్మడి ప్రోలరాజునాటి స్థలమ ఏర్పాటు కడబాలయ జైనబసదినాటి దేవత ఈ పద్మాక్షి కాదని కొందరి వాదము. లక్ష్మి, లక్ష్మిని పోలిన దేవతలు మన దేశముననేగాదు ఇతరదేశములందుగూడ కడబాలయుమే. (అఫ్రోదితీ. వీనస్ వగైరా.)

'ఆంధ్రపత్రిక' (15–8–1959) స్వాతంత్ర్యోత్సవ సంచికలో మండపాక ఏకారమ్మ ఏకవీరాదేవి యనిపించుటచే సచిత్ర వార్తా వ్యాసం ప్రచురించాను. ఆమె కాకతమ్మయని డాక్టర్ శ్రీ పాద గోపాలకృష్ణమూర్తిగారు 'భారతి'లో ప్రచురించారు.

'భారతి'లో ఇద్దరము 'కలముల దూసినాము.' ఈ సందర్భముగా 'భారతి'లో శ్రీ వేటూరి శంకరశాస్త్రి గారు సచిత్ర వ్యాసం ప్రచురించారు. శ్రీ (హర్ష వర్ధన?) శర్మగారొక వ్యాసం ప్రచురించారు. డాక్టరు గోపాలకృష్ణమూర్తిగారు చివరికి మార్గానికే వచ్చారు. ఈ వర్మ ఎవరాయని (నేను అనుకోని) వచ్చారు. విద్యలో, వయసులో, విజ్ఞానంలో, అనుభవంలో పెద్ద లైన డాక్టర్ మూర్తిగారిది 'స్పోర్టివ్ స్పిరిట్' వందనీయులు.

డాక్టర్ కృష్ణమూర్తిగారి వాదము మండపాక (తణుకు తాలూకా, పశ్చిమ గోదావరి) ఏకారమ్మ—ఏకవీర అవబడుతున్నావిడయే కాకతి, ఆమె చాముండియే అని.

కాకతి ఎవరో నాకు తెలియనప్పుడు నేను ఇద మిత్థ మనుట కర్హుడను గాను. నేను సేకరించిన విషయాలు, వివరాలు రేణుక మైలారదేవుల గూర్చి మాత్రమే.

తెలంగాణాలో మండపాక గ్రామా లున్నట్లొక మిత్రుడన్నారు. నాకు తెలియదు, 'క్రీడాభిరామ'పు ఏకవీరా పీఠాల్లో నొకటి మండపాక, తణుకు తాలూకా మండపాక అనుకొన్నాను. ఈ మండపాకలో తలమాత్ర మున్నదొక రూపము ఏకారమ్మవద్ద నుండుటచే 'కాక తమ్మకు సైదోడు ఏకవీర' అనుకోడాని కాధారమైనట్లున్నది.

ఐతే కావచ్చును. కాని ఇతర దేశాల్లో గూడా ఎరుపు (రక్తవర్ణం) రంగుపూజతల, చేరుపనే మరో దేవత బహుపురాతన కాలపుటి వున్నాయి. అదంతా సెక్స్ నమ్మకాలని. స్త్రీ బుతుస్రావం-సంతానాపేక్ష వగైరా ఈ వ్యాసంలో వివరించరానిది. ఏకవీరనుపోలు దేవతామూర్తులు ఇతర దేశాల్లో ఉన్నవి. పరశురాముడు అనే పేరు లేకున్నను రేణుకవంటి అమ్మ వార్ల తల నరకుట కథలు ఇతర దేశాల్లోనూ ఉన్నవి. (ఏకవీర గూర్చిన వ్యాసంలో సచిత్రంగా వివరించ గలను.)

కొన్ని ప్రాంతాలనుండి మాయూర లభించిన విగ్రహాల చూడ రమ్మన్న ఉత్తరాలు వచ్చాయి. కొందరు ఛాయాచిత్రాలు గూడా పంపారు. ఆమె కాకతియా అని. నాకు కాకతి ఎవరో తెలినప్పుడు ఏమి చెప్పగలను?


మండపాక ఏకారమ్మ పాదాల చెంతనున్నదొక వింతజంతువు ఎలుక వంటిది. అచటనే త్రవ్వి తీసిన భైరవ విగ్రహమూ ఏకారమ్మ ఒకనాటివే అయ్యుంటే ఏకారమ్మ చండిక—మూలగూరమ్మ అయ్యుండును. రెడ్డిరాజులనాటి శిల్పంలో చెవులు పొడవుగా నుండుట భైరవ విగ్రహములో చూడనగును. చండికతో ఎలుక వంటిది చాలచోట్ల ఉన్నది.

'క్రీడాభిరామ'పు టనుబంధములో కాకతి గూర్చి శ్రీ ప్రభాకరశాస్త్రిగారు ప్రకటించారు. అందే ఆమె ఛాయాచిత్రం కూడా ప్రకటించారు. వారి కాకతమ్మ చేయవను గూడ వింతజంతు వున్నది. చతుర్భుజయే ఆ జంతువు ముంగిస, ఎంత్రిక, పందికొక్కు, పెద్ద ఎలుక, పొడవు తోకతో వంది అనిపించును.

అనుబంధములో విషయములు—అని తల్లి కలువ చెర్వు శాసనమున 'కాకర్త్యాః పరశక్తేః కృపయా కూష్మాండ వల్లికా కాచిత్ ఫ్రత మసూ తతదేతత్కుల మనఘం కాకతీయ సంజ్ఞ మభూత్' (2) ఇమ్మడి ప్రోలుని పద్మాక్షీ మ్రదేవ్యాలయ శాసనమందలి జిన స్తుతిబట్టి వారు జైనులు (3) ఇరువదిరెండవ తీర్థంకరునిదేవి కూష్మాండిని (4) కాకతి=గుమ్మడి తీగ సరిగాదు. (5) 'ప్రతాపరుద్రీయము'న కాకతీయకుల దుర్గాదేవీ సమారాధనేన విజయ ప్రస్థాన మంగళం కృత్వా' (6) 'రత్నాపణ' వ్యాఖ్యలో 'కాకతిర్నామ దుర్గాశక్తి రేకశిలా నగరేశ్వరాణాం కుల దేవతా, నా శక్తిర్భజనీయా అస్యేతి కాకతీయః' కాబట్టి కాకతిదుర్గ మరో పేరు. (7) దేవుని గుమ్మడిపండ్ల సంతానార్థం పూజించుట కూష్మాండ వల్లరీగాథకు మూలము. (8) కాగతి గ్రామమునుండి కాకతి శబ్దము పుట్టెననుట సరికాదు. (9) పానుగంటి శాసనమునుబట్టి 'శ్రీమతు కాకతిపుర వరాధీశ్వర రుద్రదేవ మహారాజు' కాకతి ప్రాదేశిక నామమైనందున తత్పురాధీశులు కాకతీయులైనట్లు తలవ వచ్చును. (10) మధుర, నాసిక బౌద్ధ శాసనములందు 'కాకతేయ, కాఖండి' యను పేర్లుండుటచే బౌద్ధదేవత హైందవత జెంది శివశక్తి పేర మారియుండును. (11) 'కాది' మంత మున్నది.

ఇమ్మడిప్రోలునినాటినుండి కాకతీయులు ప్రముఖులై, సంస్కృత, పండిత, బ్రాహ్మణుల కతి సన్నిహితులై తమ పూర్వభాష, పేర్లు వదలి పూర్తిగా తెలుగువారగుట గమనించదగినది. తర్వాతి రాజులు రుద్ర, మహాదేవ, గణపతి—పూర్తిగా శైవం.

కాకతీయులే గాదు, వారి అధిరాజులు కల్యాణి చాళుక్యుల్లో గూడా రాజు జైన మతాభిమానియైనను హిందూ దేవాలయ ప్రతిష్ఠలు జేయుట హిందూ—శైవాభిమానియైనను జైన బసదు లేర్పర్చుట చరిత్ర యున్నది. రాజ్యతంత్రంలో అంతే.



అని తల్లి కలువచేరు శాసనం కాకతీయుల నాటిది గాదు. కాకతీయ శాసనాల్లో ఈ కథ గాని, కాకతిదేవత పేరిట కాకతీయు వైనంగాని లేదు.

'కాకతీయ కులదుర్గాదేవి'కన్న 'కాకతిర్నామ దుర్గాశక్తిరేకశిలా నగరేశ్వరాణాం కులదేవతా' సాహిత్యంలో (శాసనాలు గాదు) కాకతీయుల కులదేవత, లేదా ఏకశిలాదుర్గ రక్షణ దేవత కాకతిగా నున్నది. కాకతీయుల ఓరుగల్లు శాసనములందీ దేవత ప్రసక్తి లేదు. సాహిత్యమున మాత్రమే కాకతి ఒక దేవతగా కాన్పించుచున్నది. కాకర్త్య, కాకతియ, కాకతీయుల కులదేవత రాష్ట్రకూట కాకర్త్య గుండననాటినుండీ ఎవరో తెలియదు. వారు చెప్పుకోలేదు. అన్మకొండా మహామండలేశ్వరులూ చెప్పుకోలేదు. 'రత్నాపణ' వ్యాఖ్య బట్టి ఓరుగంటికి రాజధాని మార్చిన తర్వాతనే—రుద్రదేవుని తర్వాత సాహిత్యంలో మాత్రమే కాకతి దేవతగా సాక్షాత్కరించుట పండితులు చేసిన పని యనిపించును.

దేవీ సహస్రనామాల్లో కాకతి లేదు. ఓరుగల్లు కోట, మునిసిపల్ ఏరియా, పరిసరాల్లో గూడ కాకతమ్మ కనిపించదు, వినిపించదు.

చారిత్రకముగా కాకతి శబ్దము తెలుగునాటకు వలస వచ్చుట రాష్ట్రకూట కాకర్త్య గుండనతో ప్రారంభము. కర్ణాటకమునుండి వచ్చిన పేరు. కోలారమ్మ, హోసూరమ్మ, మూలగూరమ్మల వలె కాకతమ్మ గూడ కాకతి గ్రామదేవత గావచ్చును, కాకపోవచ్చును. ప్రాదేశికతగా ఆ పేరు లేదు.

కొరవి గోపరాజుగారి 'కాకిత మూలశక్తి' నెరిగినవారు కాకతీయ సామ్రాజ్యమున—కనీసము తెలంగాణా జిల్లాలో కాకతియను గ్రామము, అమ్మవారు, ఆమెకో గుడి యున్నట్లు తెలిసినవారెవరైన వ్రాయ ప్రార్థన.

స్త్రీలు—పురుషులు సంతానార్థమై పడిన పాట్లు, చేసిన పూజలు రకరకాలు విశ్వవ్యాప్తంగా బహుపురాతనాచారములతో నున్నవి. మనకు సాహిత్యమున పురాణేతిహాసముల గాథలు కోకొల్లలు. కూష్మాండ మన సాధారణార్థము బూడిద గుమ్మడికాయ. కాని పండితాభిప్రాయము గుమ్మడికాయ. గర్భిణి బూడిద గుమ్మడి, గుమ్మడికాయల తరగరాదు అనే నమ్మకమున్నది. రెండూ భోజ్యములే—బూడిద గుమ్మడి మాత్రము ఇండ్లలో పెంచరు. దృష్టిదోష నివారణార్థము, దీనిపై మనిషి ముఖమో మసి, సున్నం బొట్లు దిద్ది వ్రేలాడదీయుట, గాలిధూళి నమ్మకాల్లో వాడుచున్నారు.

సంతానార్థము, ఐదవతనము, తత్సంబంధపు స్త్రీల నమ్మకములలో దేవతార్పణ మగుచున్నవి సూదీ గుమ్మడికాయలు. చూడ చక్కగా, బక్కవనిపించేవిగా. చిన్నగా, ఎర్రగానుండు గుమ్మడికాయలు. శివునికి ప్రీతి అనెదరు. సూదీ గుమ్మడికాయలరంగు సూచించేది ఆదిమజన విశ్వాసమే. 'గుమ్మడి'—పసివాడు, కొడుకు అర్థం వాడుక గలదు.

కాని బూడిద గుమ్మడికాయ ఆకారం గల శిలలు,

తలగా భావింపబడి పూజింపబడుచున్నవి. లింగమూర్తి భావము గాదు.

కూష్మాండిని నేమినాథుని శాసనదేవి. చతుర్భుజ—చేతుల్లో మామిడిపండ్లు, పాశము, అంకుశము, శిశు వుండునట. దిగంబరజైన కూష్మాండిని వడిలో శిశువు లుందురట.

అమ్మవారి వడిలో శిశువు— అనేక దేశముల గాథల్లో, శిల్పములో నున్నది. పోలికలు శ్రీ కృష్ణ బాల్యక్రీడల్లో పూతన (రాక్షసి యన్నారు), బౌద్ధుల హారీతి శిశు హంతకి తర్వాత శిశు దక్షకి; ప్రసవ మందిరము, పురటాలు, బాలారిష్ట రోగముల గూర్చిన కథ లనేక మున్నవి—ఆయా అరిష్టాల పీడలనుండి రక్షించేవారిలో అదితి గలదు. కాకతమ్మ సందర్భంగా ఈ గాథలు లేవు. అసలామె నెందుకు పూజించేవారో తెలిపే ఆధారాలు లేవు. కాని రేణుక (ఏకవీర) కథల్లో బాలారిష్టాదుల గూర్చిన నమ్మకము లున్నవి. 'ఛీ ఛీ తూ తూ బాహ్మణుని కూతురు, మాలవాని పెండ్లాం'—కథల్లో పరశురాముడు తల్లి తల నరకుట, తర్వాత అతుకుటలో—తల, శరీరము వేర్వేరు స్త్రీల వైనందున రేణుక – మాతంగి యను పేర్లు—మాతంగి ఎర్వతి మరో పేరు అనే విషయం మరచిపోయినారో మరే కారణముననో మాతంగి మాలవారి స్త్రీగా వ్యవహరించుట జరిగెను. ఒరిస్సా పురావస్తు శాఖాధికారి డాక్టర్ బి వి. నాథ్‌గారినుండి సేకరించిన ఛాయా చిత్రాల్లో యమి వడిలో శిశువు—కంఠాభరణము పోలిక పూర్వం ఇతర దేశాల్లో అమ్మవార్లు ధరించిన పురుషాంగాకారముగల లింగమాల—మానసాదేవి వడిలో సర్వగష్టుడైనవాడు. క్రైస్తవుల మేరీమాత వడిలో క్రీస్తు. ఈజిప్టు ఈశిస్‌దేవి వడిలో—ఈ మాతాపుత్రభావ రూపకల్పన బహుపురాతనము బాబిలన్ హాథోర్ నిన్‌హూర్‌సాగ్ నుండి వ్యాపించిన దనెదరు. ఈమె రూపము తల మాత్రమే.

నేమినాథుని కూష్మాండిని అనుమకొండ పద్మాక్షి, పద్మావతియనీ కాదనీ రెండు వాదము లున్నవి. తిరుపతి వేంకటేశ్వరస్వామిదేవి పద్మావతి అదిలో జైన విగ్రహమనే పరిశోధకాభిప్రాయ మున్నది.

అనుమకొండలో బైట నున్నది పార్శ్వనాథుని రూపము. పార్శ్వనాథుని యక్షిణి పద్మాక్షి—హంస లాంఛని, దిగంబర జైనుల ప్రతిమ ఫణిఛ్ఛత్ర, శ్వేతాంబరుల ప్రతిమ కుక్కుట నరాసనియట. ఈ పద్మాక్షి పద్మావతి అనీ, కాదనీ భిన్నాభిప్రాయము లున్నవి.

అన్మకొండ కొండపైనున్న ఈ దేవి కాకతి యని ఎట్లూహించినారో తెలియదు. ఏనాడైన కాకతి యనబడియున్న నేటికీ కాకతి యనబడునేగాని పద్మాక్షి యనబడదు.

జనసామాన్యంలోగూడ కాకతిగూర్చిన కథ లున్నవి. శ్రీ రామచంద్రరావు దేశపాండే అదిలాబాదులో తహసీల్దారు—తెలంగాణా గాథ నెరిగినవారు. నాకు వ్రాసిన జాబుల్లో ఎక్కడి వారో కాకతీయులు ఓరుగల్లు రాజ్యమునకు వచ్చినప్పుడు 'కావు, కావు (రక్షించు) మనెనట కాకులు. ఈ కాక (వాయసము) సంబంధము కాకతీయ శబ్ద వ్యుత్పత్తిగా నమ్మకము.

మన స్థల పురాణాల్లో, తదితరముగా గూడ కాక నామ జను లున్నది తెలంగాణా కెగువ ప్రాంతము.

చాళుక్యులందరూ కులదేవతగా చెప్పుకొన్నది చండిక—కౌశికి బహుశా తమ పూర్వపు రాజులనుండి అనుకరించినది గావచ్చు వారి 'మానవ్య—హారీతీ' ప్రసక్తి.

పూర్వ చాళుక్యులు బాదామినుండి నిష్క్రమించినప్పుడు నా గతి యేమి కావలెనను అర్థములో 'కాగతి' యనెనట నగరరక్షక దేవత. ఆ సందర్భముగా కాగతి—కాకతియైన జనవిశ్వాసమున్నట్లు అలంపూరునుండి శ్రీ గడియారం రామకృష్ణశర్మ గారు వ్రాసిన జాబులో నున్నది.

ఈ జన విశ్వాసములో ఏమైన నమ్మదగిన దున్న కాగతి చండిక/కౌశికి యగును—ఆమె కాకతియని జన విశ్వాసము.

అర్మకుండమునకన్న కాకతిగ్రామము బాదామికి దగ్గర. బాదామి చాళుక్యుల 'కాగతి' బెల్గాం చేరువ నున్న కాకతికి సంబంధమున్న ఆ నగర దేవత కాకతమ్మ యనబడే అవకాశమున్నందున ఆదిశక్తి—మహాలక్ష్మి— కాబట్టి కాకతి రేణుక వలెనే ఆదిశక్తి మరో రూపము గావచ్చును. కాకతిగ్రామము రేణుకాక్షేత్రమైన సవదత్తికి చేరువ.

రేణుకా దేవి గాథలు, రూపము పోలికలు నాటి మెసొపొటోమియా వర కున్నవి. తలనరుకుడు కథల పోలిక లున్నవి.

రేణుకాదేవిని ఎందుకు, ఎలా పూజించినారో, ఆమె రూపు రేఖలు, గుణగణాలు వివరాలున్నవి. 'క్రీడాభిరామ' కర్త ఆమె పీఠాల్లో తెలుగునాటివి మాత్రము పేర్కొనెను. కాని ఈమె పైదోడు కాకతిగూర్చి ఏ వివరములు లేవు.

కాక నామజనులుండిరే గాని కాకతినుండి కాకతీయులైన చరిత్ర కాధారములు లేవు. కకుభ్, కాకుత్స్థ—ఎద్దు మూపురం పోలిక దేవతా మూర్తియన్నా కాదనను. కారణం కాకతి గూర్చిన సమాచారం నా వద్ద లేదు. ఈజిప్టు గతకాలపు గాథల్లో 'కా' దైవం—ఆత్మ ఉన్నది. సుమేరియనుల 'కా' భూమి.

మన అమ్మవార్ల పేర్లు, గాథల్లో పృథివ్యాకారములగూర్చిన నమ్మకాలున్నవి. శ్రీ గడియారం రామకృష్ణశర్మగారంపిన అలంపూరు ప్రతిమల ఛాయాచిత్రాలున్న పుస్తకంలో అక్కడి రేణుక తలలేని స్త్రీ—భుజములపై ఆకులున్నవి. కాళ్లు ఎడముచేసి జననేంద్రియమును చూపుచున్నట్లున్న విగ్రహము. సృష్టి, భూమాతగూర్చిన విశ్వాసముల్లో కల్పనా మూర్తి. సంతానార్థులు ఈ ప్రతిమా జననేంద్రియమునకు వెన్నపూసి నాకెదరని మలోకరు వ్రాసిరు. అసహ్యకరమైన ఆచారాలు కర్ణాటకమున చాలా క్రీ. శ. 18వ శతాబ్దమునగూడయున్న చరిత్ర గలదు. సరిగా ఈ రేణుకా విగ్రహము పోలినది తల యున్నది. అదే భంగిమములో మర్మాంగమును చూపు ఆయుధ పాణి రూపము మరోదేశమందలి (జావినియా) చిత్రము సేకరించాను. ఈమె పార్శ్వాల్లో ఇంగ్లీషు 'K' పోలిన చిహ్నలున్నవి. ఇలా మర్మాంగం చూపే ఈజిప్టు 'తవుర్త్' గ్రీసు 'అఫ్రోదితీ' గర్భప్రసవాధిష్ఠానత్వాన్ని సూచించాలి.

కాకతి అనే అమ్మవారు కతిపయ కాలపు పండితులు, కవులు జాతకం వ్రాసినట్లున్నదేగాని అర్మకుండాపుర వరేశ్వరుల కాకతి అమ్మవారని పించదు. వారి కాకతి ఖచితముగా ప్రాదేశికమనే నా నమ్మకము.

కాకతి కాకతీయుల కులదేవత అనుకొన్న వారి శాసనములందా అమ్మవారు లేదు. రాజుల కులదేవతలే సాధారణముగా రాజ్య, దుర్గ, నగర రక్షక దేవతలుగా మన్నారు. సాహిత్యమున కాకతి దుర్గాదేవి వర్గైరాగా ఉన్నది.

ఈ లేఖను రాజధాని అర్మకుండమున గాని ఖిల్లా వరంగల్‌లోగాని వారి కులదేవతయైయున్న కాకతి ఉండి తీరాలి. ఉండెడిదనే ఆధారము లేదు. ఉన్నదని చూచినవారు లేరు.

ఓరుగంటి దుర్గ రక్షక దేవత అయ్యున్న కాకతి శైవశాక్తేయులందలి దుర్గ కాదు అనే ఆధారమున్నది.

పిడుపర్తివారి 'బసవపురాణము'ను శ్రీ గంగపట్నం సుబ్రహ్మణ్య కవిగారు పరిష్కరించిన ప్రతి—కథ శ్రీ ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరించిన 'బసవపురాణ' మందున్నది.

ఒకనాడు ఓరుగంటి స్వయంభూ దేవాలయమున 'బసవపురాణ' పఠన జరుగుచుండగా రాజు ప్రతాపరుద్రుడు డచటికి వచ్చెను. 'ధూర్తవిప్రు' డొకడు 'పాలకురికి సోమపతితుండీ నడుమను బెనచె మధ్యవర్ణ్ల వెట్టి ద్విపద' యని హేళన చేయగా రాజు తిరిగి పోయెనట. భక్తులీ విషయము గురువుగారికి చెప్పి ఆ బ్రాహ్మణుల జంప నాజ్ఞ నీయవున్నారట. పాల్కురికి సోమనాథాధ్యుడు కోపించి రెండెడ్ల బండిపై ఓరుగల్లు చేరునప్పటికి

'తే. గవనిపై లచ్చి ప్రతిమయుఁ గరులు రెండు
నుండఁ గాడికిఁ గట్టిన యుక్ష యుగము
గవని జొరకున్న సోమశేఖరుఁ డెఱింగి
తొలఁగు మని పంప నవి నేలఁ దునిసి పడియె'నట

దుర్గ రక్షకి, కుల దేవత, నగర దేవత కాకతియైయున్న పై పద్యమునుబట్టి గజలక్ష్మియే కాకతియైయ్యుండు ననిపించును. గజలక్ష్మి రాజ చిహ్నముగా నుండుట ఇతర రాజ్యములందున్నది.

'బసవపురాణము' గవనిపై దేవత రెండేనుగుల మధ్యనున్న లక్ష్మి యనెనే గాని కాకతి, దుర్గ యన లేదు.

ఐతే 'క్రీడాభిరామ'పు పైదోడు తనమే సరను కుంటే ఏకవీరలో భైష్మాదేవి పోలిక లనేకము లున్నందున పైదోడు కాకతి లక్ష్మి కావాలి. కాని కాకతీఁ శాసనాల్లో కాకతి దేవత గాదు. ఆ శాసనాల్లో దేవతలు లక్ష్మి, మహాలక్ష్మి, చండికలు.

కాకతిదేవత ఎవరు? నాకు తెలియదు కాని కాకతీయు అన్న పేరుకు కారణం పూర్వము కాకతి పురాధిపతులనే నా దృఢ విశ్వాసము.

కలగూరగంప :

"కవిత్వం - చైతన్యం" మీద అవంతిగారి అన్యాయమైన సమీక్ష

కవిత్వం చైతన్యం' వ్యాసంమీద అవంతిగారి సమీక్షలో సరియైన అవగాహన లోపించింది. గుణదోష పరామర్శ చేస్తున్న న్యాయమూర్తి ధోరణితో దోష ప్రదర్శనం మీదే మొగ్గు చూపారు. దోషమేలేని రచన చేయగలిగిన వాడిని నేను ఇంతవరకూ చూడలేదు. దోషాలు చేయటం, దిద్దుకోవటం ఏమాత్రం నేరం కాదు. నిర్మాణాత్మకమైన సూచనలు రచయితలకు ఎంతో ప్రయోజనకరంగా వుంటాయి. విమర్శలో తీవ్రత అనవసరమని నా అభిప్రాయంకాదు. ఎక్కడ ఏది అవసరమో అక్కడ అది వుండవలసిందే. 'వి. ర. సం మిత్రులు' అని అంటూనే అవంతిగారు నా వ్యాసాలమీద అన్యాయమైన శత్రువైఖరి తీసుకున్నారు. నిదానంగా మరోసారి ఆలోచిస్తే గ్రహించగలిగేవి కూడా అవంతిగారు పట్టించుకోలేదు. సైద్ధాంతిక దృష్టితోగాక వాక్యాల్ని సందర్భంనుండి వేరుచేసి వ్యాఖ్యానించటం సక్రమమైన పద్ధతి కాదు. నేను చెప్పిందే చెప్పలేదనటం నా అభిప్రాయాలనుకున్న పునాదులను విస్మరించటం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. 'అవగాహనాలోపం, పులుముడు, స్వాభిప్రాయ వ్యాఘాతం'లాంటి హేతు ప్రదర్శనలేని ముగింపులు విమర్శలో ఆరోగ్యకరమైన ధోరణులు కావు. శాస్త్రీయమైన వున్నత స్థాయి విమర్శకు అవసరమైన 'పదజాలం'మీద కూడా దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం వుంది.

'వర్గం' అంటే 'కార్మిక వర్గం' అని నేను చెప్పలేదని ఆరోపణ. శ్రామిక వర్గమనీ, పీడితులనీ. నగరంలో కార్మికులు, పల్లెల్లో రైతుకూలీలనీ అనేక సందర్భాల్లో 'వర్గం' అంటే ఎవరో స్పష్టంగా రాశాను, ఇంతకీ 'విప్లవవర్గం' అన్ని దశల్లోనూ కార్మికులే కావలసిన నియమం ఏముంది? అంతిమంగా నాయకత్వం కార్మికుల్దే కావచ్చు. రైతుకూలీలు, విద్యార్థులు, యువకులు చివరకు బూర్జువాల్లో ఒక భాగంకూడా విప్లవవర్గం కావచ్చు. కార్మిక ప్రయోజనాల్లోనే తమ ప్రయోజనాలు ముడిపడి వున్నాయని సైద్ధాంతికంగా గ్రహించి విప్లవ కార్యాచరణలో 'నిమగ్న'మైన వాళ్లందరూ విప్లవవర్గమే. వర్గ పరివర్తనం అనేది చారిత్రకంగా విప్లవ సత్యమే. ఈ విషయాలన్నీ అనేక సందర్భాల్లో నేను వివరిస్తే వర్గమంటే 'కార్మికవర్గం' అని రాయాలని సలహా ఇవ్వటంలో అర్థమేమిటి? విప్లవం అనేది కార్మికులే తేవాలనీ, భారతదేశంలో కార్మికవర్గం బలపడలేదు కాబట్టి విప్లవ పరిస్థితి లేదని, చారిత్రికంగా పరిస్థితులు పరిణతమైనప్పుడు విప్లవం అదేవస్తుందని చెప్పేవాళ్లున్నారు. రష్యా మన దేశంలో ఉక్కు పరిశ్రమలవంటివి స్థాపించటానికి కార్మికవర్గాన్ని పెంచటానికే అని, ఆ విధంగా రష్యా భారతదేశంలోని విప్లవ పరిస్థితిని వేగవంతం చేస్తోందని పై వాళ్లే చెబుతున్నారు. ఈ రకం దృక్పథంనుంచి పుట్టిందే అవంతిగారి సలహా. కార్మికులు రాసిందే కార్మిక కవిత్వం అవుతుందని నాకు తెలీదు. అందరూ మధ్య తరగతివాళ్లే అయినా విప్లవ కవిత్వం రాయటానికి అవసరమైన విప్లవవర్గ చైతన్యం విప్లవ కవులకు పుష్కలంగానే వుంది. ఏవర్గ చైతన్యం, ఏ వర్గతత్వం అనే మీమాంసతో బాధపడేవాళ్లు వి. ర. సం.లో ఎవరూ లేరు. ఆత్మ విమర్శ అనేది నిరంతరం సాగుతున్న సంస్థ నాకు తెలిసి విరసం ఒక్కటే.

సామాజికదృష్టి గలిగి కళాత్మకంగా వుండాలనే వాదానికీ, విప్లవదృష్టి కలిగి కళాత్మకంగా వుండాలనే వాదానికీ తేడా లేదా? సామాజిక దృష్టి అనేది తెలుగు సాహిత్యరంగంలో పరస్పర విరుద్ధమైన అనేక అర్థాల్లో ప్రచారం చేయబడుతోంది సంఘ సంస్కర్తలకీ, జీవకారుణ్య వాదులకీ, మానవతావాదులకీ, కుల నిర్మూలన సంఘంవాళ్ళకీ, అభ్యుదయ కవులకీ, అందరికీ సామాజికదృష్టి ఒకటిగానే వుందా? విప్లవ వాదానికి బహుజన సుముఖత్వం సిద్ధించిందని చెప్పటం వాస్తవాన్ని వక్రీకరించటం కాదా? ఆరుద్రాదుల వంటి మద్రాసు అభ్యుదయ రచయితలకీ, అభ్యుదయ రచయితలకి. విప్లవ కవులకువున్న సామాజికదృష్టి ఒకటే అయితే ఈ భావపోరాటం ఎందుకు? ఆ మధ్య ఒక మద్రాసు అభ్యుదయ రచయిత 'బంగారు మేడల్లో నివసిస్తున్నా, సుఖశాంతులు లేక అల్లాడుతున్న ధనిక వర్గం వారినికూడ సోదరభావంతో, వారి అశాంతిని పోగొట్టి వారి నిత్యశాంతికి, శాశ్వితానందానికి దోహదం యిచ్చే కవిత్వం కూడా అభ్యుదయ కవిత్వమే—ఇది కూడా ప్రజాసేవే' అన్నారు. ఇది కూడా సామాజిక దృష్టేనా? ఉండవలసింది—వుండేది వర్గ దృష్టి; ప్రపంచ దృష్టి సామాజికదృష్టిలాటి గందరగోళ పదాలు శత్రువుల్ని తమలో కలుపుకొని మిత్రుల్ని నిషేధించే పరిస్థితికి దారి తీస్తాయి. ఇప్పటికీ మన సాహిత్యంలో ఫ్యూడల్ భావాలకే ప్రాచుర్యం వుంది. 'ప్రేమ, మానవత, అహింస, జాతీయత, భారతీయ కరణం, సంప్రదాయంలో మేలు, ప్రజాస్వామ్యం, అంతరాత్మబోధ, సాంఘిక న్యాయం' అని ఎన్నో ముసుగుల్లో బూర్జువా వుదారవాదం, జాతీయవాదం, అభ్యుదయం పేరుతో చలామణి అవుతోంది. మార్క్సిజాన్ని శాస్త్రంగా, శస్త్రంగా అంగీకరించినవాళ్ళూ, సాయుధ ప్రజా పోరాటాల్ని సమర్థించేవాళ్ళూ, మరో మార్గం ద్వారా రాజకీయాధికారం వచ్చినా వర్గరహిత సమాజ స్థాపనకు అవసరమైన విప్లవ వర్గం, విప్లవ నాయకత్వం సాయుధ విప్లవం ద్వారానే సాధ్యమౌతుందని విశ్వసించేవాళ్ళూ విప్లవ కవులు. కేవల ఆర్థిక పోరాటాలు, ఢిల్లీ ప్రదర్శనల వంటివి ప్రజల్లో విప్లవ చేతను అణగారుస్తాయని విప్లవ కవుల అభిప్రాయం.

'విప్లవం' అనే మాటను నేను అవంతి చెప్పే బహుజనాభిప్రాయమైన సామాజికదృష్టి అనే అర్థంలో వాడలేదు. అవంతిగారు తన సిద్ధాంత దృష్టిలోకి నన్ను ఈడవటం సమంజసం కాదు. నా వ్యాసాలన్నీ ఇంతకు పూర్వం ఆధునిక సాహిత్యంలో ప్రచారమై వున్న సామాజికదృష్టికి భిన్నమైన విప్లవ దృష్టిని, శాస్త్రీయ సామాజికదృష్టిని ప్రతిపాదించినవే. ఈ విభేదాన్ని స్పష్టంగా గుర్తించటానికి ఇష్టపడక పోవటంవల్లనే అవంతిగారు నా వ్యాసాల్ని పూర్తిగా దుర్వ్యాఖ్యానం చేశారు. శ్రామిక సంస్కృతి వర్గ సమాజంలో కూడా వుంటుంది. శ్రామికుల భౌతిక జీవితం వాళ్ల మనస్సులో Reflect అవుతుంది. అదే వాళ్ల సంస్కృతి. దోపిడి చేయబడే వాడి సంస్కృతి దోపిడి చేసేవాడి సంస్కృతి ఒకే రకంగా వుండదు. భాష సంస్కృతిలో ప్రధానాంగం. శ్రామికుల భాష ఇతరవర్గాల భాషకంటే భిన్నంగా వుంటుంది. కవిత్వంలో ఎన్నుకునే వుపమానాలు పోనీ భావప్రతిమలు (Images) శ్రామికుల ఆలోచన, అనుభవం పరిసరాలకు దగ్గిరగా వుండాలి. ఈ సామీప్యం విప్లవకవి ప్రయత్న పూర్వకంగా పొందవలసి వున్నది. ఈ అర్థం లోనే శ్రామిక సంస్కృతిని విప్లవకవి అర్థం చేసుకోవాలని చెప్పాను. రేడియో, టెలివిజన్, సినిమా, సాంకేతిక విద్యలు అసలు సంస్కృతికావు. సంస్కృతికి వాహికలు. భావప్రచార సాధనాలు. బూర్జువా సమాజంలో, బూర్జువా సంస్కృతినే ప్రచారం చేస్తాయి. సాంకేతిక విద్యలు బూర్జువా సమాజంలో సామాజిక శాస్త్రాలతో, జీవితంతో సమన్వయం లేకుండా వుంటాయి. వేటినీ వదలవలసిన పనిలేదు. అజ్ఞానం, మురికిపేటల్లో నివాసం, కాపు సారా తాగటం సంస్కృతికాదు కానీ బూర్జువా సంస్కృతి ఫలితాలే. మురికిపేటల్లో నివాసం వాళ్లకి ఇష్టమయి చేస్తున్నట్టు చెబుతారేం? పాలకవర్గంతోపాటు మురికిపేటలో రోడ్లు వేయించమనే వాళ్ళూ, అక్కడ మురికి గుంటల్లో D. D. T చల్లమనే వాళ్ళూ కూలి కాస్త పెంచమని బతిమాలే వాళ్ళూ కూడా శ్రామికులు మురికి పేటల్లో వుండటానికి కారణమే. 'Alienation of the labour' ని పట్టించుకోని వాళ్లందరూ కారణమే. శ్రమ విలు

వను, చారిత్రక పాత్రను గ్రహించి శ్రామికులతో బాటు తానూ ఎదుగుతూ, శ్రామికుల్ని పురోగమింపజేయటంకోసమే ప్రజల్తో కలిసి జీవించమని చెప్తాం. ఇంతకీ సంస్కృతి అంటే ఏమిటో అవంతి గారు చెబితే బాగుండేది!

'ప్రజ — భావాలు' వ్యాసంలో నేను ఎక్కడ గతి తర్క విరుద్ధంగా రాశానో అవంతిగారు చెప్పలేదు. ఆ వ్యాసంలోని ప్రధాన విషయాన్ని అర్థం చేసుకోడానికికూడా ప్రయత్నం చేయలేదు. భావాలనుంచి ఆచరణను వివరించే విధానం భావవాదులు చేస్తారు. భౌతిక ఆచరణనుంచీ భావాలు ఏర్పడే క్రమాన్ని (The formation of ideas from material practice) భౌతికవాదులు వివరిస్తారు. ఈ విషయాన్ని చెప్పటమే 'ప్రజలు—భావాలు' వ్యాస వుద్దేశ్యం. ఈ మౌలిక విషయాన్ని అవంతిగారు పట్టించుకో లేదు. ప్రజలంటే ఎవరు? అనేదానికి చారిత్రిక పరిస్థితులకు సంబంధం వుంది. చారిత్రిక దశనుబట్టి వ్యవస్థని మార్చటానికి విభిన్న వర్గాల ప్రజలు కలిసి పోరాటం చేయటం కూడా వుంది. ఫ్యూడల్ వ్యతిరేక పోరాటంలో బూర్జువాలు కూడా ప్రజల క్రిందే పరిగణించటం చేశారు గదా? ఎప్పుడైనా చైతన్యం అనేది ప్రజలకు అనివార్యమైన లక్షణమే. చైతన్యం లేకపోతే సంఘటిత కార్యాచరణ, సమిష్టి ఉద్యమాలు ఎలా సాధ్యమౌలాయి? అందరిలోనూ చైతన్యం సమంగా వుండక పోవటాన్ని అంగీకరించినా నా సూత్రీకరణ సరియైందేకదా! ప్రజలు కానియెడ వారు ఏ విధానం అనుసరిస్తున్నారో విభిన్నవాదాలుచేసే వాళ్లు చెప్తూనే వున్నారు. ఇందులో ఎవరికి తెలియంది ఏమీ లేదు. చైతన్యం వున్నా సిద్ధాంతదృష్టి లేక పోవచ్చు. సిద్ధాంత పరిజ్ఞానం చైతన్యాన్ని శాస్త్రీయ కార్యాచరణ వైపు నడిపిస్తుంది. చైతన్యం, సిద్ధాంతం రెండూ ఒకటి కాదు. అందుకని చైతన్యవంతమైన ప్రజలకు కూడా విద్యాబోధన అవసరం అవుతుంది. చైతన్యం వున్నవాళ్లకి విద్యాబోధన విద్యాబోధననుంచి చైతన్యవంతం చేయటం—ఎప్పైనా యిది అవసరమే. ఇదేమీ గ్రహించకుండా 'అద్యంతం అవగాహనా లోపాన్ని' నాకు అంటగట్టటం ఏం న్యాయం?

'విప్లవ కవిత్వం—సాంస్కృతిక పోరాటం' అనే వ్యాసంలో సాంస్కృతిక పోరాటాన్ని గూర్చి వివరించిందంతా వదిలేశారు. తన పిలుకోసం 'కవిత్వం కూడా ఒక ఆచరణ కార్యక్రమమేనని చాలామంది మరచిపోతున్నారు. విప్లవ కవికి సాంస్కృతిక పోరాటమే ఆచరణ' (పే. 15) అనే కీలక వాక్యం విస్మరించి వ్యాసాన్ని తన ఇష్టం వచ్చిన అర్థంలో వ్యాఖ్యానించి స్వీయ అభిప్రాయ ప్రకటనకు వేదిక నిర్మించుకున్నారు. ఇది ఏమాత్రం సమంజసమైన పద్ధతి కాదు. 'విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవోద్యమం లేదు. విప్లవ సిద్ధాంత దృక్పథం లేకుండా విప్లవ కవిత్వం వుండదు' (పే. 13). విప్లవ కవిత్వాన్ని ఇతర కవిత్వ ధోరణులనుంచీ స్పష్టంగా వేరు చేసేది ఈ లక్షణమే. 'విప్లవ కవికి సిద్ధాంతం ఆచరణ కలిసే వుంటాయి. కవిత్వం కూడా ఒక ఆచరణ కార్యక్రమమేనని చాలామంది మరచిపోతున్నారు. విప్లవ కవికి సాంస్కృతిక పోరాటమే ఆచరణ. విప్లవ కవికి విప్లవ కాముని 'వేషం' అనవసరం, అవాంఛనీయం. విప్లవకవి స్పష్టంగా ఇతరులకు అవగాహన కావాలి. విప్లవ కవులు స్వభావరీత్యా రెండు రకాలుగా వుంటారు. విప్లవ కార్యక్రమంలో, ఉద్యమంలో పాల్గొని విప్లవ కారుల మధ్యవుండి విప్లవ కవిత్వం రాసేవాళ్లు. కేవలం సాంస్కృతిక కార్యకలాపాలు పరిమితంగా భావ విప్లవం, పోరాటం ఆదర్శంగా విప్లవ కవిత్వం రాసేవాళ్లు. చిత్తశుద్ధిలోగాని, సిద్ధాంత దృష్టిలో గాని వీరిద్దరికీ తేడా లేదు. గ్రహించిన విప్లవ బాధ్యతలో మాత్రమే భేదం వుంది.' (పే. 15) అన్న వాక్యాలు నిమగ్నతనుంచి నిబద్ధతకు సర్దుకోవటాన్ని సమర్థించుకునే వాక్యాలా? విప్లవకారుడు కవిత్వం కూడా రాస్తే విప్లవకవి అవుతాడు. అతడు రెండు విభిన్న కార్యాలు చేపట్టాడు. పోరాటంలో నిమగ్నం కాని విప్లవకవి మాత్రమే అవుతాడు. ఎటొచ్చీ యిక్కడ చర్చించవలసింది విప్లవ కవిత్వం రాయటం, దాన్ని ప్రచారం చెయ్యటం ప్రజల్లో సంబంధాలు పెట్టుకొని రచనలు వినిపించి ప్రజా కవిత్వంలో గుణాత్మకమైన మార్పు తీసుకురావటం మొ॥నవి ఆచరణ పరిధిలోకి వస్తాయా? రావా? అనేది. నిమగ్నతకూ,

నిబద్ధతకూ మధ్యలో కంచుగోడ ఏమీ లేదు. ఉన్నది మంచు తెరే. విప్లవ సందర్భాన్ని అనుసరించి వ్యక్తియోగ్యతను అనుసరించి ఈ రోజు నిబద్ధకవి రేపు నిమగ్నకవి కావచ్చు. ఈ రోజు నిమగ్నకవి రేపు నిబద్ధ కవిగావచ్చు. ఉభయంకూడా కావచ్చు. ఖచ్చితంగా 'ఇదీ పద్ధతి' అని నిరయించటం ఎలా కుదురుతుంది? ఈ వ్యాసంలో అవంతిచూపిన 'స్వాభిప్రాయ వ్యాఘాతం' భ్రాంతి. ఆయన కల్పన. ఇక నా స్వాభిప్రాయ వ్యాఘాతానికి అవంతిగారు ప్రదర్శించిన మూడు కారణాలు వారి ఆలోచనమంచీ, దృక్పథంనుంచీ పుట్టినవే. విప్లవోద్యమంలో సాహిత్యకారుల స్థానాన్ని అతిశయంగా వూహించుకునే బాధ నాకు లేదు. దురాశగానీ, నిరాశగానీ రెండూ లేవు. భావరంగంలో విప్లవ రచన ప్రభావాన్ని తక్కువ అంచనా వేయటంకూడా పొరబాటే. కవిత్వం విప్లవాన్ని సృష్టిస్తుందన్న భ్రమలు ఎవరికీ వుండవలసిన అవసరం లేదు. సాహిత్యంలో అది ఒక నిజాయితీగల ధోరణిగా వుంటుంది. యువపాఠకుల్ని విప్లవ భావాలకు సన్నిహితం చేస్తుంది. ఆలోచనను పురికొల్పుతుంది. భౌతిక శక్తిని భౌతికశక్తే మారుస్తుందనేది నిజం. మానసిక శక్తి ప్రజల్ని ఆకర్షించ గలిగినప్పుడు భౌతికశక్తిగా మారటంకూడా నిజమే. కవులు, రచయితలూ, దృశ్యకళాకారులు గుంపులుగాపోయి విప్లవావశ్యకతని అనేక పద్ధతుల్లో ప్రచారం చెయ్యటంవల్ల విప్లవోద్యమానికి నిర్మాణాత్మక ప్రయోజనం వుందని మాత్రం విరసం గుర్తిస్తుంది. మత, మితవాద భావాలకి అవాస్తవిక మార్మిక ధోరణులకు, ఆచరణ స్పర్శలేని విద్యావిధానానికి, వర్గ న్యాయశాస్త్రాన్ని, పార్లమెంటరీ భ్రమలను రచనలే ఆయుధంగా ప్రతిఘటించి నిలబడవలసిన బాధ్యత విప్లవకవి తీసుకుంటాడు. సాయుధ విప్లవంతోనే సమగ్ర విప్లవం అయిపోతుందని ఎవడూ అనుకోడు. ఎన్నికల ద్వారానో, రాజ్యాంగ బద్ధంగానో పాలకపక్షాన్ని ఒత్తిడిచేసో, సమ్మెల ద్వారానో విప్లవం వస్తుందని మార్క్సిస్టు ఎవరూ అనుకోరు. సాయుధ విప్లవం విప్లవ ప్రథమ శ. శ్రామికులు రాజకీయాధికారం చేపట్టటానికి శాస్త్రీయమైన మార్గం. రాజకీయాధికారం మరో మార్గంద్వారా వచ్చే అవకాశమున్నా 'వర్గరహిత సమాజం' సామాజికంగా సిద్ధించాలంటే సాయుధ విప్లవంతో అధికారంలోకి వచ్చిన విప్లవవర్గం తప్పని సరిగా వుండాలనేది విరసం దృష్టి' నవమానవ సమాజ స్థాపనలో విప్లవం అనేది సుదీర్ఘ యాత్రని మాకు తెలుసు. సాయుధ విప్లవం సర్వేసర్వం కాకపోవచ్చుకాని కీలకం అదే. విరసం ఆత్మరక్షణ పరిధిని ఎప్పుడో దాటింది. మావో తెచ్చిన సాంస్కృతిక విప్లవం 'యాక్టివ్, పాసివ్' సభ్యులనే భేదం పాటించటానికా? ఇది అవంతిగారు ఆలోచించి అన్నమాటేనా? 'విప్లవ కవిత్వం—వాస్తవికత'లో అవంతిగారు ప్రస్తావించిన నా సూత్రీకరణలు ఏ విధంగా తప్పో చెప్ప లేదు. సామ్యవాద వాస్తవికతమీద ప్రపంచ ప్రసిద్ధ సోవియట్ సిద్ధాంతకర్తలు చెప్పిన విషయాల్నే నేను క్రోడీకరించాను. నాకు 'అవగతంకాని అసలు విషయం' ఏమిటో అవంతిగారుచెప్పి నాకు మార్గదర్శకం కావచ్చుగదా! దోష నిరూపణ పద్ధతి యిదేనా? ఏమీ చేయలేక 'పులుముడు' అని కొట్టి పారేస్తే ఎలా?' 'విప్లవ రచన ప్రమాణాలు' విమర్శ పరంగానూ, కవి పరంగానూ ప్రమాణాల్ని చర్చించిన వ్యాసం. 'భౌతిక జీవితమే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది' అనే విషయం రాజకీయపరంగా చెప్పటానికి రాశావని అవంతిగారు పేర్కొనటం సరికాదు. 'Life is not determinde by consciousness, but consciousness by life' అనేది మార్క్సియన్ సాహిత్య విమర్శనా విధానానికి పునాది మాత్రమేగాని అంతకంటే ప్రధాన సూత్రం 'The Phiilosoppers have only interpreted the world, in various ways; the point, however, is to change it. (XI') అనేది. దీన్ని విస్మరించి కళా విమర్శలో ఒక అడుగుకూడా ముందుకు వేయలేం. 'సంఘర్షణ తత్వం, చరిత్ర, జీవితం అన్నికలిపే రాజకీయం పేరుతో పిలుస్తాం' (పే. 31) అనేది నిర్వచనం కాదు. సందర్భానికి అవసరమైన వివరణ. ఒక రచయితలో రాజకీయం పరోక్షంగా వుండవచ్చు. ఏ విష

యం మీద కవి దృక్పథాన్ని విశ్లేషించినా అతడి రాజకీయ దృష్టిని సులువుగానే గ్రహించవచ్చు. వస్తు, శిల్పాలకు ఐక్యత వుండాలనేది సర్వకాలాల్లోనూ సామాన్య సిద్ధాంతమే. అయితే ప్రపంచ ప్రసిద్ధ గ్రంథాల్లోనే అంతటా యిది సాధ్యం కాలేదు. ఏదో ఒక సన్నివేశంలో శిల్ప ప్రాధాన్యమూ వుండనే వున్నాయి. గురజాడ కన్యాశుల్కంలోనే వస్తు ప్రాధాన్యత వుంది. ధ్యేయం సంఘ సంస్కరణ కాబట్టి అది సమర్థనీయమే అవుతోంది. 'ఇప్పుడు' అంటే తెలీటం లేదా? ప్రపంచ వ్యాప్తంగా ఫ్యూడల్, బూర్జువా, సామ్రాజ్యవాద శక్తులు ఓటమివైపు, సోషలిస్టు విప్లవ శక్తులు విజయంవైపూ ప్రయాణిస్తున్న వర్తమానంలో అని రాజకీయ పోరాటాలు ప్రభంజిస్తున్న ఈ క్షణంలో అని. ఇంతకీ ఒక రచనలోని వస్తుశిల్పాలు నూటికి నూరుపాళ్ళు ఐక్యంగా వుండటమంటే ఏమిటో నాకు అర్థం కాలేదు. శిల్ప, చిత్రలేఖనాల విషయంలో ఈ విషయాన్ని సులువుగా నిర్ణయించవచ్చును. కవిత్వం విషయంలో కొంచెం కష్టమే. విప్లవ రచనను విమర్శకుడు రాజకీయ, కళాప్రమాణాల్తో పరిశీలించవలసి వుంటుందని నేను చేసిన వివరణ తప్పుగా అవగాహన చేసుకోవటంవల్లనే అవంతి గారు గందరగోళంలో పడిపోయారు. నేను చెప్పని దానిని చెప్పానని చెప్పిన దానిని చెప్పలేదనీ నిర్ణయించే ఈ స్థితి చిత్రంగా వుంది.

'కవిత్వం—చైతన్యం' అన్న ప్రధాన వ్యాసంలో భౌతిక జీవితాన్ని చరిత్రపరంగా విశ్లేషించబోయానని చెప్పటంకూడా పాక్షిక సత్యమే' చైతన్యం సిద్ధాంతం కవిత్వం—కవిత్వం— విప్లవం అనే విషయాలకున్న శాస్త్రీయ సంబంధాలను వివరించటం ఆ వ్యాస వుద్దేశ్యం. 'భౌతిక జీవితమే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది' అనే సామాన్య సూత్రాన్ని, చైతన్యం భౌతిక జీవితాన్ని నిర్ణయించే ప్రత్యేక సందర్భాలను పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యాసానికి వైరుధ్య సిద్ధాంతం పునాది. అవంతిగారు ఈ దృష్టిని పసిగట్టలేదు. అర్థంకాని వాక్యాలు ఏమిటి? ఎందుకు అర్థం కావటం లేదు? గందరగోళం కొన్ని కారణాల వల్ల పాఠకుడిలోకూడా వుండటానికి అవకాశంవుందన్న స్పృహకూడా అవంతిగారికి లేకపోవటం న్యాయం కాదు. ఆదిమ సమాజంమీద నేను చేసిన చర్చంతా మార్క్స్, ఏంగిల్స్, మోర్గాన్‌వంటి మేధావుల భావాలమీద ఆధారపడిందే. 'ఆదిమవర్గ రహిత సమాజం అశాస్త్రీయమైనవర్గ రహిత సమాజం' (పే 37) అనేదికూడా సరైన అభిప్రాయమే. ఇందులో నేను పొరబడిందేమీ లేదు. శాస్త్రీయ వివరణకు అందేది శాస్త్రీయమే అనే దృష్టితోకాదు ఇక్కడ చూడవలసింది. ఆదిమవర్గరహిత సమాజం వర్గ సమాజంగా మారుతుంది కాబట్టి అది అశాస్త్రీయమైనది. మనంకోరే ఆదర్శవంతమైన వర్గ రహిత సమాజం తిరిగి వర్గ సమాజంగా మారే అవకాశం లేదు కాబట్టి అది శాస్త్రీయ వర్గరహిత సమాజం. 'అశాస్త్రీయ స్థితి' వచ్చింది కాబట్టి అశాస్త్రీయ వర్గరహిత సమాజం అనేది. ఆ స్థితి అంతిమ ఆశయమైన వర్గ రహిత సమాజానికిరాదు.' 'ఆదిమవర్గ రహిత సమాజం—వర్గసమాజం—వర్గ రహిత సమాజం' అన్న తర్కంలోని అంతర్యాన్ని అవంతిగారు గమనించలేదు. లేకపోతే గందరగోళమని వదిలేశారా? సమాజ పరిణామంలో చైతన్యంవహించిన పాత్రను, చారిత్రిక దశలను ఆధారంగా చేసికొని నిరూపించిన పద్ధతిని అవంతిగారు పట్టించుకోకపోవటంకూడా న్యాయంకాదు.' ఆదిమవర్గ రహిత సమాజం వర్గరహిత సమాజంకోసం వర్గసమాజంగా పరిణమించింది' (పే 37) అన్నవాక్యంలో 'సాహిత్యంగా రూపొందింది.' అని నేను వుద్దేశించినట్లు అవంతిగారు అనటం నన్ను అమాయకుడిగా జమకట్టడమే. ఆ సమాజం అంతా ఒక చోట సమావేశమై ఈ నిర్ణయం తీసుకుందని చెప్పేవాడు ఎవ్వడైనా వుంటాడా? ఈ వాక్యానికి ముందు వెనకల్ని కూడా వదిలిపెట్టి నేను వుద్దేశించటానికి అవకాశం లేని అర్థాన్ని తెచ్చి 'అర్థశూన్యమైన పాండిత్య గరిమ' పాపాన్ని నాకు అంటగట్టటం చాల ఘోరం. ఆదిమవర్గ రహిత సమా

జంలో, ఆ వ్యవస్థని నిలబెట్టుకునే చైతన్యం వుండదు. శాస్త్రీయ వర్గ రహిత సమాజంలో ఆ చైతన్యం వుంటుంది. చైతన్యానికున్న ఈ శక్తిని విరూపించటమే నా వుద్దేశ్యం. 'It ıequired the development of a class society to develop consciousness by ıts separatıon, but it requiıes the reappearence of a classless society to synthesise what has now grown pathologically farapart thinking and being, theory and practice' (Marx) అనే అభిప్రాయం నా చర్చకు పునాది. పాండిత్యాన్ని ప్రదర్శించుకోవా అనే లేకితనం నాకు లేదు. రాసేదేదో నిజాయితీగా రాద్దామనే కోరిక. స్వంత ఆలోచనలన్నీ 'మార్క్సిజం' పేరుతో రాయాలన్న ఎత్తుగడలు కూడా నాకు అనవసరం. ఐతే పైన పేర్కొన్న వాక్య నిర్మాణం సరిగా లేదని, అందుకే అవంతిగారు అక్కడ లేని అర్థాన్ని వెలిబుచ్చారని అనిపిస్తోంది. ఆ వాక్యం మరో విధంగా రాసివుంటే బాగుండేది. అది నా దోషమే. వస్తువు, శిల్పం, ప్రక్రియలను గూర్చి నా సూత్రీకరణలు చిత్రంగా కనిపించటానికి కారణం ఆధునిక విమర్శలో అవంతిగారికి తగినంత పరిచయం లేకపోవటమే అనుకుంటాను.

'వస్తు ప్రాధాన్యతే కవిత్వాన్ని తక్కిన కళల నుంచి వేరు చేస్తుంది' అనేది చిత్రమయినా సత్యమే. శిల్ప, సంగీతాదులకన్నా కవిత్వంలో వస్తువు ఎక్కువగా వుంటుంది కదా—

త్రిపురనేని మధుసూదనరావు

అంబాజీపేట 'గొడ్లవైద్యుడు?'

'భారతి' (మార్చి' 73) కలగూరగంప శీర్షిక చర్చ చదివాను. పేట పేరుబట్టి అంబాజీపేట సుప్రసిద్ధ వర్తక కేంద్రము, వాస్తవము. గత శతాబ్దము నుండీ కోస్తా వ్యాపారం కొబ్బరికుడీ, నూనె ఎగుమతులు మహారాష్ట్ర—బొంబాయితో జరిగెను.

మాచారం పేరు వ్యుత్పత్తి ఏదైనా ఏదో నొక దేవత పేరిట ప్రసిద్ధిమయ్యిందనుటకు అంబాజీ పేటలో మాచరమ్మ, మాచరయ్య పేరిట వ్యక్తులున్నారు.

కొర్లపాటి వీరాస్వామినాయుడుగారు 'గొడ్ల వైద్యుడు' కాదు. అనుభవైక విదులైన ఆయుర్వేద వైద్యులు, ఔషధ ఉత్పత్తిదార్లు. ఆయన వృద్ధాప్యంలో చూచాను. వారి మందులు తిన్నాను. ఆయుర్వేదంలో సిద్ధహస్తులు, 'చేయి చలువ' గలవారను (నిపుణుడు) ప్రతీతియుండెను.

జీయార్వీ



గ్రంథ విమర్శలు

'లే'

(కవితా సంకలనం)

వెల : రూ. 1–50 లు, బాలాజీ పబ్లిషర్సు. బజారు వీధి, తిరుపతి. (ఆంధ్రప్రదేశ్)

తిరుపతి యువకవుల 29 కవితలు, సాహిత్య సమాలోచనాత్మకమైన 'విప్లవ కవిత్వం ఎల్లా వుండాలి'నే వ్యాసం కలిపి, తిరుపతి విప్లవ సాహితి సంపాదకత్వాన వెలువడిన ఈ కవితా సంకలనం వెలువడుతూనే ఆంధ్ర ప్రభుత్వం ఆగ్రహానికి గురి అయింది. ఈ ఆగ్రహం అర్థం లేనిదని ఆంధ్రప్రదేశ్ హైకోరు అభిప్రాయపడి ఆ నిషేధాజ్ఞలు రద్దు చేసింది. ఇదంతా ఇటీవల, 1971 నవంబరునాటి కథ.

ప్రభుత్వం అభిప్రాయం, ఆగ్రహం ఎల్లా వున్నా తెలుగు ప్రజ ఈ సంకలనాన్ని ఆదరించేరు. నా చేతిలోవున్న ప్రతి దాని తాలూకు రెండో ముద్రణ ప్రతియనీ, ఇది మొదటి ముద్రణ జరిగిన ఏడాది లోపుగానే వచ్చిందనీ చెప్తే ఈ సంకలనకు లభించిన ప్రజాదరం అర్థం అవుతుంది.

ప్రజల్ని అంతగా ఆకర్షించిన వస్తువు ఇందులో ఏముంది?

నిత్యజీవితంలో ఎదురవుతున్న బాధలు, ఇబ్బందులు యెడ ప్రజానీకంలోవున్న ఆక్రోశం, క్రోధం, వాని నుంచి త్వరగా బయటపడాలనే ఆకాంక్ష, ఆతురత, ఇంకా ఎంతకాల మీ బాధలనే అసహనం, దారితోచక తెగబడాలనిపించే నిస్సహాయత, తెంపరితనం, ఆవేదనలు, ఆవేశాలూ ఈ కవితలలో ప్రతిబింబిస్తున్నాయి.

ఒకమాటలో ప్రచురణకర్తలు 'లే' కవులు మార్క్సిజంచేత ప్రభావితులైన వారుగా వర్ణించేరు. మరో మాటలో వీరు మార్క్సియన్ సోషలిజాన్ని నమ్ముతున్నారన్నారు.

అదొక అదనపు ఆకర్షణ. పెట్టుబడిదారీ పంథాదేశానికి అరిష్టదాయికంగా వుందనీ, తద్భిన్నమైన సోషలిస్టు పంథా ఒక్కటే శరణ్యమనీ దేశ ప్రజలలో ఏర్పడిన సాధారణ పరిజ్ఞానాన్ని ఈ కవులు తమ రచనలలో ప్రతిధ్వనించేరు. అదే ఈ ఆకర్షణ.

అయితే ప్రచురణకర్తలు గాని, లే, సమయమిదేలే' హెచ్చరిక నిచ్చిన శ్రీ శ్రీగాని ఈ కవితా సంపుటిలో కవిత్వపు విలువలకు claim కొంచెం కూడా పడెయ్యడం లేదు. వస్తువుకే వారిస్తున్న ప్రాధాన్యం. ఆ దృష్టితోంచే మనం దీనిని పరిశీలించాలి.

ఈ సంకలనం కవులు ప్రస్తుత వ్యవస్థలో మనకు కనిపించేవీ, మనం అనుభవించేవీ అనేక సాంఘిక, ఆర్థిక, రాజకీయ అసమానతలూ, అన్యాయాలూ మీాద చూపుతున్న ద్వేషం, కసీ సమర్థనీయం. అయితే వారు పొడూ గుతా తమ క్రోధాన్ని కొన్ని విషయాలమీాద చూపిన పద్ధతి ఆత్మవినాశకరంగా, అమార్క్సియంగా వుండడం విచారకరం. అటువంటివి రెండుమూడు చూపించడం ఆత్మ విమర్శకూ, పరిశీలనకూ తోడ్పడగలదనే భావిస్తున్నా.

వానిలో ముఖ్యమైనది చదువులూ, విశ్వవిద్యాలయాలూయెడ వీరు చూపే వ్యతిరేకత.

'కాన్సర్ వ్యాధిలా నరనరాల్ని కొరుకుతున్న విశ్వవిద్యాలయాలు' అంటారు, 'పోరాటం' అన్న కవితలో. 'సమాజవ్యవస్థ మీాదికి, చదువుమీాదికి'—తిరగబడాలని ఉద్బోధిస్తారు, 'కర్తవ్యం'లో, 'ప్రపంచాన్ని దూరంగా విసిరేసిన కళాశాలల్ల బలిపీఠాల్లో' అంటారు, 'నగరం

నవ్వుతోంది'లో. ఇల్లాగే పలుచోట్ల చదువులు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు గురించి చాల తీవ్ర వ్యతిరేకత, అథఃకరణం కనిపిస్తుంది.

వీరి వుద్దేశం ప్రస్తుత దేశ పరిస్థితికీ, అసమానతలకు, నిరుద్యోగానికి మూలం ఈ విద్యాలయాలనా? నేటి విద్యావిధానంలో కొన్ని లోపా లుండవచ్చు. ఆ విషయాన్ని నేటి సమాజం గుర్తించింది. ఆ లోపాల్ని సవరించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దాని ఫలితమే ఏడాది కేడాదికీ మారుస్తున్న, మారుతున్న మన విద్యా పద్ధతులు. కాని, వ్యష్టి ప్రధాన లోపం వేరు. సమాజ వ్యవస్థ మారాలి. పారిశ్రామికాభివృద్ధి జరగాలి. అప్పుడు కూడా సమాజాభివృద్ధికి అనుగుణంగా దేశంలో విద్యా విధానాన్ని మార్చుకొంటూనే వుండాలి. ప్రపంచంలో ఏదీ స్థిరం కాదు. పరిశ్రమలుపెడితే సాంకేతిక పరిజ్ఞానం వున్న కార్మికులు కావాలి సాంకేతిక విద్యకు పునాది సాధారణ విద్య. పరిశ్రమల పెరుగుదల విస్తృతేకాదు - వైశిష్ట్య మూ—తోపాటు సాంకేతిక విద్యస్థాయి, దానితో సాధారణ విద్యాస్థాయీ పెరగాలి. అంటే సోషలిజాన్ని కోరేవారు చదువుమీద తిరుగుబాటు బోధించకూడదు. ప్రజానీకాన్ని చదువుకోకుండా, విద్యకు దూరంగా వుంచాలనుకొనేవారు మనువు మొదలు నిజామువంటి ఫ్యూడల్ ప్రభువుల వరకూ ఎందరో వున్నారు. వారితో 'లే' కవులు గొంతు కలపడం ప్రజలకు అపకారం చెయ్యడమే. నిరుద్యోగం వంటి సమస్యలు పరిష్కరించలేకపోతున్నా, పెట్టుబడిదారీ వ్యవస్థ స్వప్రయోజనంకోసమైనా ప్రజలలో విద్యను పెంచితీరాలి. కనక ఆ విద్యను వ్యతిరేకించడం పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకించడంగా భావించేవారి నిజాయితీని అనుమానించే పరిస్థితి కల్పిస్తారు.

ఆలాగే 'నీ గుండెల్ని పిండి నీ శ్రమను దోచుకొనే ఈ ప్రణాళికలు అంటారు, ఒక కవితలో. ఇది 'అత్తమీది కోపాన్ని దుత్తమీద చూపడం' వంటిది. ఆర్థిక వ్యవస్థలో ప్రణాళికా పద్ధతిని మొదట ప్రవేశపెట్టినది లెనిన్. దానిలోవున్న ప్రయోజనాన్ని గమనించి నెహ్రూ ప్రభుత్వం దానిని భారత ఆర్థిక వ్యవస్థలోకి అంటు గట్టింది. సోషలిస్టు దేశంలో ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ విజయోపేతం కావడం, మన ఆర్థిక వ్యవస్థలో అది అడుగడుగునా అవరోధాలకు గురి కావడం వాస్తవం. దీనికి కారణం ఆర్థిక వ్యవస్థల స్వభావమే గాని, ప్రణాళికా పద్ధతిని అనుసరించడం కాదు. ఈ ప్రణాళికా విధానాన్ని భరించలేనివారూ, దానిని రద్దు చేయాలనేవారూ మన దేశంలో ఒక్క 'లే' కవులే కాదు. వారికి జనసంఘంవారూ, స్వతంత్రపార్టీవారూ ఆద్యులూ, గురువులూ అనవచ్చు.

ఆలాగే 'రాజకీయాల్లో ఐక్యసంఘటనల్లాగ ప్రయోజనంలేని వ్యవహారం'—అన్నారు సంపాదకులు వివిధ దృక్పథాల కవుల రచనలు సంకలించడానికి అధిక్షేపణ ప్రకటిస్తూ. ఈ భావం కూడా కవితంలోని భావాలకు సమఉజ్జీగానే వుంది.

ఒక్క విషయం చూస్తే ఈ అభిప్రాయం ఎంత అసంగతమో, ఆత్మ విఘాతకమో అర్థం అవుతుంది. సోషలిజం స్థాపించడానికి సాయుధ విప్లవమే ఏకైకమార్గమన్న విరసం కవుల అభిప్రాయాన్ని వాదనకు అంగీకరించినా, ఆ సాయుధ తిరుగుబాటు ఎల్లా నడపాలని వారి వుద్దేశం? పది పాతికమంది తుపాకులు తీసుకొంటే సోషలిజం నెలకొల్పబడదు. అత్యధిక ప్రజానీకం సాయుధంగానూ, సంపూర్ణ సహాయ సహకార లిస్తూనూ వ్యవహరించినప్పుడే బూర్జువావర్గంచేతినుంచి అధికారం గుంజుకోవడం సాధ్యం, 'మాకు విజయం అక్కర్లేదు. సోషలిజమూ పనిలేదు కొందర్ని చంపడం మేము చాడం మా సాయుధ విప్లవలక్ష్యం' అంటే వారు సోషలిజం, మార్క్సిజం మొదలైన ఉదాత్త పదాల్ని ఎత్తుకోనక్కర్లేదు. ఆలా గాక సోషలిజం స్థాపన లక్ష్యమయితే జనాన్ని—అశేష ప్రజానీకాన్ని—తమతో వుద్యమంలోకి తెచ్చుకోవాలి. అందుకు కొంత బిగువూ చూపాలి. సర్దుబాటు స్వభావమూ కనబరచాలి. ఐక్య సంఘటన స్వభావం అదే. తన అభిప్రాయాన్ని పట్టుదలకోసమూ,

ప్రతిష్ఠకోసమూ పట్టువిడుపులు లేకుండా ఏమాత్రం రాజీ పడనిది ఫ్యూడల్ మనస్తత్వం.

అన్నింటికన్నా ముఖ్యమైనదీ, అసలు సోషలిజం స్థాపనకు కీలకమైనదీ విప్లవం. విప్లవ పరిస్థితులు లేనిదే విప్లవం లేదు. విప్లవ పరిస్థితులున్నా విప్లవం వచ్చి తీరుతుందని లేదు. అనేకానేక అజ్ఞేయ విషయాలు సమీకృతం అయి విప్లవం వస్తుంది. అయితే ఆ అజ్ఞేయాల విలువలు క్షణంలో మారిపోతుంటాయి. శత్రువుకు నిర్మాణం వుంది. క్రమశిక్షణ వుంది. చిరకాలంగా అధికారం చేతిలో వుంది. వారిని వ్యతి రేకించే శక్తులు ఈ విషయాలన్నింటా వారికన్న ఎన్నో రెట్లు ఉన్నత స్థితిలో వుండాలి. లేకపోతే ఓడి, నాశనమయిపోతాయి.

భావకవుల కవితా సామగ్రిమీద ఇదివరలో వచ్చిన విమర్శవంటిదే ఈ సంకలనంలోని కవితల వస్తువు, కవితా సామగ్రిమీద వచ్చిన విమర్శలూ నని, అవి చవకబారుని అనీ తోసిపుచ్చడం తాము ఎత్తుకున్న మహత్కార్యంలోని బరువు, బాధ్యతలని గుర్తించడం అనిపించుకోదు. విప్లవంతో చెరలాట లాడడం అనిపించుకొంటుంది.

ఈ సంకలనంలోని కవితలన్నింటా ఉత్సాహం, ఉద్రేకం తొణికిస లాడుతున్నాయి. సందేహం లేదు. కాని, పక్కపక్కనే తమ లక్ష్యం, ఆ లక్ష్యసాధన విషయమై స్పష్టమైన అవగాహన లేకపోవడంకూడా కనిపిస్తోంది. అనేక విషయాలమీద 'లే' కవులు ఫ్యూడల్ మనస్థితిని తెలుపుతుండడంకూడా చిత్రంగా వుంది. ఈ కవితలవలన ప్రమాదంమేంలేదని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు అందుకే అభిప్రాయపడిందేమో ననిపిస్తోంది.

ఏదేమయినా వారన్నట్లు ఈ కవితలవలన ప్రభుత్వానికిగాని, సమాజ వ్యవస్థకుగాని ప్రమాదం లేదు. ఉన్నప్రమాదం ప్రపటోద్యమానికి. కారణం మార్క్సిజం, సోషలిజం, విప్లవం వగైరా పద జాలంతో వీరు ఫ్యూడల్ మనస్తత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. అసలు ప్రమాదం అక్కడుంది.

'విప్లవం వర్ధిల్లాలి'

(కవితా సంకలనం)

(వెల: రూ. 1–50 లు. ప్రతులకు—బాలాజీ పబ్లిషర్సు, బజార్ స్ట్రీట్, తిరుపతి. (ఆం. ప్ర.)

తిరుపతి విప్లవ సాహితి ప్రచురించిన ఈ కవితా సంకలనంలో 12 మంది విప్లవ కవుల రచన లున్నాయి. ఈ కవులంతా 'లే' సంకలనంలోని కవులే. అయితే దీనిలో వారి రచనలు ఒక మెట్టుపైన వున్నాయి, కవిత్వపు విలువల దృష్ట్యా.

కవితావస్తువురీత్యా 'లే' సంకలనంలో కవితలు ముందడుగు, పురో విజృంభణ (Offensive) ధోరణిలోవుంటే, విప్లవం వర్ధిల్లాలి లోనివి ప్రధానంగా డిఫెన్స్‌తో కనిపిస్తున్నాయి. ఉదాహరణకి—

మా వైపు గురి పెట్టబడిన ప్రతి తుపాకీ—
ఎదురు తిరిగి

నీపై బుల్లెట్ల వర్షాన్ని కురిపిస్తుంది.

(రక్తాక్షరాలతో రాం చందర్)

ఇవ్వాళ నువ్వు వున్నవాడి
బిస్కెట్లు తినే బొచ్చుకుక్కవి.
రేపు వాడ వేర్‌హౌస్ వెనక
కుప్పల్లో తిరిగే గజ్జికుక్కవి.

(పీడంతో త్రిపురనేని)

ఇల్లాగే ప్రతి కవితలో ఆ ఔద్ధత్యపు నిల బాటు కనిపిస్తోంది.

ఆనే విధంగా చాల కవితలలో వ్రుతవీరుల నామస్మరణం, జోహార్లు, భవిష్యత్తులో మరల విజృంభించగలదనే ఆశాభావం ప్రకటితమవుతూంది. ఉదాహరణకి—

ఆకలి సత్యానికి
పోరాటాల పాణిగ్రాహికి
సత్యాల నాగభూషణునకు
అరుణపతాక నిర్మలకు

విశ్వవిద్యాలయాన్ని
శిక్షిత ఉపాధ్యాయుణ్ణి.

(కదులుతున్న చరిత్రలో అత్తలూరి)

వీడు తేజేశ్వరుడు
భాస్కరుడు

ఆ చల్లని కన్నుల్లో పొడచూపుతోంది - నిర్మల ఛాయ.

వీడు కలకాలం నిలిచే
ప్రజాసత్యం
ఇక ఫరవాలేదు
అన్యాయాన్ని జయిస్తాడు.

(ఉదయంలో హనీఫ్)

ఇల్లాగే ప్రజాపోరాటాలలో నేలకొరిగిన జైళ్ల పాల్పడిన యోధుల సంస్మరణం వారి త్యాగాలకు జోహార్లు పలువురు కవులు తెలుపుతున్నారు.

ఆశయ పోరాటంలో రాలి పోయినా—వృధాకాదు జీవితం.

విప్లవ బాధ్యతలో కరిగి పోవడం చావు అనిపించుకోదు.

(విప్లవం వర్ధిల్లాలిలో త్రిపురనేని)

అంటూ తమకు తామే ధైర్యం చెప్పుకోవడం కనిపిస్తుంది.

మొండిగ ముందుకు పోవటంకన్నా,
అవగాహన అనుసంధానించుకోవటం మిన్న

(అపజయం విజయానికి తల్లితో 'భూమన్')

—అంటూ ఆత్మపరీక్షా ప్రారంభమూ వినిపిస్తోంది. అంటే ఒక విధంగా ఈ కవితలలో విప్లవోద్యమం వెనకబట్టినట్లు కవుల గుర్తింపు వినిపిస్తోంది.

కాని రెండో వేపున 'తె' కవితలలో కనిపించిన సామాజిక పరిజ్ఞానలోపం ఇందులో కూడ అంత బలంగానూ వుంది. చదువులూ, విశ్వవిద్యాలయాలపై అసమర్ధనీయమైన ఆ క్రోధం సర్దుకోలేదు. పైగా, తమ మార్గాన్ని సరికాదన్నవారిని తమ వైఫల్యానికి కారణంగా నిందించడం ఈ కవితలలో చాలచోట్ల కనిపిస్తుంది.

సాంఘిక న్యాయం సాధించటానికి
సాయుధ పోరాటంతో
దోపిడీ దగాలమీద తిరగబడితే
....
ఓ శాంతి జపం గాదు
బందిపోట్లు అని పాడిచేడు.

పూసుకొన్న ఎర్రపౌడర్ చెరిగినవాడు—సాహసవాదం అన్నాడు.

(ప్రభాత కిరణాలులో రాజారెడ్డి)

నింపాదిగా గుర్తించిన సత్యాన్ని సాయుధ పోరాటం నిరూపిస్తోంటే ఎన్నికల్ని ఎక్స్ప్లాయిట్ చెయ్యాలంటాడే!

....
వాడు దోపిడీదారు
ప్రజా శత్రువు
వాడి రక్తం చిందితేనే
.... విప్లవం వర్ధిల్లుతుంది.

(గుండెల్లో డైనమైట్లు పేలాలిలో భూమన్)

ఈ విధంగా విప్లవం వెనక బట్టడానికి ఒక 'స్కేప్ గోట్'ను వెతికి పట్టుకొని, దానిమీద తమ కసి కురిపించడం పొడుగునా చాల కవితల్లో వినిపిస్తుంది. దానితోబాటు ఈ యుగం సాయుధ రూపంలోనే విప్లవిస్తుంది—'విప్లవం వర్ధిల్లాలి.'

(విప్లవం వర్ధిల్లాలిలో (త్రిపురనేని)

—అంటూ 'శే'లో వినిపించిన పల్లవినే ఇక్కడా వినిపించడం— 'అవగాహన ననుసంధించు కోవడంమిన్న'—అనే పూర్వప్రతిజ్ఞను విస్మరించడమే అవుతూంది.

యుద్ధంలాగా, ఇతర ఏ కళలాగా తిరుగుబాటు కూడా ఒక కళ. దానికి కొన్ని నియమాలున్నాయి. వానిని విస్మరించిన వారు పతనం పొందుతారు— అంటారు ఏంగెల్సు ఒక చోట.

అగ్రగామి శక్తులొక్కటే విజయాన్ని సాధించలేవు. మొత్తం వర్గం అంతా విస్తృత ప్రజానీకం యావత్తూ అగ్రగామి శక్తులకు సరాసరి మద్దతునివ్వడానికి సిద్ధం కావడమో, కనీసం సానుభూతితో కూడిన తటస్థత నవలంబించడమూ, శత్రువుకు సాయం ఇవ్వకుండడమో జరగకుండా అగ్రగామి శక్తుల్ని నిర్ణయాత్మకమైన పోరాటంలోకి పురికించడం కేవలం మూర్ఖత్వమే కాదు, మహానేరం కూడా. అణచివేయబడిన విస్తృత కార్మిక ప్రజానీకం, ఒక వర్గం మొత్తంగా ఆ పంథా ననుసరించడానికి ప్రచారం, ఆందోళనామాత్రం చాలవు. అందుకు ప్రజానీకానికి స్వంత రాజకీయానుభవం కావాలి—అన్నారు లెనిన్.

కాని మన కవులకు అదేం పట్టినట్టు తోచదు. వారికి ప్రజానీకం పడుతున్న కష్టాలయెడ అనంతమైన సానుభూతి వుంది. (ఆయుధమే అందిస్తాలో హసీఫ్). అందులో సహానుభూతి లేదు. కనుకనే

శత్రువుల తూటా దెబ్బలకు

మా నుంచి కారుతున్న ప్రతినెత్తురుబొట్టులో

వికసిస్తున్న భావిచరిత్ర పుటలకే

మా కలాలు అంకితం

మా ఆశయం

మా ఆచరణ

మా ఆచరణ

మా ఆశయం

మా పోరాటం

మా చైతన్యం

(పోరాట—చైతన్యంలో హసీఫ్)

—అంటూ మా, మా మధ్య ఆచరణలనూ, ఆశయాలనూ విభజించ గలిగారు. ఈ వాటా పంపకం విప్లవం వర్ధిల్లడానికి తోడ్పడదనీ, 'నువ్వు పొడుచుకొనే వీరాంగం ఆడుతాన'నే మాదిరి వంచనా శిల్పానికి దోహదం ఇస్తుందనీ మిత్రులకు గుర్తు చెయ్యడం అవసరం.

మ హ తి

(వెల: 20 రూపాయలు. యువ భారతి, కింగ్స్‌వే, సికింద్రాబాద్-3; (ఆం. ప్రదేశ్.)

స్వాతంత్ర్య యుగోదయంలో (1947–72) తెలుగు తీరుతెన్నులు తెలుపుతున్న నూటఒక్క సమీక్షా వ్యాసాల సంకలనం ఇది. ప్రస్తావనలోని నాలుగూ కలిపితే నూటఅయిదు. ఒక విధంగా మన అభివృద్ధి తీరుతెన్నులకు వానిని కూడా సూచికలుగా గ్రహించవచ్చు. బహుశా ఆ దృష్టితోనేనేమో ప్రచురణ కర్తలు వానిని నాలుగింటినీ మహతి సప్తస్వరాలతో షడ్జమం స్థానం ఇచ్చేరు.

ప్రవేశంలోని 18 వ్యాసాలలో తెలుగుదేశం ఆర్థిక, సాంఘిక వస్తుభేదంపట్టి గ్రంథం ఏడు భాగాలు చేయబడింది. ప్రస్తావన, ప్రవేశం, ప్రతిభ, ప్రయోగం, పరిశీలన, ప్రస్తారం, ప్రభావం— గా నానికి నామకరణ చేశారు. పుటల ముద్రణ చాల అస్తవ్యస్తంగా చేసేరు. ఏభాగాని కాభాగానికి పుటల సంఖ్య వేరే ఇచ్చేరా అంటే అదీ లేదు. మూడు, నాలుగు, ఐదు భాగంలో కొంతకు పుటల సంఖ్య వేరు. ఐదో భాగంలోని భాషా విభాగం ఒక్కదానికీ పుటల సంఖ్య వేరు. ఇంత గంద్రగోళం ఎందుకు సృష్టించాలో అర్థం కాదు.

రెండోభాగం ప్రవేశంలో 18 వ్యాసాలున్నాయి. వానిలో తెలుగుదేశపు ఆర్థిక సామాజిక, సాంస్కృతిక రంగాల వివిధ విభాగాల అభివృద్ధుల తీరుతెన్నులను పలువురు ప్రముఖులు వివిధ దృక్పథాలనుంచి వివరించేరు.

'ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి' గురించి వ్రాయదలచిన డా. ఎ. నాగరాజ్ అసలా విషయాన్నే ముట్టలేదు.

'గ్రామీణ సంస్కృతి—మారుతున్న ధోరణులు' వ్యాసంలో శ్రీ జె. వి. రాఘవేంద్రరావు తెలుగునాట గ్రామసీమలలో వచ్చిన మార్పులను పేర్కొన్నారు. రైతాంగంలో వర్గభేదం నిశితం అవుతూండడాన్నీ, అధిక సంఖ్యాక రైతాంగం శ్రామికులుగా మారిపోతూండడాన్నీ గుర్తించేరు. 'గ్రామీణ సంస్కృతిలో ఉపాంతమైన మార్పులే గాకుండా, మౌలికమయిన మార్పులు రావడం చాలా అవసరం. లేకపోతే సామాజిక సంబంధాలలో వ్యత్యాసాలు, అసమానతలు పెరిగి...సమాజాన్ని సంక్షోభంవేపు నడిపిస్తవి. ఈ దృగ్విషయాన్ని కొంతవరకు శ్రీకాకుళం సాయుధ వుద్యమంలో చూసినాము.' 'సుమా'యని హెచ్చరిస్తున్నారు.

శ్రీ కె. వి. రమణారెడ్డిగారి 'తెలుగు సాహిత్యం—మార్క్సిజం ప్రభావం'— అనేది అమార్క్సీయ, అతివాద ధోరణిలో వ్రాసిన వ్యాసం. మార్క్సిజం అన్నది ప్రపంచాన్నీ, సమాజాన్ని, చరిత్రగతిని అవగాహన చేసుకొనే పద్ధతి. మనం వున్న సమాజంలోని స్థితిగతులు, మన సంస్కారం ఆ పద్ధతిని ఎంత లోతుగా అవగాహన చేసుకోగలమో నిర్ణయిస్తాయి. దానిని శ్రీ రమణారెడ్డి ఎరుగును. కాని విరసం 'చాదస్మో' ఆయనకు సమగ్రదృష్టి నివ్వలేకపోయింది.

సమకాలీన సుప్రసిద్ధ భాషా సాహిత్యాలు—తెలుగు, ప్రవాసాంధ్రుల వాఙ్మయసేవ, ప్రభుత్వము—అధికారభాష మొదలయిన వ్యాసాలు ఎంతో సమాచారం ఇస్తున్నాయి.

3 వ భాగం ప్రతిభలో కవితామూర్తులు, సంప్రదాయ, విప్లవ కవిత్వాల నాయకులు అయిన విశ్వనాథ, శ్రీశ్రీ లు తమతమ సాహిత్యాధ్యవసాయం తెలుపుతూ వ్రాసిన వ్యాసాలు కూర్చబడినాయి.

తరువాత భాగాలు మూటిలో (ప్రయోగం, పరిశీలన, ప్రస్తారం) వివిధ సాహిత్య ప్రక్రియలలో ప్రగతిని చిత్రిస్తున్న రచనలు చేర్చబడినాయి.

ఆఖరుభాగం 'ప్రభావం' వివిధ రాజకీయవాదాల ప్రభావం సాహిత్యంలో, ప్రచారంగాలలో, పత్రికలలో ఏలా వుందో తెలిపే వ్యాసా లున్నాయి.

ఏ సాహిత్యం గానీండి, ఆ సమాజంలో, ఆ కాలంలో వున్న సగటు సంస్కృతికి కొంచెం అటూ ఇటూగా వుంటుంది. ఆ ప్రాథమిక సత్యాన్ని అర్థం చేసుకోకుండా, తెలుగు సాహిత్య ప్రక్రియలను నూరేళ్ళ క్రితపు కొలబద్దలతో కొలవబోయినా, వానిలో పాశ్చాత్య సాహిత్యాల పరిణతిని చూడబోయినా—'మననాళ్ళు వట్టి వెధవాయలోయ్'—అన్న గిరీశం ముక్తాయింపుకు రాక తప్పదు.

'పాత యుగం చచ్చింది. కొత్త యుగం బోధపడదు. అంచేత నేటి సాహిత్య సర్దారులూ, సర్దారిణులూ కాశీ మజిలీ పాత్రలకు స్ట్రైట్ ప్యాంట్లూ మినీలంగాలు తొడుగుతున్నార'ని శ్రీ గోరాశాస్త్రి అనడానికీ,

'మళ్లీ ఏ భగీరథుడో వచ్చి ఆకాశగంగను తెచ్చి, పాతాళంవరకూ ప్రవహింపచేస్తేనే తప్ప తెలుగు నవలకు పుణ్యగతులు లేవు గాక లేవ'ని శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మ శపథం చేయడానికీ,

'అభ్యుదయ కవిత్వము, విప్లవ కవిత్వము ఒక భాషాయానంలో అప్పుడప్పుడు కలిగే ఒడిదుడుకులే!' అని శ్రీ మరుపూరి కోదండరామిరెడ్డిగారు 'కాలక్రమేణా ఆంధ్రభాష ఒక విశిష్ట స్పష్ట రూపాన్ని పొందగల'దని ఆశించడానికీ గల మూలం ఇదే. వీరి వ్యాసాలు చదువుతే తెలుగు సాహిత్యరంగం ఇంత నిస్పృహ్వరంగా వుందా అని హడలిపోతాం.

కాని, రెండో ప్రక్కన మధురాంతకం రాజారాం, మిరియాల రామకృష్ణ, ఆర్. ఎస్. సుదర్శనం, అక్కిరాజు రమాకాంతరావు, మహీధర నళినీమోహనరావు, ముకురాల రామారెడ్డి మొదలైనవారి వ్యాసాలు చదవండి. 'ఫర్వాలేదు. మనమూ బ్రతికే వున్నామ'ని పిస్తుంది.

అయితే వ్యాసాలలో కొన్నిచోట్ల వ్యాసకర్తల పొరపాట్లు అపహాస్యజనకంగా వున్నాయి. అభిప్రాయాలు భిన్నంగా వుండొచ్చు. ఒకరి అభిప్రాయం నాకు తప్పుగా తోస్తే ప్రమాదం లేదు. అసలు తప్పులు వాస్తవాల విషయంలో.

'తెలుగువారి సాహిత్యాభి రుచులన్న వ్యాసంలో' కొడవటిగంటివారి 'ఇప్పుడు వీస్తున్న గాలి' అనే పుస్తకాన్ని ప్రభుత్వం నిషేధించింది అన్నారు. అదొక కథల సంపుటి. దానికి కొడవటిగంటివారు పీఠిక వ్రాసేరు. దానికి వారినే కర్తల్ని చేసిపెట్టేరు, వ్యాస రచయిత.

ఆలాగే 'నవలలు—మహిళలు' అన్న వ్యాసంలో మరో రకమైన తప్పు(?) 'సంఘం విధించిన కట్టుబాట్లను నిర్భయంగా ఎదిరించి నవలలు వ్రాశారు, చలంగారి హేమలత.'—ఎవరీమె?

ఇటువంటి పొరపాట్లు వున్నా వ్యాస రచయితల శ్రమా, వారికిగల పరిమితులూ కూడ పుస్తకంలో పొడాగునా కనిపిస్తున్నాయి. ఈ నూరు వ్యాసాలు చదివేక కూడా తెలుగు రచయితల పేర్లూ, పుస్తకాల పేర్లూ (అదైనా స్వల్పభాగం మాత్రమే) కనిపిస్తాయిగాని మన సాహిత్య ప్రక్రియలలో వచ్చిన మార్పులూ, పరిణామాలూ అర్థం కావు.

దీనికి ప్రచురణ కర్తలు ఈ వ్యాస సంకలనానికి వేసుకొన్న పథకంలోనే లోపం వుంది. ఆ లోపం వారి చేతనే ఈ బాధ 'పగవాడికేనా వద్దు' అనిపించడంలో వ్యక్తమయింది.

ఈ సంకలనంలోని వ్యాసకర్త లెవరూ అనామకులు కారు. కాని సకాలంలోగాని, నిర్దేశించిన విషయం మీదగాని ఎందుకు వ్యాసాలు పంపలేకపోయేరు? తెలుగు దేశపు పరిస్థితులవి. మన రచయితలలో నెలకు ఓ పది రూపాయలు పుస్తకాలకోసం ఖర్చు పెడుతున్నామని చెప్పుకోగలవారెందరున్నారు? పైగా ప్రచురణ కర్తలు ప్రభుత్వ గ్రంథాలయాలు, ఆ వుద్యోగుల కిచ్చే లంచాలు దృష్టితో పుస్తకాల ధరలు ఎల్లా పెంచేస్తేరో ఎరుగుదుం. లంచాల స్థాయిమంచి పుస్తకాలు కొనే గ్రంథాలయాలు ఏవిధంగా వుంటాయో అంతా ఎరుగుదురు. ఈ స్థితిలో చదివిన పుస్తకాన్నే అయినా, మన మనస్సులో కలిగిన భావాన్ని సరిచూసుకుందామంటేకూడ పుస్తకం దొరకడంలేదు. జ్ఞాపకం మీద వ్రాయాలి. పైన చూపినమాదిరి తప్పులూ, పొరపాట్లూ రావడానికదే కారణం. బాగా రాయాలనే దృష్టితో గడువు పెంచుకుంటూ ప్రచురణ కర్తలకు బాధ కలిగించేరంటే కూడా ఆదే కారణం.

అంతే కాదు. నవలా సాహిత్యం గురించిన ఏడు వ్యాసాలలో అవే పుస్తకాలు, అదే రచయితల పేర్లు పదేపదే పునరుక్తం కావడం, కొందరు మంచి రచయితల పేర్లు కూడా ఎవరికీ గుర్తులేదు. బాల, కిశోర వయస్కులకు శాస్త్రవిజ్ఞానం కలిగించడానికి శ్రీ మహీధర జగన్మోహనరావు వ్రాసిన 'యక్ష ప్రశ్నలు', (చాల ప్రజాదరం పొందినదే) శ్రీ మహీధర నళినీమోహనరావు వ్రాసిన 'వినోదం—విజ్ఞానం' గాని బాలసాహిత్య వ్యాసకర్తకి అపరిచితాలు. ఈ మాదిరి లోపాలను ఎల్లా దిద్దుకోడం?

యువభారతివారు ఈ మహతి ప్రచురణకు పూనుకోవడం సాహసంతో కూడిన పనే అయినా ప్రశంసనీయం. ప్రభుత్వమో, దాని సహాయంగల అకాడమీలో ఎత్తుకోగల పనిని ఒక సామాన్య సాహిత్య సంస్థ తీసుకోడం, ఎన్ని కష్టాలువడ్డా, మనఃక్షోభకు గురి అయినా ఎత్తుకున్న పని పూర్తి చేశారు. చాల గర్వించతగినదే సందేహం లేదు.

అయితే ఇంతకన్న ప్రయోజనాత్మకంగా చేయడానికి దారిలేకపోలేదని నా వుద్దేశం. కాలాన్ని పట్టో, విషయవస్తు ప్రాధాన్యం పట్టోగాక ప్రముఖు లనదగిన రచయిత లొక్కొక్కరిని విడివిడిగా ఒక్కొక్కరికివ్వడం, వారి రచనలు తీసుకొని మంచిచెడ్డలు సమగ్ర పరీక్ష వ్రాయించడం, అందరు రచయితల మీదా ఒక్కమారే వ్రాయించ లేకపోవచ్చు. అన్ని సాహిత్య ప్రక్రియల మీదా కూడా ఒక్కమారే వ్రాయించ లేకపోవచ్చు. నాలుగైదేళ్లలో ఒక రౌండ్ పూర్తి చేయువచ్చు. అట్టువంటి ప్రయత్నాలు కొంత

పునాది కల్పిస్తాయి. దానిమీద కాలవిభజన, వస్తు విభజన, శిల్పభేదాలురీత్యా సమగ్ర పరిశీలన సాధ్యం అవుతుంది. సాహిత్య ప్రక్రియలకూ, రచయితలకూ న్యాయం చేకూరుతుంది.

మహతి కూర్పుకై ఇప్పుడు జరిగిన ప్రయత్నం నిజంగా జరగవలసింది అప్పుడు.

"అవంతి"

నాలుగు నవలలు

(రచయిత : శ్రీ సి. నరసింహారావు. ప్రచురణ: చైతన్య పబ్లికేషన్సు, ఏలూరురోడ్డు, విజయవాడ–2. మూల్యము : ఒక్కొక్కటి అయిదు రూపాయలు. సైజు క్రౌను: పుటలు 196: 192: 174: 122.)

శ్రీ చల్లగుళ్ల నరసింహారావుగారు వ్రాసిన సంఘర్షణ, అశాంతి, స్తబ్దత, సమీక్ష అను నాలుగు నవలలు 1972 ఆగస్టునెలలో కృష్ణాజిల్లా రచయితల సహకార సంఘ ప్రచురణలుగా వెలువడినవి. 'స్తబ్దత'కు శ్రీ పి. రాజగోపాలనాయుడు ఎం. యల్. సి. గారి పీఠిక వంటి పరిచయము మంగళాశాసనమన్న పేరుతో కలదు. మిగిలిన వాటి కట్టి పీఠికలు లేవు.

శ్రీ నరసింహారావు గారికి ఆసక్తిదాయకముగా విషయ వివరణము చేయుటయందును, సంఘటనల మీద, సన్నివేశములమీద కథను నడిపించుట యందును నేర్పు కలదనుటకీ యన్ని నవలలును నిదర్శనములే.

సంఘర్షణ : మనిషిలో సహజముగా హృదయ పరివర్తనమువచ్చి సమాజము బాగుపడవలయునన్న ఒక విధమైన తాత్త్విక దృక్పథమునకును ఉన్న వానిని కొట్టి లేనివానికి పెట్టుటయే సరియైన పద్ధతియని పదిమందిని కూడగట్టుకొని ప్రభుత్వమును కూడ మోసము చేయుచు స్వార్థపరులయి ప్రవర్తించెడువారి లక్షణమునకును ఈ నేటి కాలమున దేశవ్యాప్తముగా గ్రామసీమలందు మొదలుకొని జరుగుచున్న సంఘర్షణమును వాస్తవముగా చిత్రించిన మంచి చిన్న నవల ఇది. శ్రీపతి తాత్త్విక దృక్పథము కలవాడు. పాపయ్య రంగారావు స్వార్థపరులు. రంగారావును అటుంచినచో శ్రీపతి ఉన్నత కులములోనివాడు. పాపయ్య దళిత కులమువాడు. ఇప్పుడు ప్రభుత్వము పేరుమీద కూడ సాగుచున్న సోషలిస్టు ప్రచారమును పెట్టుబడిని దళిత వర్గములవారే స్వార్థమున కుపయోగించు కొనుచున్నారనియు ప్రభుత్వ సహాయమును వారు దుర్వినియోగము చేయుచున్నారనియు వారిలో మార్పు వచ్చినగాని ఈ సమాజమునకు మొక్కలు లేదనియు తన దృఢ విశ్వాసమును రచయిత శ్రీ నరసింహారావుగారు విస్పష్టముగా పునాదిచేసి ఈ నవలను రచించినారు.

ఇంత సాంఘిక దృక్పథముగల రచయిత అనసూయను, రాఘవరావు భార్యను శీలములేనివారుగా చిత్రించి ఏమి అధిక ప్రయోజనమును వారి విషయమునగాని వారి భర్తల విషయమునగాని సాధించినారన్న ప్రశ్న కుచితమైన సమాధానము స్పష్టముగా కనిపించుట లేదు. ప్రయోజనము లేకుండ మన పల్లెటూళ్లలో మన సమాజమిటు వ్యభిచరించుచున్నదని చెప్పుట ఉబుసుపోక విషయముకాని సాహిత్య విషయము కాదు.

ఈ సమాజము మారవలసినట్లుగా మారుట కలలో విషయముగా నున్నదన్న అభిప్రాయమును స్ఫురింపజేయుచు రంగారావుకల అద్భుతముగా నున్నది.

అశాంతి : అవసరమును మించిన ఆలోచనల పేనుడు తప్ప జీవితముపట్ల ఏవిధమైన దృక్పథము గాని లేని సామాజికమును వైయ్యక్తికమును అయిన బలహీనతలు గల ఒకానొక వర్తమాన మాధ్యమిక కుటుంబములోని హాని ముసుగులో గ్రుడ్డులాట మనస్తత్త్వమును చిత్రించిన నవల అశాంతి. ఇది ఒక వృథా జీవితమును అనేక కోణములనుండి దర్శనము చేయించు నవల. రచయిత శ్రీ నరసింహారావుగారు శ్రీపతి వక్తగా ఉత్తమ పురుషలో ఈ నవలను రచించినారు. రచయిత కనిపించుటకు వీలులేనిదైనను ఇందు శ్రీపతి తన విషయముల నెంత సావకాశముగా చెప్పికొన్నాడో ఇతరుల విషయములను కూడ అంతే సావ

కాశముగా చెప్పి నవలకు న్యాయము చేసినాడు. రచయిత ఆ విధముగా శ్రీపతిలో మేల్కొని ఈ నవల నింత నిబిడముగా రచించినారు. శ్రీపతి యందు రచయిత మేల్కొని యున్నాడన్నందుకు విమలా రాజారావుల సంబంధ కథను నిదర్శనముగా చూడవచ్చును.

పూర్వాపరము మీాద పరుచుకొనిపోవు ఆలోచన లేక ఎక్కడికక్కడ తాత్కాలికమైన దురహంకారము తోడి వ్యాఖ్యాన వైఖరిలో పడి కొట్టుకొనిపోవు ఒక ఒడ్డుకు చేరుటలేని జీవితముయొక్క దుర్భరతను శ్రీపతియందు ఈ నవల విస్పష్టముగా ప్రకటించు చున్నది. శ్రీపతి అల్పజీవికాడు. అసమర్థుడనుకాదు. చదువులేనివాడుకాదు. సంస్కారములేనివాడనుకాదు. ఒక్క బుద్ధివికాసమే సక్రమముగా లేదు. దానితో వాడొక నరకమును సృష్టించుకొని యమయాతన పడినాడు. ఒకానొక విపరీత మనస్తత్వమును వ్యక్తీకరించిన నవల ఇది.

స్తబ్దత : స్వాతంత్ర్యము రాక పూర్వము మాటనట్లుంచినచో వచ్చిన తరువాత క్రమముగా రోజుకు రోజుకు ఇక్కడ అక్కడ అని లేకుండ ఈ కులము ఆకులము అనిలేకుండ ఇందుకు అందుకు అని లేకుండ మొత్తముమీాద మధ్య తరగతి మనుష్యులలో వరకు అవినీతి ఎక్కువై పోవుచున్నట్లుగా అనిపించుచున్నది. ఈ వాస్తవమైన అనుభవమును శ్రీ నరసింహారావుగారు ఇట్లొక చక్కని నవలగా వ్రాసినారు. నిండాస్తబ్దత ఆవరించుకొన్న ఓ అసమర్థుని గమ్యం లేని పయనంగా రంగనాథం జీవితమున్నందున ఈ నవల కీపేరు పెట్టబడినట్లున్న దనుకొనుటకు వీలు లేదు. ఇందులో వచ్చిన పాత్రలందరును సారథి అనూ రాధ వేణు కుసుమ ఈశ్వరమ్మ మాధవమ్మ సునంద జానకి సుబ్రహ్మణ్యం ఈ మొదలైన వాళ్లందరు వ్యక్తిగతముగా చైతన్య పురుషులేగాని స్తబ్ధులు కారు. కాని వారియందున్న చైతన్యము సామాజికాభ్యుదయమునకు దోహదము చేయగలిగినది కాదు. అందువల్ల ఈనాడు ప్రజాబాహుళ్యమునందు వర్గ చైతన్యము లేక సమాజము కుటిలగతులు గలిగి స్తబ్దముగా నున్నదని రచయిత ఉద్దేశ్యము కావచ్చును. ఈ ఎన్నికలు వచ్చి పల్లెటూళ్లలో రాజకీయములు బలియుట తప్ప మరొక ప్రయోజనము లేదన్న తాత్పర్యమునే రచయిత సారథి యందు నిదర్శనము చేసి చూపించెను.

సమాజములో శీలము చెడిపోవుటను రచయిత ఎక్కువగా ప్రదర్శించుచున్నట్లున్నది. ఈ విషయమున అధిక ప్రయోజనమును పొందగలుగునట్లుగా ఆలోచించి వ్రాయుట మంచిది.

సమీక్ష : అరుణాదేవి యని ఒకామె సుదీర్ఘ స్వగత మీా నవల. ఆమె తన గతించిన భర్త మీాదుగా తన వెనుకటి జీవితమును తన అప్పటప్పటి పరిసరాలను ఒక విధముగా నెమరుకు తెచ్చుకొనుటను రచింపగా నిది నవల యైనది. అరుణాదేవి జీవిత మను యే గాని జీవిత సంఘటన లేవియు చెప్పుకోదగ్గవిందు లేవు. ఏదో ఇంత ఆవగింజంత విషయమును జ్ఞాపకము చేసికొని దానిమీాద గుమ్మడికాయంత వ్యాఖ్యానముగా తానేదో మహామేధాసంపన్నురా లన్నట్లు ఆలోచించుట ఆ పాత్రయొక్క జీవ సంస్కారమున కనుగుణముగా లేదు. రచయిత తాను చెప్పదలచుకొన్న దానికి మార్గముగా నొక పాత్రను సృష్టించి తానందు పరకాయ ప్రవేశము చేసి చేయవచ్చును. తాను ప్రవేశించుటకు వీలయినంత బలమయిన సంస్కారమును ఆ పాత్రయందు ముందు నిక్షిప్తము చేసిగాని చేయరాదు. అట్లు చేయనిచో ఆలోచనకు ఔచిత్యముండదు.

మరియు అరుణాదేవికి జీవితముయొక్క అవగాహన బాధ్యతాయుతముగా లేదు. లేనప్పుడు రచయిత తాను దూరముగానుండి హెచ్చరికలు చేయవలయును. శ్రీ నరసింహారావుగారు చేయుటలేదు. రచయిత తన ఆలోచనలను అరుణాదేవి చేతికందించుట పిచ్చిదాని చేతికి రాళ్లందించినట్లున్నది. అందువల్ల కొన్ని కొన్ని సరియైన అవగాహనతోకూడిన సామాజిక శాస్త్రీయ దృక్పథమునుండి వచ్చిన ఆలోచనా విధానములు కూడ అస్థాన పతితములై అటు ఇటు కాకుండ పోయినవి. ఈ నవలకు పెద్ద ఉద్దేశ్యము లేదు.

లక్ష్మీనాథ బెజ్బరువా

(రచన : శ్రీ హెమ్ బరువా. అనువాదము : శ్రీ ఆర్. యస్. సుదర్శనం. ప్రచురణ : సాహిత్య అకాడెమీ న్యూఢిల్లీ. వెల : రు. 2.50. పుటలు డెమ్మి 67.)

అస్సామీ భాషా సాహిత్యములలో ఆధునిక యుగమును అక్షరాలా అవతరింపజేసిన మహానుభావుడు శ్రీ లక్ష్మీనాథ బెజ్బరువా. ఈయన సాహిత్యములో ఎంతవాడో రాజకీయములలోకూడ అంతవాడే. అస్సామీ భాషా సాహిత్య సంస్కృతీ సంప్రదాయములను వెలికి తీసికొని వచ్చివాని మౌలికము లయిన విలువలను నిరూపించి ప్రజాబాహుళ్యమును అటువైపు త్రిప్పిన శ్రీ బెజ్బరువా జీవితమును ముఖ్య సంఘటనలనేర్చికూర్చి సంగ్రహముగా శ్రీ హెమ్. బరువా ఆంగ్లమున రచించినారు. ఆధునిక భారతీయ సాహిత్య నిర్మాతలు అను శీర్షికను ఢిల్లీ కేంద్ర సాహిత్య అకాడమీ వారు వ్రాయించి ప్రచురించెడు వానిలో ఇది యొకటి.

శ్రీ హెమ్ బరువా ఆధునిక అస్సామీ సాహిత్యములో శ్రీ లక్ష్మీనాథ బెజ్బరువా స్థానమును సవిమర్శముగా నిరూపించు ప్రయత్నమిందు మిక్కిలి సమర్థవంతముగా చేసినారు. పుస్తకము చిన్నదియైనను ఒక భాషా సాహిత్యమునకు యుగకర్త అయినవానినెంత ఉదాత్తముగా నిరూపింప వలెనో అంత ఉదాత్తముగాను ఇది నిరూపించు చున్నది.

శ్రీ సుదర్శనంగారు ఆంధ్రాంగ్ల భాషా సాహిత్యములందు సవ్యసాచి. ఆయన ఈ తెనుగు అనువాదము చక్కని పాకమున హాయిగా చదివించుకొనిపోవు చున్నది. మధ్య మధ్య ఉదాహరించిన కవితా ఖండముల అనువాదముకూడా మూలగ్రంథమునకు ముఖ్యముగా శ్రీ లక్ష్మీనాథ బెజ్బరువాకు సముచితముగా న్యాయము చేయుచున్నవి.

—క్షేమేంద్ర.

ఆంధ్ర సంస్కృత కోశము

(సంపాదకులు డాక్టర్ పుల్లెల — శ్రీరామచంద్రుడు, శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, డెమ్మీ 538 పేజీలు. క్యాలికో బైండు. వెల 15 రూ ప్రకాశకులు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవన్, హైదరాబాదు—1.)

భాషా వాఙ్మయాలలో ప్రవేశం కలగడానికీ, వివిధ పదాల అర్థాలను తెలుసుకోడానికీ నిఘంటువులు ఎంతో అవసరం. మన ప్రాచీనులు వీటిని కంఠస్థం చేసి గొప్ప విజ్ఞానాన్ని సంపాదించేవారు. తదనుగుణంగా అప్పటి నిఘంటువులు పద్యరూపంగానే ఉండేవి. సంస్కృతంలోని అమరకోశం, తెలుగులోని ఆంధ్రనామ సంగ్రహం మొదలైనవి దీనికి ఉదాహరణలు.

పాశ్చాత్య పద్ధతిని అనుసరించి గత శతాబ్ది చివరి కాలంలో బ్రౌణ్యా నిఘంటువు, శబ్దరత్నాకరం, సర్వశబ్ద సంబోధిని మొదలైన కోశాలు వెలువడ్డాయి. కొన్ని తెలుగు పదాలకు తెలుగు అర్థాన్ని ఇచ్చేవి. కొన్ని సంస్కృతానికి తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ అర్థం తెలిపేవి. అంతేకాని తెలుగు పదాలకు వాడుకలో ఉన్న సంస్కృత పదాలను తెలిపే నిఘంటువు మాత్రం ఇంతవరకూ రాలేదు. ఆ లోపాన్ని తీర్చడానికోసమై ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సంస్కృత శాఖవారు ఆలోచించి, తగిన పథకం ఏర్పరిచారు. సమగ్రులైన విద్వాంసులు శ్రీ రామచంద్రుడుగారు, శ్రీ లక్ష్మణశాస్త్రిగారూ అచిరకాలంలోనే 'ఆంధ్ర సంస్కృత నిఘంటువు'ను తయారుచేశారు. అకాడమీవారు ప్రకటించారు.

ఈ నిఘంటువు సంస్కృత భాషావేత్తలు తెలుగు పదముల అర్థములను తెలిసికొనుటకై ఉద్దిష్టమైనది కాదనీ, తెలుగు తెలిసినవారు ఆయా తెలుగు పదములకు సంస్కృతములో ఏవి పర్యాయపదములో తెలిసికొనుటకై ఉపయోగించునదనీ కూర్పరులు 'పీఠిక'లో వివరంగా తెలియజేశారు. అందువల్ల ఇది ఒక పర్యాయపద నిఘంటువని స్పష్టమవుతున్నది. తెలుగు పదాలకు సంస్కృతంలో ప్రసిద్ధంగా ఉన్న పర్యాయ పదాలన్నీ ఇందులో చూపడం ఒక విశేషం. నిఘంటు నిర్మాణ పద్ధతిలో ఇది మోనియర్ విలియమ్స్ పండితుని ఆంగ్ల—సంస్కృత నిఘంటువును అనుసరించినది.

ఇందులో తెలుగు ధాతువులకు సమానార్థకాలయిన సంస్కృత ధాతువులను చెప్పడమేకాకుండా వాటి ప్రక్కనే బ్రాకెట్లలో ఆ ధాతువు దశగణాల్లోనూ ఏ గణానికి చెందినదో ఆ గణమూ, వర్తమానార్థకమైన 'లట్' ప్రథమ పురుషైక వచన రూపమూ ఇవ్వబడినవి. అందువల్ల అది పరస్మైపదియో, ఆత్మనేపదియో సులభంగా తెలుసుకోవచ్చును. ఉభయపది అయితే రెండు రూపాలూ చూపబడినవి. అంతేకాకుండా సుబంత రూపాలయిన వాటి క్త ప్రత్యయాంతాలూ, అసమాపకక్రియలైన తుమున్నంతాలూ కూడా ఇవ్వబడినవి. ఇందువల్ల తెలుగు తెలిసిన వారికి సంస్కృత భాషా పరిజ్ఞానం కూడా కొంత సంపాదించడానికి ఈ నిఘంటువు ఉపకరిస్తున్నదని చెప్పవచ్చును. అయితే తుమున్నంతాలతోపాటు క్త్వాప్రత్యయాంతాలను కూడా చేరిస్తే ఎంతో బాగుండేది. అవి అసమాపకక్రియలలో ప్రాముఖ్యం వహించినవి గదా!

సంస్కృత శబ్దాలకు లింగాన్ని గ్రహించడం చాలా కష్టం! ఇ–ఉ–ఋ–ఓకారాంతాల విషయంలో తరచు సందేహం కలుగుతూనే ఉంటుంది. సందేహానికి అవకాశం ఉన్న చోట్లలో ఆయా శబ్దాల లింగం బ్రాకెట్లలో చూపబడింది. ఇది ఎంతో ఉపయోగకరమైనది.

నిఘంటువులు సామాన్యంగా బృహదాకృతిలో ఉంటాయి. వాటిని సులభంగా మనతో తీసికొనిపోవడం కష్టం! ఈ 'ఆంధ్ర సంస్కృత కోశం'లో పాతికవేల పదాలు ఉన్నా, స్పష్టమయిన చిన్న అచ్చులో కూర్చబడుటవల్ల తక్కువ పుటలనే ఆక్రమించి, ఎక్కువ విషయాన్ని బోధిస్తూ ఉన్నది. కొత్త పద్ధతిలో అందరికీ అందుబాటులో ఉండే రీతిగా కూర్చబడిన యీ నిఘంటువు ఆంధ్ర సంస్కృత భాషాభిమానులందరి ఆదరాభిమానాలనూ చూరగొని తగిన ప్రచారం పొందగలదని ఆశిస్తున్నాను.

శ్రీ బులుసు వెంకటరమణయ్య

గ్రంథ స్వీకారము

దేవుని దృష్టిలో అంతా సమానులే

[మహాత్మాగాంధీ రచనలనుంచి సంకలనం] ప్రతి వెల: 2 రూపాయలు; దొరకుచోటు: పబ్లికేషన్ డివిజన్; రేడియో, సమాచార మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం; న్యూఢిల్లీ—1.

కొత్త సృష్టి

వచనగేయ సంపుటి

రచన: భూషణం; వెల: రు. 1—25 లు, ప్రతులకు: ఉపాధ్యాయ ప్రచురణాలయం; చెట్లబజారు, విజయవాడ—2.

సంఘం చెక్కిన శిల్పం

(నాటకం)

రచన: కె. ఎస్. టి. శాయి వెల: రు. 2—50. అరుణ పబ్లిషింగ్ హౌస్, మ్యూజియం రోడ్డు, గవర్నరుపేట, విజయవాడ.

శ్రీ భగవద్గీత

గేయకృతి

తెలుగుసేత: కపి వెల: రూ. 1—50 (పుటలు 120) ప్రాప్తిస్థానము: వాణీ బుక్ సెంటర్, మహబూబు నగరము (ఆం. ప్ర)

న్యాయం

(ఇతర కథలు)

రచన: భూషణం వెల: 1 రూపాయ (పుటలు 54) ప్రతులకు: ఉపాధ్యాయ ప్రచురణాలయం, చెట్ల బజారు, విజయవాడ—2.

శ్రీ ధన్వంతరి

పండిత డి. గోపాలాచార్ల శతజయంతి సంచిక (1972) మా కార్యాలయానికి చేరింది. వెల: రూ 5 లు. పుటలు 166. వివరములకు శ్రీ ధన్వంతరి కార్యాలయము, ముక్త్యాల, కృష్ణాజిల్లా.

శ్రీ కొవ్వలి

శ్రీ కొవ్వలి లక్ష్మీ నరసింహారావు షష్ట్యబ్దపూర్త్యుత్సవ సంచిక మా కార్యాలయానికి అందింది. అమూల్యము. పుటలు 66. వివరములకు: షష్ట్యబ్దపూర్తి ఉత్సవ నిర్వాహక సంఘము, నెం—6. పద్మనాథ పిళ్ళై గార్డెన్ స్ట్రీట్, కోడంబాకం, మద్రాసు 24.

చంద్రశేఖర శతకము

గ్రంథకర్త: శ్రీ అఖండం సీతారామశాస్త్రి అమూల్యము. పుటలు: 28. ప్రతులకు: శ్రీ అఖండం సీతారామశాస్త్రి నెం. 39, జానకిరామపిళ్లైవీధి, వెస్టు మాంబళం, మద్రాసు—33.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్ర

పద్య కావ్యము

(రచన: శ్రీ పాణ్యం నరసరామయ్య, పుటలు: 23. వలయువారు 50 పైసల స్టాంపులు క్రింది వారికి ప్రతులను తెప్పించుకోవచ్చును. శ్రీ పాణ్యం నరసరామయ్య, ఉయ్యాలవాడ పోస్టు, కోవెలకుంట్ల తాలూకా, కర్నూలుజిల్లా' లేక శ్రీ కర్నాటి అయ్యపురెడ్డి, రూపనగుడి పోస్టు, కోవెలకుంట్ల తాలూకా, కర్నూలుజిల్లా.

మాతృచరణ సన్నిధిలో స్వామి వివేకానంద—ఏకపాత్రాభినయం

రచన : శ్రీ జమదగ్ని, ప్రచారకులు : విశ్వ హిందూ పరిషత్, బాపట్ల. పుటలు : 8 వెల 8 కాసీలు రూపాయి.

సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కులు

(సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు పొందిన వ్యాసాలు)

రచన : జె. నరేంద్రదేవ్ వెల రు. 5 ప్రాప్తి స్థానం : విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, ఏలూరు రోడ్డు, విజయవాడ—2.

మార్క్సు ఎంగెల్సుల గురించిన స్మృతులు

(సంకలనం)

అనువాదం : రాచమల్లు రామచంద్రారెడ్డి మూల్యం : రు. 3.55 ప్రచురణ 'ప్రగతి' ప్రచురణాలయం, మాస్కో.

వ్లదీమిర్ ఇల్యీచ్

లెనిన్ (కావ్యం)

అనువాదం : శ్రీ శ్రీ మూల్యం : రు. 1–25 ప్రచురణ 'ప్రగతి' ప్రచురణాలయం, మాస్కో.

ఉగాది స్వర్ణభారతి

(పద్యకావ్యగుచ్ఛం)

రచన : కల్లూరు అహోబలరావు వెల : రూ. 3-00 ప్రాప్తిస్థానం : శ్రీకృష్ణదేవరాయ గ్రంథ మాల, హిందూపురం (ఆంధ్రప్రదేశ్).

దేవమానవ బోధలు

మూల్యం : రు 5–00. సంధానకర్త ప్రచురణకర్త : మద్దాల లక్ష్మీనారాయణ గుప్త, స్వర్గాశ్రమము, చిలకలపూడి, కృష్ణాజిల్లా, ఆంధ్ర ప్రదేశ్

త్రివేణి

(ఆంగ్ల త్రైమాసపత్రిక)

1973 (జనవరి—మార్చి) సంచిక మా కార్యాలయానికి చేరింది. సంవత్సర చందా : రూ. 12/— విడిప్రతి రూ. 3.25 ప్రాప్తిస్థానం : త్రివేణీ పబ్లిషర్స్, మచిలీపట్నం—1.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-1. Editor : S. Radhakrishna.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/-	రు. 150/-
2 లేక 3 వ కవరు పేజి	...		
ఒకే (నలుపు) రంగు	...	రు. 150/-	రు. 125/-
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	రు. 125/-	రు. 100/-
అర పేజి	...	రు. 65/-	రు. 55/-
పావు పేజి	...	రు. 40/-	రు. 35/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥నకు వరుసగా 6 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12-00
6 మాసముల చందా	...	రు. 6-00
విడి ప్రతి	...	రు. 1-00

మేనేజరు, భారతి.

మద్రాసు-1.